ఈనాడు కడప

గురువారం 4 జనవరి 2018 | 16 పేజీలు



సీఎంకు చీనీహారం



పులివెందుల సభలో సీఎం చంద్రబాబు అభివాదం

లింగాల ఆదర్శంగా జిల్లా అభివృద్ధి చెందాలి

నీళ్లిచ్చి ప్రోత్సాహం అందిస్తాం.. కరవు సీమలో పచ్చదనం తెస్తాం

జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

గండికోట-చిత్రావతి ఎత్తిపోతల పథకం జాతికి అంకితం


సీఎం పర్యటన విశేషాలు 3లో

ఆరు డిగ్రీ కళాశాలలకు జరిమానా

◆ గుర్తింపు ప్రక్రియలో అక్రమాలపై విచారణ కమిటీ నివేదిక

◆ రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అపరాధ రుసుం విధింపు

యోవేవి (కడప), న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో 'గుర్తింపు' (అఫ్లియేషన్) అక్రమాలపరంగా అభియోగాలునమోదైన డిగ్రీ కళాశాలలకు రూ.4 లక్షల నుంచి రూ.ఆరు లక్షల వరకు జరిమానా విధించినట్లు వీసీ ఆచార్య ఎ.రామచంద్రా రెడ్డి బుధవారం తెలిపారు. యోవేవి పరిధిలోని కొన్ని డిగ్రీ కళాశాలలు నకిలీ పత్రాలు సృష్టించి గుర్తింపు పొందాయనే ఆరోపణలపై విచారణ జరపడానికి నియమించిన కమిటీ విశ్వవిద్యాలయానికి నివేదిక సమర్పించింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కళాశాల అభివృద్ధి మండలి డీన్ రామకృష్ణ, యోవేవి నానోటెక్నాలజీ విభాగం ఆచార్యులు శంకర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించామన్నారు. వీరు డిగ్రీ కళాశాలల పూర్తి పారదర్శకంగా విచారణ చేపట్టి తుది నివేదిక సమర్పించారు. కమిటీ సిఫారసుల మేరకు ఆరు కళాశాలలపై చర్యలు చేపపట్టినట్లు రిజిస్ట్రార్ కె.చంద్రయ్య తెలిపారు. కమిటీ తన నివేదికలో వెల్లడించిన విధంగా అభియోగాలు -మిగతా 13లో



బాబు ఆదేశం.. బాబూరావు వినమ్రం

సీఎం సూచనలను శ్రద్ధగా ఆలకిస్తున్న కలెక్టర్



అధినేత మెచ్చె.. సతీష్‌రెడ్డి మురిసె

సభలో మాట్లాడుతున్న చంద్రబాబు పక్కనే సతీష్‌రెడ్డి

ఉద్యానానికి ఊతం.. ప్రగతికి సంకేతం!



హిజ్రాకు ఉద్యోగపత్రం అందిస్తున్న చంద్రబాబు, పక్కన సతీష్‌రెడ్డి

పులివెందుల, పులివెందుల గ్రామీణ, వేంపల్లె, లింగాల, సింహాద్రిపురం - న్యూస్‌టుడే : వ్యవసాయం కంటే ఉద్యాన పంటలు రైతుకు మేలు చేస్తాయి.. తక్కువ పెట్టుబడి, శ్రమతో ఎక్కువ ఆదాయాన్ని పొందడానికి తోడ్పడతాయి. కరవు సీమ కడప జిల్లాలో ఉద్యాన పంటల సాగు అవసరం చాలా ఉంది. ఇక్కడ లింగాల ప్రాంత రైతుల చొరవ చూస్తే ముచ్చటేస్తోంది. ఉద్యానానికి రాయితీలతో ఊతం ఇచ్చి భవిష్యత్తులో ప్రగతికి సంకేతంగా మార్చుతాం..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జిల్లాలో ఆయన బుధవారం పులివెందుల, లింగాల ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో కడప విమానాశ్రయానికి చేరుకున్న బాబు.. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా 11.30 గంటలకు లింగాల మండలం పార్నపల్లె సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ -మిగతా 13లో



సభలో ఎంపీ అవినాష్‌రెడ్డిని రాజకీయం చేయవద్దంటున్న సీఎం చంద్రబాబు



చంద్రబాబుతో కలిసి వేదికపై ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

అలుపులేదు మాకు గెలుపు దక్కువరకు



కడప మున్సిపల్ మైదానంలో యువకుల పరుగు

నవ భారత యువతను సరిహద్దులో జవానుగా ఎంపిక చేయడానికి కడపలో నిర్వహించిన ఎంపికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి.. 1.6 కిలోమీటర్ల పరుగుపందెం గమ్యాన్ని చేరడానికి మెజార్టీ యువత కష్టించాల్సి వచ్చింది.. 4 వేల మందికి పైగా ఎంపికలకు హాజరవగా కేవలం 618 మంది అర్హత సాధించారు. అనంతరం మిగతా పరీక్షలను నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి జరిగిన ఈ పరీక్షల్లో అనంతపురము, ప్రకాశం జిల్లాలకు చెందిన యువత పాల్గొన్నారు.

- వివరాలు 16వపేజీలో...

రెండో రోజు జన్మభూమి ప్రశాంతం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : కడప జిల్లాలో జరుగుతున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమంరెండోరోజు ప్రశాంతంగా సాగింది. బద్వేలులోని ఎనిమిదో వార్డులో మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోని 105 గ్రామసభలు ప్రశాంతంగానే సాగాయి. సీఎం చంద్రబాబు పులివెందులలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న నేపథ్యంలో ఆ నియోజకవర్గంలోని పలు మండలాల్లో గ్రామసభలు జరగలేదు. బద్వేలు పట్టణంలోని ఎనిమిదో వార్డులో సీపీఐ నాయకులు గ్రామసభను అడ్డుకున్నారు. నాలుగు గ్రామసభల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు.

◆ **నేడు గ్రామసభలు :** జిల్లాలో గురువారం 89 గ్రామ పంచాయతీల్లోనూ, మరో 27 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం జరగనుంది. కడప నగరంలో రామాంజనేయపురం, ప్రకాశ్‌నగర్, సాయిబాబా అనాథాశ్రమం, రెడ్‌క్రాస్ బిల్డింగ్, రవీంద్రనగర్‌లలో గ్రామసభలు నిర్వహించనున్నారు.

కాసులు కురిపిస్తున్న ఉల్లి

క్వింటా ధర రూ.3200

వేముల, న్యూస్‌టుడే: ఉల్లిపంట రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. క్వింటా ధర రూ.3200 పలుకుతోంది. దీంతో గత రెండేళ్ల నుంచి నష్టాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ధరల పెరుగుదల ఊరటనిచ్చింది. సాగులో ఉన్న పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఉల్లికి రెక్కలు వచ్చాయి. దీంతో కొంతవరకు రైతుకు ఉపశమనం లభించిందని చెప్పవచ్చు. వేరుసెనగ, పప్పుశనగ, మినుము ధరలు పాతాళానికి చేరాయి. ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. రబీలో చాలామంది రైతులు గత్యంతరం లేక వేరుసెనగ, పప్పుశనగ పంటలనే సాగుచేయాల్సిన పరిస్థితి వచ్చింది. నీటి సౌలభ్యం ఉన్న రైతులు ప్రత్యామ్నాయంగా రబీలో ఉల్లిని సాగుచేశారు. అలా సాగుచేసిన రైతుల పంట పండుతోంది. ప్రస్తుతం దిగుబడి వచ్చిన రైతులకు ధరల పెరుగుదలతో ఆర్థిక ఇబ్బందులు తొలగనున్నాయి.

★ రబీలో జిల్లాలో 4,230 హెక్టార్లలో రైతులు ఉల్లిని సాగుచేశారు. పులివెందుల, కమలాపురం, పెండ్లిమర్రి, సిద్ధవటం, మైదుకూరు, చింతకొమ్మదిన్నె, దువ్వూరు మండలాల్లో పెద్దఎత్తున ఈ పంట వేశారు. వేముల మండలంలోని నారేపల్లె, వేముల, గొందిపల్లె, పెద్దజూటూరు, చింతలజూటూరు తదితర గ్రామాల్లో నాలుగు వందల ఎకరాల వరకు సాగుచేశారు. ముందుగా సాగుచేసిన పంట కోతకు వచ్చింది. దీంతో విక్రయించేందుకు రైతులు కోత కోస్తున్నారు. ధర ఓ నెల వరకు నిలకడగా ఉంటే నష్టాల నుంచి తాము గట్టెక్కుతామని ఉల్లి రైతులు చెప్తున్నారు.


విక్రయించడానికి గ్రేడింగ్‌చేస్తున్న కూలీలు


సాగులో ఉన్న ఉల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన డేవిడ్


విలపిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

పగిడాల(రాజుపాళెం), న్యూస్‌టుడే: రాజుపాళెం మండలంలోని పగిడాల గ్రామ సమీపంలోని మలుపు వద్ద మంగళవారం రాత్రి పల్లోలి గ్రామానికి చెందిన డేవిడ్ అలియాస్ నవన్‌కుమార్(24) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందారు. బుధవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు విగతజీవిగా పడివున్న మృతదేహాన్ని గుర్తించి రాజుపాళెం పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. డేవిడ్ భార్య హరీష క్రిస్మస్, నూతన సంవత్సరం పండగలకు ఆమె స్వంత గ్రామమైన కర్నూలు జిల్లా, చాగలమర్రి మండలంలోని నేలంపాడుకు వెళ్లింది. పండగలు పూర్తికావడంతో డేవిడ్ తన భార్యను స్వంత గ్రామం పల్లోలికి తీసుకొచ్చేందుకు మంగళవారం సాయంత్రం 6గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై నేలంపాడుకు బయలుదేరాడు. అతను ప్రొద్దుటూరు నుంచి వెళ్తున్న సమయంలో పగిడాల గ్రామ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదానికి గురై మృతి చెందారు. బుధవారం ఉదయం రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ మారుతీరావు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి పల్లోలి వాసి డేవిడ్‌గా గుర్తించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య హరీష, బంధువులు ఘటనా స్థలం చేరుకొని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతునికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. శవపరీక్ష కోసం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డేవిడ్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు అదుపుతప్పి ప్రమాదానికి గురై మృతిచెందినట్లు రాజుపాళెం పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పిల్లల హక్కులను హరిస్తే నేరం

ఆకస్మిక తనిఖీ చేసిన జడ్జి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు పిల్లల కోసం ప్రత్యేకంగా కేటాయించిన హక్కులను ఎవరూ హరించరాదని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి యుయు.ప్రసాద్ అన్నారు. కడపలోని ప్రభుత్వ బాలుర గృహంతో పాటు అక్కడే ఉన్న ప్రభుత్వ బాలుర పరిశీలన గృహాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పిల్లలకు సంబంధించిన రిజిష్టర్‌ను పరిశీలించారు. హాజరును పరిశీలించి అందరు ఉన్నారా..? లేదా..? అని తనిఖీ చేశారు. అనంతరం అక్కడున్న పిల్లలతో మాట్లాడారు, ఏవైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎలాంటి భోజనం పెడుతున్నారని నిర్వాహకులను అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాల లోపు ఉన్న బాలురకు సుప్రీంకోర్టు కొత్త చట్టాలతో పాటు హక్కులను కల్పించారని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వారి హక్కులకు భంగం వాటిల్లరాదని చెప్పారు. పిల్లలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర గృహ పర్యవేక్షణాధికారి అన్నాజీతో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు.


ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలోని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి యుయు.ప్రసాద్

అరగంట ఆలస్యంగా ముఖ్యమంత్రి రాక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప విమానాశ్రయానికి అరగంట ఆలస్యంగా వచ్చారు. వాస్తవానికి విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 11.10 గంటలకు రావాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి వచ్చిన విమానం 11.42 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంది. కాగా ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు మాజీ ఎమ్మెల్యే వీర శివారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నర్సింహారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సాయిప్రతాప్, తితిదే మాజీ పాలకమండలి మాజీ సభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే అప్పటికే సీఎం రాక ఆలస్యం కావడంతో ఎవరినీ కలవకుండా హెలికాప్టర్‌లో పార్నపల్లెకు బయలుదేరారు. కేవలం జేసీ-2 శివారెడ్డి మాత్రమే ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఆర్వో బాబయ్య, ఏఆర్ డీఎస్పీ తదతరులు పాల్గొన్నారు.

181వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు

బిల్టప్, (కడప) న్యూస్‌టుడే: కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని డిమాండ్ చేస్తూ కోటిరెడ్డి కూడలిలో రాకపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు బుధవారంతో 181వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను రాయలసీమ రైతు సంఘం నాయకులు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండి కూడా కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించబడలేదంటే ఇంతకంటే దౌర్భాగ్య పరిస్థితి మరొకటి ఉండదని విమర్శించారు. విభజన చట్టంలోని హామీని సాధించలేని ముఖ్యమంత్రి ప్రజా సేవకుడిగా అనర్హుడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా రాయలసీమలో బతికి ఉండాలంటే ఉక్కు పరిశ్రమను సాధించుకు రావాలని అన్నారు. అప్పుడే ఇక్కడి ప్రజలు నమ్ముతారని, లేకపోతే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఉక్కు సాధించే వరకు ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిరుపాల్, రాజు, రాకపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు ప్రతాప్‌రెడ్డి

ఏప్రిల్ 7న ఉక్కు సాధనకు మహా ప్రదర్శన

కడపలో ఉక్కు పరిశ్రమకు ఏప్రిల్ 6వ తేదీలోపు శంకుస్థాపన చేయకపోతే, 7వ తేదీన కడపలో భారీ మహాప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ (భాకపా) జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం కడపలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేయకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పులివెందుల జన్మభూమి కార్యక్రమంలో ఉక్కుపై ప్రశ్నిస్తారనే అనుమానంతో నాయకులను ఉక్కు పాదంతో ముందస్తుగా అరెస్టు చేయడం దుర్మార్గమని ఖండించారు. ఉక్కు ఉద్యమాన్ని పరిగణలోకి తీసుకుని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అయిదు విడతల జన్మభూమి కార్యక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు.


విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బిల్టప్, (కడప) న్యూస్‌టుడే: ఏపీలోని జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలలో పనిచేస్తున్న విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం కడపలోని డివిజన్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఏపీ విద్యుత్తు ఒప్పంద కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన నిర్వహించామని చెప్పారు. ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుంటే ఈ నెల 27వ తేదీ నుంచి సమ్మెలోకి వెల్లడం జరుగుతుందని చెప్పారు. కార్మికులందరినీ రెగ్యులర్ చేయడం, సమానపనికి సమాన వేతనం, చనిపోయిన వారికి నష్టపరిహారం వంటి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో లలితమ్మ, రమేష్, గణేష్‌బాబు, గురుప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీపతి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


డీఈ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న ఉద్యోగులు


నారీ ప్రతిన : జన్మభూమి సభలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు


అధినేత అభివాదం


'ఫల'హారం

పులివెందుల : శ్రమించే సీఎంకు దానిమ్మ దండ


వారెవ్వా : స్టాల్‌లో ఉంచిన నల్లపురెడ్డిపల్లె అరటిగెల


సమరోత్సాహం : పులివెందులలో తెదేపా శ్రేణుల ర్యాలీ


సభలో ప్రసంగిస్తున్న సతీష్ రెడ్డి

కరవు సీమపై వరాల వర్షం


పులివెందులలో జరిగిన ర్యాలీలో డప్పుల హోరు

గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా పీబీఆర్ లోకి నీటిని విడుదల కార్యక్రమం సందర్భంగా లింగాల మండలంలోని పార్నపల్లి వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున పోలీసు బలగాలు ఇక్కడ మోహరించాయి. హెలీప్యాడ్ వద్ద జిల్లా పోలీసులతో పాటు ఎన్ఎస్‌జీ బలగాలు కూడా తనిఖీలు చేపట్టాయి. బుధవారం ముఖ్యమంత్రి గన్నవరం నుంచి విమానంలో కడపకు చేరుకొని, అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి పార్నపల్లి డ్యాం సమీపంలో కొండల నడుమ ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు మధ్యాహ్నం గం.12.30కి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, నేతలు మేడా మల్లికార్జునరెడ్డి, రామసుబ్బారెడ్డి, సతీష్ రెడ్డి, బీటెక్ రవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మహిళా నేత మల్లేశ్రీవాణి, కలెక్టరు బాబూరావునాయుడు, ఎస్పీ బాబూజీ తదితరులు పుష్పగుచ్ఛాలతో ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

- సింహాద్రిపురం, లింగాల, న్యూస్‌టుడే


ఉల్లాసం.. ఉత్సాహం : నృత్యం చేస్తున్న విద్యార్థినులు


గండికోట పీబీఆర్ ఎత్తిపోతల పథకం నమూనాను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి ఉమా, బీటెక్ రవి, సతీష్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు


ఎగిసిన సంప్రదాయం : ర్యాలీలో అచ్చవెళ్లి కళాకారుల కవాయి కర్రల ప్రదర్శన

సీఎం పర్యటన సాగిందిలా..

● గం. 12. 37కు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంలో ముఖ్యమంత్రి సభ వద్దకు వచ్చారు.

● గం. 12. 40కి పీబీఆర్ వద్ద ఏర్పాటుచేసిన పైలాన్ వద్ద వేదపండితులు పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దాన్ని ప్రారంభించారు.

● గం. 12. 43కి పీబీఆర్‌లోకి ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న కృష్ణాజలాలను పరిశీలించారు.

● అలాగే 12. 47కి సభవద్దకు ముఖ్యమంత్రి చేరుకున్నారు. అప్పటికే ఆలస్యం అవడంతో వెలిదండ్ల జిల్లాపరిషత్తు పాఠశాల విద్యార్థులతో ఏర్పాటుచేసిన ప్రార్థన కార్యక్రమాన్ని రద్దుచేశారు.

● గం. 12. 49కి మంత్రి ఆదినారాయణరెడ్డి సభకు విచ్చేసిన ప్రముఖులకు స్వాగతం పలికారు. జిల్లా త్వరలో హార్టీకల్చర్ హబ్‌గా మారుతుందని ఆయన అన్నారు. ఇక్కడ ప్రత్యేకంగా ప్రభుత్వ విప్ రామసుబ్బారెడ్డి పేరును ఆదినారాయణరెడ్డి ఉచ్చరించడం చర్చనీయాశమైంది. పైగా వారిద్దరు వేదికపై పక్కపక్కనే కూర్చోవడం ప్రత్యేకతను సంతరించుకొంది.

● గం. 12. 51కి సతీష్‌రెడ్డి తన ప్రసంగాన్ని ప్రాంభించారు. నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకుడి తీరును ఆయన విమర్శించారు. రైతులకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

● గం. 1. 00కు మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సభను ఉద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గ రైతుల నీటి కష్టాలు తనకు తెలుసునని, వారికి ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. చివరలో జై జన్మభూమి.. జైచంద్రబాబు అంటున్న సమయంలో ఆయన గొంతు బొంగురుపోయింది.

● గం. 1. 04కు మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం ఉన్నా సూక్ష్మసేద్యం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందన్న ఉద్దేశ్యంతో రూ. 1126 కోట్లను ఈ పథకానికి కేటాయించామన్నారు. ఇందులో కేవలం పులివెందుల నియోజకవర్గానికే రెండేళ్లలో రూ. 128 కోట్లు కేటాయించడం ఇక్కడి రైతులపై ముఖ్యమంత్రికి ఉన్న శ్రద్ధ తేటతెల్లమవుతోందన్నారు.


ప్రసంగిస్తున్న జిల్లా మంత్రి ఆది

● 1. 08 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఎత్తిపోతల పథకం గుత్తేదారులను, పనులు చేయించిన నీటిపారుదలశాఖ అధికారులను అభినందించారు. ఇక్కడికి నీరు ఊరికే రాలేదని, నీటిని ఇక్కడికి రప్పించడం కోసం ప్రతి నిమిషం కష్టపడ్డామన్నారు. ఇక్కడి రైతాంగానికి నీరు అందుబాటులో ఉంటే మరింత అభివృద్ధి సాధిస్తారన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలోని వారు కూడా వ్యవసాయం వైపు చూస్తున్నారని, భవిష్యత్తులో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చడంతో పాటు, అనుబంధ పరిశ్రమలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పాడిసంపద పెరగాలని, అవసరమైతే శీతల గిడ్డంగులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

● గం. 1. 37కి ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించి పులివెందులకు బయలుదేరి వెళ్లారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీబీఆర్ ప్రాజెక్టు వద్ద నిర్వహించిన సభకు కొంతమందిని మాత్రమే సభా ప్రాంగణంలోకి అనుమతించేలా అధికారులు పాసులు ఇచ్చారు. దీంతో తనిఖీ అధికారులు సభ వద్దకు వచ్చేవారిని తనిఖీలు చేసి అనుమతిపత్రాలు ఉన్న వారినే లోనికి పంపించారు.

రైల్వేకోడూరు

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అమృతవారిపల్లె(ఓబులవారిపల్లె), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ముక్కావారిపల్లె సమీపంలో ప్రధాన రోడ్డుపై కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు శివరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు గోవిందంపల్లె శంకరాపురం నుంచి శివరాజు తమ కుమారుడిని ముక్కావారిపల్లె ఉన్నత పాఠశాలలో దించేందుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా, అదే సమయంలో రాజంపేట నుంచి కోడూరు వైపుగా వెళ్తున్న కారు ఢీకొంది. గాయపడిన శివరాజును హైవే పెట్రోలింగ్ పోలీసులు తిరుపతి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఓబులవారిపల్లె పోలీసులను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ పోరు



ఉపవాస దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వెంబడి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బుధవారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉపవాసదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్నట్లు చెప్పారు. ఈనెల 2న హైదరాబాద్‌లో ఆయన దీక్ష చేపట్టినట్లు చెప్పారు. తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే అఖిలపక్ష తీర్మానంతో బిల్లును పార్లమెంటుకు పంపాలని దీక్ష చేస్తుండగా అక్కడి పోలీసులు ఆయనను అరెస్టుచేసి జైల్లో పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెంగయ్య, శేఖర్, చిన్నయ్య, సుబ్రమణ్యం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికులకు న్యాయం చేయాలి

రాజంపేట, న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థలో ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్తు డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం విద్యుత్తు ఒప్పంద కార్మికులు ఉరి వేసుకున్నట్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయకపోతే వారికి ఉరి తప్ప మరో మార్గం లేదన్నారు. కార్మికులను పర్మినెంట్ చేసి వారికి నేరుగా వేతనాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినా సమస్య పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. బిల్లు కలెక్టర్లు, మీటరు రీడర్లకు కూడా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మిక కుటుంబాలకు పరిహారం కింద రూ.10 లక్షలు ఇవ్వాలని, ఆ ఇంటిలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూఈఈయూ డివిజన్ కార్యదర్శి ఇ.శ్రీహరి, యూఈసీడబ్ల్యూయూ డివిజన్ అధ్యక్షుడు డి.సుధాకర్, కార్యదర్శి బి.బాలకృష్ణ, ఆ సంఘం నాయకులు జి.చంద్రారెడ్డి, ఎం.రాజా, కె.అమర్‌నాథ్‌రాజు, జగదీశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

చిట్వేలి, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతకు నిత్యం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించుకోవడం మన బాధ్యత అని విద్యుత్తుశాఖ ఉద్యోగి ఉప్పలపాటి రమేష్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తొమ్మిది మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇలా ప్రతి ఏడాది దుస్తులు అందజేస్తున్నట్లు చెప్పారు.

పండు పుండైతే...
ఆరోగ్యం ఆవిరి

హైకోర్టు ఆదేశిస్తున్నా ఆగని కార్బైడ్ వాడకం

బయటి తిండంతా దండగేనంటున్న వైద్యులు

పిల్లల ఆహారం పట్ల తగిన జాగ్రత్తలు తప్పనిసరి



రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఉదయం లేవగానే కారందోశలు, గుడ్డుదోశలు కావాలనిపిస్తుంది. అందులో వాడే బియ్యం, నూనెలు ఎలాంటివో మనకు పట్టదు. నోటికి రుచి తగలాలి అంతే. మధ్యాహ్నమైతే బిరియానీపైకి వెళుతుంది మనసు. ఇక సాయంత్రం నాలుగైతే గోబీ, పానీపూరి, ఛాట్ మసాలా.. ఇలా సాగిపోతుంటాయి ఆహారపు అలవాట్లు. వందమందిలో కనీసం అరవైమంది బయటి తిండివైపే మొగ్గు చూపుతుంటారు. ఇంట్లో అమ్మ కమ్మగా పప్పు, అన్నం, నెయ్యి వేసి పెడతానంటే ముద్ద దిగదుగానీ.. రోడ్డు పక్కన దుమ్ముకొట్టుకుపోయిన పదార్థాలంటే లొట్టలేసుకుంటారు పిల్లలు. మనం తీసుకునే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం బయట కనీసం టీ కూడా తాగవద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అంతా కలుషితమే..

ఆరోగ్యానికి పండ్లు మంచివని చెబుతారు. కానీ, ఇప్పుడు ఏ పండు చూసినా లోపల పుండే కనిపిస్తుంటుంది. అంటే ప్రతి కాయను సహజ పద్ధతుల్లో కాకుండా కార్బైడ్ అనే రసాయనాన్ని వినియోగించి మాగబెడుతున్నారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉమ్మడి హైకోర్టు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు తగిన ఆదేశాలను జారీ చేసింది. అయినా ఎక్కడా పెద్దగా మార్పు కనిపించడం లేదు. కోర్టు ఆదేశించినప్పుడు మాత్రమే హడావిడి చేసే అధికారులు ఆ తరువాత వదిలేస్తున్నారు. మార్కెట్లో పండ్ల కంటే కార్బైడ్‌కే ఎక్కువ గిరాకీ కనపడుతోంది. మన జిల్లా పరిధిలో సుమారు రెండువేలకుపైగా పండ్ల విక్రయ దుకాణాలు ఉండగా ఇప్పటివకు కార్బైడ్ వినియోగానికి సంబంధించి కేవలం 12 కేసులు మాత్రమే నడుస్తుండడం ఇందుకు దర్పణం పడుతోంది. కార్బైడ్ వాడి మాగించిన పండ్లు అప్పటికప్పుడు నిగనిగలాడినా కేవలం రెండు రోజులు నిల్వ చేస్తే వాటి బండారం బయటపడిపోతుంది. ముఖ్యంగా అరటిపండ్లు, మామిడిలో ఈ తేడా స్పష్టంగా కనపడుతుంది. సపోటా, చీనీ, జామ, బొప్పాయితో సహా చాలా రకాల పండ్లలో ఈ రసాయనాన్ని వినియోగిస్తున్నారు.



ఇవి కార్బైడ్‌తో మాగపెట్టిన అరటిపండ్లు

పిల్లలకు డబ్బులివ్వద్దు

బడికి వెళ్లే పిల్లలకు విరామ సమయంలో ఏదైనా కొనుక్కోమని తల్లిదండ్రులు కొంత డబ్బును ఇవ్వడం పరిపాటే. అయితే ఆయా పాఠశాలల వద్ద పిల్లలు ఎలాంటి పదార్థాలను కొని తింటున్నారో ఎవరూ గమనించడం లేదు. వాడిపోయిన మామిడి ముక్కలను ఉప్పూకారం కలిపిన నీళ్లలో నానబెట్టి, పుచ్చిపోయిన పండ్లు, కాలంచెల్లిన పొట్లాలను ఇక్కడ విక్రయిస్తుంటారు. ఇలాంటి వాటిని తినడం వల్ల పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతోపాటు చైనాసాల్ట్ అనే పదార్థాలను కలిపిన పొట్లాల తిండి పిల్లలను బానిసలుగా మార్చుతోంది. చిన్నతనంలో అలవాటయ్యే ఈ ఆహారం పెద్దయ్యే వరకు కొనసాగుతుంటుంది. ఈ పదార్థాల వల్ల చిన్నపిల్లల్లో కూడా గ్యాస్ట్రబుల్ వంటి సమస్యలు, మధుమేహంలాంటి దీర్ఘకాల వ్యాధులు చోటుచేసుకునే అవకాశముంది.

ఆహార చట్టానికి నీళ్లు..

ఆపిల్ పండ్లు ఎక్కువ రోజులు నిగనిగలాడాలని వాటిపై మైనంపూత పూస్తారు. ఇలాంటి ఫలాలు అమ్మినందుకు గతేడాది కోడూరుకు చెందిన ఓ వ్యాపారికి రూ. 20,000 జరిమానా, ఆరునెలల జైలుశిక్ష విధించారు.

ఆహార భద్రత పటిష్టతా చట్టం(ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్స్ యాక్ట్)- 2006 ప్రకారం ప్రజలకు విక్రయించే ప్రతి వస్తువు నాణ్యతగా ఉండాలి. ఇందులో ఏదైనా తేడాలు చోటుచేసుకుని అవి కోర్టులో నిరూపణ జరిగితే సదరు వ్యాపారికి రూ. 10 లక్షల వరకు జరిమానా, ఒకటి నుంచి రెండేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశముంటుంది. అయితే ఈ చట్టం అమలులో తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుంటోంది. ఏది మంచిదో ఏది చెడ్డదో తెలియని అమాయక ప్రజలు ఏదిపడితే అది కొనుక్కుని తిని అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారు. ఆ తరువాత ఆరోగ్యం కోసం మరింత డబ్బును ఖర్చు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి హైకోర్టు ఉత్తర్వులను పటిష్టంగా అమలు చేయగలిగితే ప్రజారోగ్యాన్ని పరిరక్షించినవారవుతారు.



కాయ ఏదైనా ఈ కార్బైడ్ పొట్లం పెడితే పొద్దునకల్లా పండైపోవలసిందే

కార్బైడ్ వినియోగించడం లేదు



అరటికాయలను తోటల వద్ద నుంచి కొని తీసుకువస్తాం. ఇక్కడ ఏర్పాటు చేసుకున్న రైపనింగ్ కేంద్రంలో ఇథలీన్‌గ్యాస్ వినియోగించి వాటిని మాగబెడుతున్నాం. అధికారుల సూచనల మేరకు భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాం. కొంతమంది ఇతర వ్యాపారులు కార్బైడ్ వినియోగిస్తుండడంతో, అందరికీ చెడ్డపేరు వస్తోంది. గతంలో పండ్లను మట్టితో కట్టిన గది(మూటు)లో మాగబెట్టేవాళ్లం. ఇథలీన్ గ్యాస్ వాడడం వల్ల పండ్లకు మంచి రంగు, నిల్వసామర్థ్యం వస్తాయి. ఇలాంటివి ఆరోగ్యానికి కూడా మంచిది.

- ఎం. నాగేశ్వరరావు, అరటికాయల వ్యాపారి, నాగవరం

క్యాన్సర్‌కు దారి తీయవచ్చు



పిల్లల నుంచి పెద్దల దాకా ఇప్పుడు ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. ఇంటి ఆహారం కంటే బయట దొరికేవాటికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. అధిక నూనెలు, మసాలాలు, కార్బైడ్ వినియోగం లాంటి చర్యల వల్ల ఆహారం విషతుల్యమవుతుంది. నిండా పదేళ్లునిండని పిల్లల్లో కూడా మధుమేహం కనిపిస్తోంది. గ్యాస్ట్రబుల్, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, దృష్టిలోపాలతోపాటు ఒక్కోసారి ఇలాంటి ఆహారం ప్రాణాంతకమైన క్యాన్సర్‌కు కూడా దారితీయవచ్చు. ఇప్పుడు టీపొడి కూడా కల్తీ అయిపోయింది.

- డాక్టర్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో, రైల్వేకోడూరు

రైల్వేకోడూరులో మార్కెట్ ధరలు
(నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
బెండకాయలు	30
మటిక్కాయలు	30
వంకాయలు	20
బీట్‌రూట్	40
బంగాళదుంప	25
కాకర	30
టమోటాలు	10
పచ్చిమిరప	30
క్యాలీఫ్లవర్	30
అల్లం	60
చిక్కుడు	40
క్యారెట్	80
ఎర్రగడ్డలు	50
క్యాబేజీ	40
మునక్కాయలు	140
బీన్స్	60
దొండ	40
ముల్లంగి	30

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	480
చికెన్	140
చికెన్ (స్కిన్‌లెస్)	180
100 గుడ్లు	565
డజను గుడ్లు	62
చేపలు	130

బాలికల చదువుతోనే సమాజ మార్పు

పెనగలూరు, న్యూస్‌టుడే: బాలికల చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి బి.హరిప్రసాద్ తెలిపారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని కస్తూర్బా పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే చదువు ఒక్కటే సమాజాన్ని మార్చగలదని నమ్మి ఆచరించిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రత్యేకాధికారి షాజిద, నాయకులు ఎ.శ్రీనివాసులు, ఎం.సతీష్, చెన్నయ్య, మహమ్మద్ రఫీ, లక్ష్మీనరసమ్మ, రెడ్డమ్మ, సుమలత, వనజ కుమారి పాల్గొన్నారు.

చిట్వేలి: సమాజ నిర్మాణంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని నాగవరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సుందర్‌బాబు, కార్యదర్శి అయ్యవారురెడ్డిలు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాళ్లు రాజ్యలక్ష్మీ, స్వర్ణలత, గాయత్రీలను సన్మానించారు.

ఓబులవారిపల్లె: సావిత్రిబాయిపూలే ఆదర్శనీయురాలని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ఓబులవారిపల్లె, చిన్నఓరంపాడు ఉన్నత పాఠశాలల్లో బుధవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు అరుణ, అబ్బిగారి వేణుగోపాల్‌స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో జెవివి మండల ప్రతినిధి మహేష్, ఉపాధ్యాయులు ప్రమీల, రామలింగరాజు, దయానంద్, చిన్నమ్మ, హేమలత, మీనా తదితరులు పాల్గొన్నారు.



పెనగలూరు: మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కోశాధికారి హరిప్రసాద్



ఓబులవారిపల్లె: సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు



చిట్వేలి: మహిళా ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు

సీఎం సమక్షంలో ఎంపీని అవమానిస్తారా

ఒంటిమిట్ట: పులివెందులలో బుధవారం జరిగిన జన్మభూమి- మాఊరు గ్రామసభలో ముఖ్యమంత్రి సమక్షంలోనే కడప లోక్‌సభ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డిని మాట్లాడనీయకుండా అవమానించడం చాలా అన్యాయమని జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. తెదేపా ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థ అపహాస్యం పాలవుతోందని విమర్శించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



పెనగలూరు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల

చిట్వేలి: మహిళలకు చంద్రన్న కానుకలను అందజేస్తున్న బాధ్య ఎంపీపీ గుండయ్యనాయుడు





పుల్లంపేట: సభా కళాశాల ఆవరణలోని చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వం జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని ఏపీఎండీసీ ఎండీ, నోడల్ అధికారి వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. అధికారులు కార్యక్రమానికి ఆలస్యంగా వస్తున్నారని... అలా చేస్తే చర్యలు తప్పవన్నారు. ఏపీఎండీసీ ఎండీని రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలకు నోడల్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో బుధవారం బొమ్మవరంలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రమణ మాట్లాడుతూ మండలంలోని 80 ప్రభుత్వ పాఠశాలలకు కనీస వసతులు కల్పించాలని కోరారు. స్పందించిన ఎండీ ఏపీఎండీసీ ద్వారా మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే బి.కమ్మపల్లెలో కూడా జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దార్ నరసింహులు, ఎండీవో వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు గునిపాటి చెన్నరాయుడు, పారిశ్రామికవేత్తలు మాచినేని విశ్వేశ్వరరావు, వేమన సుబ్రమణ్యంనాయుడు, కల్లా చలపతి, ఎంఈవో పద్మజ, జీఎం కేథార్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మండలానికి 425 రేషన్‌కార్డులు మంజూరు అయినట్లు ఉపతహసీల్దార్ సిద్ధేశ్వరరావు తెలిపారు. అలాగే 300 మందికి ఇంటి పట్టాలు మంజూరయినట్లు చెప్పారు. త్వరలోనే లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తామన్నారు.

చిట్వేలి: ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న వారికి జన్మభూమి- మా ఊరు కార్యక్రమం పండుగ లాంటిదని మండల బాధ్య ఎంపీపీ గుండయ్యనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం కేవీఆర్‌ఆర్‌పురంలో నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమాన్ని ఆయన సర్పంచి చెంచయ్యతో కలసి ప్రారంభించారు. తహసీల్దారు ప్రభాకరరావు మాట్లాడుతూ తీసుకున్న ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని తెలిపారు. * సమస్యల పరిష్కారానికే జన్మభూమి కార్యక్రమమని ఏపీఎండీసీ అధ్యక్షుడు వెంకయ్యచౌదరి అన్నారు. బుధవారం మండలంలోని సీఎం రాచపల్లెలో జన్మభూమి కార్యక్రమాన్ని సర్పంచి రవికుమార్ రాజుతో కలసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్‌వల్లీ తదితరులు పాల్గొన్నారు. * ఇంటి స్థలాలు మంజూరయిన లబ్ధిదారుల ప్రత్యేక వాహనంలో పులివేందులలో జరిగిన ముఖ్యమంత్రి సమావేశానికి తరలి వెళ్లారు. వీరు వెళ్తున్న వాహనాన్ని తహసీల్దారు ప్రభాకర రావు ప్రారంభించారు.



రైల్వేకోడూరు గ్రామీణ: హాజరైన ప్రజలు

శింగారెడ్డిపల్లి(పెనగలూరు): నియోజకవర్గానికి 600 విద్యుత్తు నియంత్రికలు మంజూరయినట్లు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్రాయుడు తెలిపారు. బుధవారం శింగారెడ్డిపల్లి పంచాయతీలో సర్పంచి ఈశ్వరమ్మ అధ్యక్షతన జన్మభూమి- మా ఊరు గ్రామసభ జరిగింది. పదిహేను రోజుల్లో నియంత్రికలు విద్యుత్తు కార్యాలయాలకు చేరుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, ఎంపీడీవో ప్రతాప్, ఎంపీపీ ఇర్షాద్ బేగం, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. * సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీలు కొత్త బాలకృష్ణ, తులసీ బాలకృష్ణ తెలిపారు. బుధవారం పెనగలూరు పంచాయతీలో జన్మభూమి- మా ఊరు కార్యక్రమం జరిగింది. కోఆప్షన్ సభ్యుడు షామీర్‌బాషా, జన్మభూమి కమిటీ సభ్యుడు ధనుంజయనాయుడు మండలంలో జరిగిన అభివృద్ధి నివేదికను చదివి వినిపించారు.

పుల్లంపేట: పరిసరాల పరిరక్షణతోనే సంపూర్ణం ఆరోగ్యం సమకూరుతుందని ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రేణుకాప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన పుల్లంపేట ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాల ఆవరణలో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓబనపల్లె(రైల్వేకోడూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎండీసీ ఎండీ వెంకయ్యచౌదరి తెలిపారు. బుధవారం మండలంలోని ఓబనపల్లె, రెడ్డివారిపల్లెలో జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఓబనపల్లెలో సర్పంచి చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏపీఎండీసి ఎండీ వెంకయ్యచౌదరి హాజరయ్యారు. అనంతరం మాజీ సర్పంచి గడికోట సుబ్బరాయుడు మాట్లాడుతూ తమ పంచాయతీని దత్తత తీసుకోవాలని కోరారు. స్పందించిన వెంకయ్య చౌదరి... మీ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పంచాయతీ అభివృద్ధికి రూ.70 లక్షలు మంజూరు చేస్తారు. కార్యక్రమంలో ఎమ్మార్జీ కిరణ్‌కుమార్, మాంస ఉత్పత్తుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ప్రకాశ్‌నాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వరనాయుడు, తెదేపా మండలాధ్యక్షుడు సురేష్‌రాజు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఉప తహసీల్దారు మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: మాట్లాడుతున్న ఏపీఎండీసీ ఎండీ వెంకయ్యచౌదరి



ఓబులవారిపల్లె: హాజరైన ప్రజలు

విద్యా ప్రణాళిక పక్కాగా ఉండాలి

పెనగలూరు, న్యూస్‌టుడే: ఆవాస ప్రాంత విద్యాప్రణాళికలు పక్కాగా తయారు చేయాలని ఎం.ఆర్.జి పుచ్చకాయల యల్లయ్య తెలిపారు. బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని ఆవాస ప్రాంతాల విద్యా స్థితిని, బడిఈడు పిల్లలు, బడి బయట పిల్లలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలతోపాటు విద్యార్థుల ప్రగతిని నమోదు చేయాలన్నారు. పాఠశాలలకు రాబోయే విద్యాసంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కాకి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.ఆర్.జి పుచ్చకాయల యల్లయ్య

యువతకు స్వామి వివేకానంద ఆదర్శం

వత్తలూరు(పుల్లంపేట), న్యూస్‌టుడే: స్వామి వివేకానందున్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని వత్తలూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాఠశాల విశ్రాంతి సమయంలో ముందుస్తుగా వివేకానందున్ని జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే యువ సంపద ఎక్కువగా ఉన్న దేశం భారతదేశమేనన్నారు. చెడు మార్గాల వైపు అడుగలు వేయకుండా సన్మార్గంలో నడిచేలా సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సీఆర్పీ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వత్తలూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

పాము కాటుకు బాలిక మృతి

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని టక్కోలు గ్రామంలో పాము కాటుకు మద్దబోయిన యువలత (12) మృత్యువాత పడింది. తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. సిద్దవటం మండలం టక్కోలు గ్రామానికి చెందిన యువలత స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదివేది. నాలుగేళ్ల కిందట తల్లి మృతిచెందారు. డిసెంబరు 26వ తేదీ రాత్రి యువలత ఇంటి ఆవరణలో ఉండగా పాము కాటేసిందని కుటుంబ సభ్యులు చెప్పారు. వెంటనే కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యుల సలహా మేరకు కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించామన్నారు. అదేరోజు రాత్రి తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించామని తెలిపారు. అక్కడే వారం రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం ఆరోగ్య పరిస్థితి విషమించి ఆసుపత్రిలో మృతిచెందిదని తండ్రి సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

శింగారెడ్డిపల్లి(పెనగలూరు),న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచి క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని మండల ప్రత్యేకాధికారి కె.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న ఎ.రేవతి జోనల్ క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావడంతో, అధికారులు ఈ సందర్భంగా బాలికను ఘనంగా సన్మానించారు. ప్రతి విద్యార్థి ఆటలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కస్తూర్బా పాఠశాలలో చదువుతూ పరుగు పందెంలో, ఇతర ఆటలలో మొదటి స్థానం సాధించి అందరి మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. అధికారులు విద్యార్థిని సన్మానించి జ్ఞాపిక, నగదు ప్రోత్సాహాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రతాప్, ఎంపీపీ ఇర్షాద్ బేగం, సర్పంచి ఈశ్వరమ్మ, ప్రధానోపాధ్యాయుడు పుచ్చకాయల యల్లయ్య, లక్ష్మీనరసయ్య, నరసింహా పాల్గొన్నారు.



క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు

నిబంధనల మేరకు గుడ్లు ఇవ్వాలి

దళవాయపల్లె(పుల్లంపేట), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో అందించే పౌష్టికాహారంలో గుడ్డే ప్రధామని తహసీల్దారు గౌరీశంకరరావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దళవాయపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేక అధికారి, తహసీల్దారు, మాజీ సర్పంచి మల్లికార్జునరెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు వారానికి మూడు రోజులు కోడిగుడ్లు అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేంద్రనాథ్‌రెడ్డి, రాజు, నరేంద్రనాథ్, సీఆర్పీ పాల్గొన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'ఈనాడు' సంయుక్త నిర్వహణలో

ఇంటర్ తర్వాత విద్యా, ఉపాధి అవకాశాలపై సదస్సు నేడు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ(ఎమ్‌హెచ్‌ఆర్‌డీ) నుంచి ఏ గ్రేడ్ గుర్తింపు పొందిన వర్సిటీల్లో ఒకటైన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి 'ఈనాడు' ఈ నెల 4న కడపలో 'యువత-భవిత' పేరిట విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు గీతం ప్రవేశాల విభాగం సంచాలకుడు ఆచార్య కె.నరేంద్ర సోమవారం తెలిపారు. కడప హరిత హోటల్, ఎస్పీ కార్యాలయం ఎదురుగా, కోటిరెడ్డి సర్కిల్ పక్కన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరగనుందన్నారు. ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఆర్ట్స్, కామర్స్, సైన్స్, బీఎస్సీ వంటి కోర్సుల్లో వస్తున్న మార్పులు, డిగ్రీ అనంతరం పీజీ స్థాయిలో లభిస్తున్న విద్యావకాశాలను నిపుణులు వివరిస్తారన్నారు. ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్‌తో సమానంగా ప్రాధాన్యం పెరుగుతున్న అకౌంటింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లతో కలిపిన లా, ఆర్కిటెక్చర్ కోర్సుల గురించి విద్యార్థులు తెలుసుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఇంజినీరింగ్‌లో ఏయే కోర్సులకు డిమాండ్ ఉంది. ఇంజినీరింగ్‌లో కోర్సుల ఎంపిక ఏ విధంగా చేసుకోవాలి, మంచి కళాశాలలను ఎంచుకునే విధానం, ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు తెలియజేస్తారన్నారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేక సమయాన్ని ఈ సదస్సులో కేటాయిస్తారన్నారు.

ప్రవేశానికి సమాచార కేంద్రం : సదస్సుతో పాటు గీతం డీమ్డ్ వర్సిటీలో ప్రవేశం పొందగోరేవారికి గీతం అడ్మిషన్ టెస్ట్(గాట్)- 2018 గురించిన సమాచారాన్ని అందజేయడానికి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రవేశ పరీక్ష విధానం, కేంద్రాలు, నమూనా పరీక్షకు సంబంధించిన సమాచారం ఈ కేంద్రం నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.





కార్యక్రమానికి విచ్చేసిన అధ్యాపకులు, విద్యార్థులు.. మాట్లాడుతున్న ఉపకులపతి ఆచార్య రామచంద్రారెడ్డి

మహిళాభ్యున్నతికి విద్యే ప్రధానం

యోవేవి (కడప), న్యూస్‌టుడే: మహిళా అభ్యున్నతికి విద్య చాలా ప్రధానమని, చదువుకున్న మహిళ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఉపకులపతి ఆచార్య ఎ.రామచంద్రారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన శ్రీమతి సావిత్రిబాయి పూలే 187 జయంతిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సావిత్రి బాయి పూలే ఆశయాలను నేటి మహిళలు కొనసాగించాలని ఆకాక్షించారు. నేటి మహిళాతరానికి ఆమె గొప్ప స్ఫూర్తిప్రదాతని అన్నారు. ప్రతి మహిళ ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని ఆ దిశగా పరిశ్రమించాలని ఆయన సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన యోవేవి ప్రిన్సిపాల్ ఆచార్య కె.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. స్త్రీ విద్యాభివృద్ధికి, నిమ్నవర్గాల అభివృద్ధికి సావిత్రిబాయి పులే విశేషకృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గంగయ్య, డాక్టర్ ఎం.వినోదిని, డాక్టర్ సుభాష్, ఆచార్య ఎమ్.రామకృష్ణారెడ్డి, ఆచార్య వై.నజీర్‌అహ్మద్, చంద్రమతి శంకర్, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే

కడప విద్య, న్యూస్‌టుడే: దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే.. 19వ శతాబ్దం నాటి సంకెళ్లను తెంచి సమాజంలో దళితులు, మహిళలు, వితంతువు, బాలికలకు విద్య, గౌరవాన్ని సాధించింది. పలు పాఠశాలలను స్థాపించి అనేక అవమానాలను భరించి మహిళలను విద్యావంతులను చేశారని గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యసుజాతమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు రూత్ ఆరోగ్యమేరి ఆధ్వర్యంలో భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యసుజాతమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బీఎస్సీలో 94 శాతం ఫలితాలు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) విద్యార్థులు 2017 నవంబరు, డిసెంబరులో జరిగిన సెమిస్టర్ పరీక్షల్లో గణనీయమైన ఫలితాలు సాధించారని ఆ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సుబ్బనరసయ్య తెలిపారు. బుధవారం స్థానిక కళాశాల ఆవరణలో పరీక్ష ఫలితాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బనరసయ్య మాట్లాడుతూ.. ఫైనలియర్ విద్యార్థులు బీఏలో 86 శాతం, బీకాంలో 89 శాతం, బీఎస్సీలో 94 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ఫలితాల వివరాలకై కళాశాల వెబ్‌సైట్ జీసీఎంకేఏడీపీపీఏ.వోఆర్‌జీలో సంప్రదించి తెలుసుకోవాలన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రవికుమార్, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ హరిప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ రమేష్, స్టాఫ్‌కౌన్సిల్ సభ్యుడు, డీటీపీ ఆపరేటర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేశాపురం సమీపంలో 'నివాసి' సినిమా షూటింగ్



హీరో శేఖర్‌వర్మ విద్యను కారులో నుంచి దించి ఎత్తుకెళుతున్న దృశ్యం..



కేశాపురంలో చిత్రయూనిట్, హీరో, హీరోయిన్

కేశాపురం(చిన్నమండెం), న్యూస్‌టుడే: మండలంలోని కేశాపురం గ్రామం కడప-బెంగళూరు ప్రధాన రోడ్డుపై 'నివాసి' సినిమా షూటింగ్ బుధవారం నిర్వహించారు. హీరో శేఖర్‌వర్మ, హీరోయిన్ విద్యలపై పలు సన్నివేశాలను దర్శకుడు సతీష్ వేగెళ్ల చిత్రీకరించారు. కెమేరామెన్ చిట్టిబాబు నేతృత్వంలో దృశ్యాలను కెమెరాలో బంధించారు. గాయత్రి ప్రొడక్షన్స్‌పై కె.ఎన్.రావు నిర్మాతగా, స్థానిక దేవళంపేటకు చెందిన అలగాని రెడ్డెప్ప సహ నిర్మాతగా వ్యవహరించే ఈ సినిమా రెండో షెడ్యూల్ చిన్నమండెం మండలంలో నిర్మిస్తున్నట్లు మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 12 వరకు ఈ ప్రాంతంలోనే షూటింగ్ ఉంటుందని వివరించారు. చిన్నమండెం మండలంలోని దేవళంపేట నుంచి కూతలవాండ్లపల్లెకు వెళ్లే రోడ్డులో సెట్టింగ్ వేస్తున్నారు. మండిపల్లె నాగిరెడ్డి జలాశయం, రెడ్డివారిపల్లెల్లో పలు సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. అలాగే సానిపాయి దగ్గర ఉన్న బాలరాజుపల్లె వంతెన దగ్గర, కడప రోడ్డుపై సన్నివేశాలు చేయాల్సి ఉందన్నారు. పూర్తిగా కుటుంబ కథా చిత్రమని దర్శకుడు తెలిపారు. ఇప్పటికే 50 శాతం సినిమా పూర్తయిందని, ఈ ప్రాంతంలో తీస్తే 75 శాతం పూర్తి అవుతుందని చెప్పారు. సినిమా షూటింగ్ చూసేందుకు చుట్టు పక్కల జనాలు అధికంగా తరలివచ్చారు.

పరివర్తనకు పునరావాసం

- మట్కా మానేసిన వారికి రాయితీ రుణాలు
- చెక్కులు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: మట్కా వల్ల చిన్నాభిన్నామైన వారి జీవితాల్లో వెలుగు చూడాలనే లక్ష్యంతో ఎస్పీ బాబూజీ రెండు నెలల క్రితం కడపలో భారీ ఎత్తున పరివర్తన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దాదాపు పది వేల మంది మట్కా బీటర్లు, నిర్వాహకులు, బడా వ్యక్తులు సైతం వచ్చారు. మట్కా వల్ల జరిగే అనర్థాలను వారికి తెలియజేశారు. మట్కా మానేసిన వారికి పునరావాసం కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఎస్పీ కలెక్టరు బాబూరావు నాయుడుతో మాట్లాడి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించారు. మట్కా మానేసి వారిలో ఆరుగురికి బుధవారం పులివెందులలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా చెక్కులు అందచేశారు.

● చెన్నూరుకు చెందిన కె.శ్రీనివాసులుకు పాడి పరిశ్రమ ఏర్పాటు కోసం రూ.1.21 లక్షలు, వల్లూరు మండలానికి చెందిన నాగూర్‌బాబుకు కిరాణా దుకాణం కోసం రూ.2 లక్షలు, ప్రొద్దుటూరుకు చెందిన వెంకటరమణ పవర్‌లూమ్ కోసం రూ.2 లక్షలు, కడపకు చెందిన నాగజమాల్‌కు కిరాణా దుకాణం కోసం రూ.2 లక్షలు, వేంపల్లెకు చెందిన నాగార్జున్‌కు పాల వ్యాపారం కోసం రూ.2 లక్షలు, ఎర్రగుంట్లకు చెందిన వేణుగోపాల్ జనరల్ స్టోర్ కోసం రూ.2 లక్షలు చొప్పున 50 శాతం రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేస్తూ దానికి సంబంధించి చెక్కులు అందచేశారు. రుణాలను ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారు ఇచ్చారు.

ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీ

జనవరి 2, 2018 విజేతలు

1. సి.హెచ్ జ్యోతి నిఖిల, జగ్గయ్యపేట; 2. వి. రమ్య, మధిర; 3. కె.పద్మ భారతి, యలమంచిలి; 4. ఎస్. శైలజ, జగ్గయ్యపేట; 5. కె. పూజిత, చిలకలూరిపేట; 6. డి. నాగయశస్వి, వైజాగ్; 7. దుర్గా స్రవంతి, కనుమోలు, కృష్ణా; 8. కె.వి. లావణ్య, బుచ్చిరెడ్డి పాలెం; 9. సి.హెచ్. సంధ్యారాణి, చీరాల; 10. శైలజ, రామదుర్గం, బళ్ళారి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.



యువతరం కలలకు ప్రతిరూపం
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరులలో విస్తరించిన ప్రాంగణాలతో దాదాపు 20000 మంది విద్యార్థులతో, 1200 మంది రీసెర్చ్ స్కాలర్‌లతో, 1250 మంది బోధనా సిబ్బందితో, 144కి పైగా యూజీ, పీజీ కోర్సులతో, 165కు పైగా రీసెర్చ్ ప్రాజెక్టులతో అతి పెద్ద విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. దేశంలోని డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో అత్యుత్తమమైనదిగా మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ వారిచే గుర్తింపు పొంది 4వ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో ఉన్నత విద్యా ప్రమాణాలను పర్యవేక్షించే నాక్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని 'ఎ+' గ్రేడ్ విద్యాలయంగా ప్రకటించటం విశేషం.








గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం.. రాష్ట్రంలోనే కాదు బహుశా దేశం మొత్తం మీద ప్రస్తుతం ఈ పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ప్రపంచ శ్రేణి మౌళిక సదుపాయాలు, పిహెచ్‌డి అర్హతగల అధ్యాపక బృందం, విదేశీ విశ్వవిద్యాలయాలతో సంబంధాలు, ప్రముఖ పరిశోధనా సంస్థలతో కలసి ఉమ్మడి అధ్యయనాలు ఇలా ఒకటేమిటి ప్రతి కోణంలోనూ విశేషాలను ప్రోది చేసుకుంటూ జాతీయ స్థాయిలో విద్యార్థులను ఆకర్షిస్తూ తన ప్రత్యేకతను నిలుపుతూ సంచలనాలకు కేంద్ర బిందువుగా మారింది.

దేశంలోని 140కి పైగా డీమ్డ్ విశ్వవిద్యాలయాలతో పోటీ పడి మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖచే (ఎమ్.హెచ్.ఆర్.డి.) "ఎ"కేటగిరి విశ్వవిద్యాలయంగా స్థానం సంపాదించడంతో పాటు జాతీయ స్థాయి విద్యా ప్రమాణాల అంచనా సంస్థ యుజిసికి అనుబంధంగా గల నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్)చే 'ఎ+'గ్రేడ్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది.

యుజిసి నుంచి 12బి హోదా పొందిన ఏకైక డీమ్డ్ విశ్వవిద్యాలయంగా 165కి పైగా పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వంచే ఇండస్ట్రియల్ రీసెర్చ్ సెంటర్ గుర్తింపు పొందింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐబిఎమ్, ఎరిక్‌సన్ ఇండియా, జపాన్‌కు చెందిన ఇసాయ్ ఫార్మా వంటి 50 సంస్థలతో అవగాహనా ఒప్పందాలను కలిగి ఉంది. పిహెచ్‌డి ప్రధాన అర్హత గల బోధనా సిబ్బంది పర్యవేక్షణలో కోర్సుల నిర్వహణతో పాటు ప్రత్యేకించి నాలుగు ప్లేస్‌మెంట్ సెంటర్‌లను నిర్వహిస్తోంది.

గీతంలో చేరడమంటే విద్యార్థులు, తల్లిదండ్రులు కలలు కనేలా చేయడంతో పాటు వారి నమ్మకానికి ప్రతిగా నిలుస్తోంది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అందించే ఇంజనీరింగ్, ఎమ్‌బిబిఎస్, నర్సింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, సైన్స్ లా, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎమ్‌బిఎ, ఏరోనాటికల్ ఇంజనీరింగ్ వంటి 144కి పైగా కోర్సులలో దేశం నలుమూలల నుంచి వచ్చిన 20 వేల మందికి పైగా వివిధ రాష్ట్రాల విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. విశాఖ, హైదరాబాద్, బెంగళూరులలో ప్రశాంత వాతావరణంలో నెలకొల్పిన విశాలమైన ప్రాంగణాలలో ఇంటివద్ద ఉండి చదువుతున్నట్లుగా భావించే విద్యార్థులు ఉద్యోగాలు సాధించాక గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఖ్యాతిని విస్తరింపచేస్తున్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరులోని ప్రాంగణాలను సందర్శించే వారికి విద్యార్థులకు చైతన్యాన్ని రగిలించే విధంగా ప్రాంగణాలను ఎంతటి వ్యూహాత్మక దృష్టితో ఏర్పాటు చేశారో అవగతమవుతుంది. ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ వంటి వృత్తి విద్యా కోర్సులకు ఎలాంటి వాతావరణం అవసరం అవుతుందో గుర్తించి అలాంటి పారిశ్రామిక వాడలను, నగరాలను ఏరికోరి ఎంపిక చేసుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణాలను నిర్మించారు. పరిశ్రమల కేంద్రంగా, నూతన ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రాజధానిగా పేర్కొనే స్మార్ట్ సిటీ విశాఖ నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మితమైన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణం దేశ, విదేశాల నుంచి వచ్చే వారిని విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆసియా ఉపఖండంలోని అతిపెద్దదైన నిర్మాణంగా పేర్కొంటున్న గీతం హైదరాబాద్ ప్రాంగణాన్ని చూసి తీరవలసిందే. హైటెక్ సిటీలో విశేషంగా చెప్పుకునే గీతం హైదరాబాద్ ప్రాంగణం దేశం గర్వించదగ్గ విద్యా కేంద్రంగా వృద్ధి చెందుతోంది.

దేశంలోనే తొలిసారిగా ఒక భారీ పరిశ్రమ కూడా సమకూర్చుకోలేనంతగా 1000 ఎమ్‌బిపిఎస్ నెట్ కనెక్టివిటి పొందడంతో పాటు ప్రపంచ శ్రేణి డేటా సెంటర్‌ను నెలకొల్పడం, సూపర్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేసుకోవడం, క్యాంపస్‌లోనే ఐటి కంపెనీల తరహాలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే సదుపాయాలను, తరగతి గదులు, క్రీడా ప్రాంగణాలు, సమావేశ మందిరాలు, ఏటా కోటి రూపాయలకు పైగా గ్రంథాలను, ఈ-జర్నల్స్‌ను అందుబాటులో ఉంచే గ్రంథాలయం విద్యార్థులకు ఓ వరంగా పేర్కోవచ్చు. ఐఐటిలకు ధీటుగా వసతి సదుపాయాలను గీతం సమకూర్చుకోవడం విశేషంగా పేర్కోవచ్చు.

ప్రాంగణ నియామకాలలో రికార్డు:

ఒకరు కాదు.. ఇద్దరు కాదు... వందలు దాటి వేల సంఖ్యలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను చాటి వివిధ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో ఉద్యోగాలు సాధించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు కలలు కనే ప్రముఖ ఐటి కంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఎక్సెంచ్యూర్, టెక్ మహీంద్రా, విప్రో, డెల్లాయిట్, వెరిజాన్, వర్చూసా వంటి కంపెనీలు గత మూడు నెలలుగా గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 2000 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి. అది ఇదీ అని కాకుండా అన్ని ఇంజనీరింగ్, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎమ్‌బిఎ, కోర్సులు చదివే విద్యార్థులను ప్రముఖ కంపెనీలు ఏరి కోరి భారీ వేతనాలతో ఎంపిక చేసుకోవడంతో విశ్వవిద్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది.

గత 5 సంవత్సరాలలో ఒక్క టిసిఎస్ కంపెనీలోనే 4 వేల మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించటం గమనార్హం. టిసిఎస్ సంస్థ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని 'ఎ'గ్రేడ్ విద్యా సంస్థగా గుర్తిస్తూ ప్రకటన చేయడం గీతం ఇంజనీరింగ్ విద్యకు ఉన్న నాణ్యతా ప్రమాణాలకు సూచిక. ఒక్క ఉద్యోగ సాధనలోనే కాక గీతం విద్యార్థులు స్వయంగా స్టార్టప్ కంపెనీలను ప్రారంభించటం విశేషం. ఇప్పటివరకు 25 స్టార్టప్ కంపెనీలు గీతం నుంచి ఊపిరి పోసుకున్నాయి.

ఇంటర్ విద్యార్థులకు విస్తృత అవకాశాలు...

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, ఎమ్‌బిబిఎస్, ఆర్కిటెక్చర్ కోర్సులతో పాటు పలు సైన్స్, ఆర్ట్స్, కామర్స్ కోర్సులలో ప్రవేశం పొందటానికి గీతంలో పలు రకాల కోర్సులను అందిస్తోంది. ఇంటర్ విద్యార్థులకు ఐదేళ్ల న్యాయ విద్య కోర్సును, మూడేళ్ల బిఎ సోషల్ సైన్స్ కోర్సును, కామర్స్ విద్యార్థులకు బిబిఎ, బిబిఎమ్, బికామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సైన్స్ విద్యార్థులకు ఐదేళ్ల ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ కోర్సుతో పాటు బిఐఎమ్, బిసిఎ, నర్సింగ్ కోర్సులు ఆఫర్ చేస్తున్నారు.

గీతంలో ప్రవేశం పొందాలంటే...

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష "గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్)"కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు అంతర్జాతీయ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అర్కిటెక్చర్ కోర్సులలో ప్రవేశానికి గ్యాట్‌లో లభించిన ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. గీతం వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవటంతో పాటు ప్రవేశ పరీక్ష సిలబస్ తదితర వివరాలను పొందవచ్చు.

గ్యాట్-2018 ప్రవేశ పరీక్షకు సంబంధించిన దరఖాస్తులు దేశవ్యాప్తంగా అన్ని యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్ శాఖలలో లభిస్తాయని అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నరేంద్ర పేర్కొన్నారు. గీతం ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో www.gitam.edu ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను 2018వ సంవత్సరం మార్చి 26వ తేదీలోగా అందజేయవలసి ఉంటుందన్నారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి గీతం వెబ్‌సైట్‌లో హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.




నవ్యాంధ్రకు గీతం కీర్తి కిరీటం

నవ్యాంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు తగిన విధంగా మానవ వనరులను తీర్చిదిద్దటానికి గీతం విశ్వవిద్యాలయం దేశంలో తొలిసారిగా ఫింటెక్ అకాడమిని స్థాపించటానికి నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇటీవలే విశాఖలో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. అదే విధంగా రాష్ట్రాన్ని బయోటెక్నాలజీ రంగంలో అగ్రపథంలో నిలపడానికి "బయోటెక్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వ నిపుణుల సమక్షంలో అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసింది. ఆసియా ఉపఖండంలోనే ఈ ప్రఖ్యాత బోధనా, పరిశోధనా కేంద్రాలు రానున్న కాలంలో నవ్యాంధ్రప్రదేశ్‌కు కీర్తి కిరీటం కానున్నది. ఇవేకాక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, బాబా అటమిక్ రీసెర్చ్ సెంటర్ సంస్థలు గీతంలో తమ అధ్యయన కేంద్రాలను నెలకొల్పడానికి ముందుకు రావడం విశేషం.



బరిలో పిడుగులు.. బంగారు పంచ్‌లు!

కరాటేలో రాణిస్తున్న రాజంపేట కుర్రాళ్లు

ఇండో- నేపాల్ అంతర్జాతీయ పోటీల్లో సత్తా

బంగారు పతకాల సాధనతో ప్రశంసల జల్లు

ఒకప్పుడు విద్యార్థులు చదువులకే ప్రాధాన్యం ఇచ్చేవారు. అటు పాఠశాల, ఇటు ఇల్లు తప్ప మరో ఆలోచన ఉండేది కాదు. ఇప్పుడు చదువుతో పాటు ఏదో ఒక క్రీడ పట్ల ఆసక్తి చూపుతున్నారు. క్రీడలు.. ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుండటంతో చాలామంది ఇటు వైపు అడుగేస్తున్నారు. నైపుణ్యాల్ని పెంచుకుంటున్నారు. బరిలో దిగి విజయాలు సాధిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలోనే కాదు అంతర్జాతీయ పోటీల్లో సైతం సత్తాచాటి కడప కీర్తిని ఇనుమడింప చేస్తున్నారు. రాజంపేట ప్రభుత్వ జూనియర కళాశాలకు చెందిన విద్యార్థుల విజయాలే ఇందుకు నిదర్శనం. కొంత కాలం నుంచి శిక్షకుడు ఆనంద్ వద్ద కరాటేలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు అద్భుత విజయాలు నమోదు చేస్తున్నారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సైతం సత్తా చాటి స్వర్ణ పతకాలు సాధించారు. తాము సాధించిన విజయాలు.. తమ భవిష్యత్తు లక్ష్యాల గురించి వారు ఇలా చెబుతున్నారు..

- రాజంపేట, న్యూస్‌టుడే



కరాటే సాధన చేస్తున్న జగదీష్ కుమార్



అంతర్జాతీయ కరాటే పోటీల్లో బహుమతిని అందుకుంటూ..

పోటీపడిన చోటల్లా స్వర్ణమే..

నాపేరు కె.వి.జగదీష్‌కుమార్. మాది రాజంపేటలోని కూచివారిపల్లె పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ. అమ్మ లీలావతి, తండ్రి చంద్రమోహన్. నాన్న ఆటో డ్రైవరుగా పనిచేస్తున్నారు. నేను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. గత నెల 22 నుంచి 24 వరకు కోల్‌కతాలో నిర్వహించిన ఇండో- నేపాల్ అంతర్జాతీయ కరాటే పోటీల్లో అండర్-19 విభాగం 45 కిలోల కేటగిరీలో బంగారు పతకాన్ని అందుకున్నా. ఈ విజయం నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఏడాదిన్నరగా మాస్టర్ ఆనంద్ వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నా. తొలిసారిగా గతేడాది జనవరి 29న పులివెందులలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని అందుకున్నా. 2017 జులై 31న ఒంగోల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలాట్ కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని అందుకున్నా. 2017 ఆగస్టు 27న రాజంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కుమితే విభాగంలో కాంస్యం గెలుపొందా. గత ఏడాది సెప్టెంబరు 3న నంద్యాలలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ద్వితీయ బహుమతిని అందుకున్నా. గతేడాది జూన్ 11న విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సైతం పాల్గొన్నా. భవిష్యత్తులో కరాటేలో గొప్ప స్థాయికి ఎదగాలి. మంచి ఉద్యోగం సాధించాలని లక్ష్యం. పేద విద్యార్థులకు నావంతు సాయం చేయాలన్నదే నా ఆశయం.

వాయు సేనలో ఉద్యోగమే లక్ష్యం

నాపేరు వై.నవీన్. మాది రాజంపేట పట్టణంలోని మన్నూరు. తల్లిదండ్రులు మహాలక్ష్మి, వై.ధర్మారావు. తండ్రి దిన కూలీ. నేను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. గత నెల 22 నుంచి మూడు రోజుల పాటు కోల్‌కతాలో నిర్వహించిన కరాటే పోటీల్లో తొలిసారిగా అంతర్జాతీయ బరిలో అడుగుపెట్టాను. ఈ పోటీల్లో 50 కిలోల కుమితే విభాగంలో బంగారు పతకాన్ని అందుకున్నా. రెండేళ్లుగా కరాటే శిక్షణ పొందుతున్నా. గత ఏడాది జూన్‌లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నా. గత జులై 31న ఒంగోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కుమితే విభాగంలో బంగారు పతకాన్ని సాధించాను. గతేడాది ఆగస్టు 27న రాజంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతిని అందుకున్నా. అదే ఏడాది సెప్టెంబరు 3న నంద్యాలలో జాతీయస్థాయి పోటీల్లో కుమితే విభాగంలో ద్వితీయ బహుమతిని సాధించాను. భవిష్యత్తులో అంతర్జాతీయస్థాయిలో మంచి క్రీడాకారుడిగా ఎదగాలి. భారత వాయుసేనలో ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం.





అంతర్జాతీయ కరాటే పోటీల్లో బహుమతిని అందుకుంటున్న నవీన్

అంతర్జాతీయ పోటీల్లో రాణించాలి..

నాపేరు బి.మహేష్‌బాబు. మాది పెనగలూరు మండలం బెస్తపల్లి. రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. రెండేళ్లుగా కరాటేలో శిక్షణ పొందుతున్నా. గతనెల 22 నుంచి మూడు రోజుల పాటు కోల్‌కతాలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని గెలుపొందా. ఇది నాజీవితంలో మరిచిపోలేని విషయం. గత ఏడాది ఆగస్టు 27న రాజంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తృతీయ బహుమతిని అందుకున్నా. అదే ఏడాది సెప్టెంబరు 3న నంద్యాలలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ద్వితీయ బహుమతిని సాధించాను. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో రాణించడం ద్వారా మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నా. ఇందు కోసం నిత్యం పట్టుదలతో సాధన చేస్తున్నా.



కోల్‌కతా పోటీల్లో బహుమతిని అందుకుంటున్న మహేష్‌బాబు



తాను సాధించిన పతకాలతో ..

చిట్టి ప్రయోగం.. మేటి ప్రయోజనం

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మెరిసిన విద్యార్థులు

సమాజానికి ఉపయోగపడే పరికరాల తయారీ

విద్యార్థుల్లో ఎంతోమంది మేధావులున్నారు. చిట్టిబుర్రల్లో ఎన్నో గట్టి ఆలోచనలు ఉన్నాయి. వారిలోని ప్రతిభను గుర్తించి.. సృజనకు మెరుగులు దిద్ది.. చిరు ఆలోచనలకు ఒక రూపం తీసుకురాగలిగితే.. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఎందరో శాస్త్రవేత్తలు మన బాలల నుంచే ఉద్భవిస్తారు. ఇదే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. పిల్లలు తయారు చేసిన ప్రాజెక్టులను జిల్లా.. రాష్ట్ర.. జాతీయ స్థాయిల్లో పరీక్షిస్తోంది. ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఇది పిల్లల్లో కొండంత ప్రేరణను నింపుతోంది. ఇందులో భాగంగా గతనెల 29, 30 తేదీల్లో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పోటీపడ్డారు. ఇక్కడ ప్రశంసలు అందుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికైన వాటిని ప్రస్తుతం నెల్లూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శిస్తున్నాయి. ఇలా జిల్లాలో మెరిసి.. నెల్లూరులో సత్తా చాటుతున్నారు రాజంపేట మండలం తాళ్లపాక ఉన్నత పాఠశాల, గాలివీడు ఉన్నత పాఠశాల, పుల్లంపేట బీపీఎస్ సంస్కృత పాఠశాల విద్యార్థులు. వారు తయారు చేసిన ప్రాజెక్టులు.. వాటి వల్ల కలిగే ప్రయోజనాలు.. రాష్ట్రస్థాయికి వెళ్లేందుకు దోహదపడ్డ అంశాలను మారి మాటల్లోనే తెలుసుకుందాం..

- తాళ్లపాక (రాజంపేట), న్యూస్‌టుడే



నెల్లూరులో ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు



సౌండ్‌గన్ నమూనా

పంటలకు కవచం.. జీవ వైవిధ్యానికి రక్ష

పొలంలో సాగుచేసిన పంటలను, కల్లాల్లో ఆరబోసిన దిగుబడులను పక్షులు, వన్యప్రాణుల నుంచి కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతుంటారు. అయినా చాలా నష్టం జరుగుతూనే ఉంది. పంటల రక్షణ కోసం ప్రస్తుతం కర్షకులు అనుసరిస్తున్న కొన్ని పద్ధతుల వల్ల పక్షులు, జంతువుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. మిత్ర పురుగులు, కొన్ని రకాల కీటకాలు సైతం అంతరించి పోతున్నాయి. దీనివల్ల జీవ వైవిధ్యానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. ఈ సమస్యలను అధిగమించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని కాపాడే నిమిత్తం 'సౌండ్‌గన్' ప్రాజెక్టును తయారు చేసినట్లు రాజంపేట మండలం తాళ్లపాక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.వెంకటేశ్వరరాజు, ఆర్.బాలకృష్ణ చెబుతున్నారు. దీని గురించి వివరిస్తూ.. రైతులు పండించిన ధాన్యం, ఇతర దిగుబడులను బయట ఆరబెట్టుతుంటారు. వాటిని పక్షులు, జంతువులు తింటూ తీవ్ర నష్టం కలిగిస్తాయి. వాటిని కాపాడుకునేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. పొలంలో చేతికొచ్చిన పంటను రక్షించుకునేందుకు కూడా రాత్రింబవళ్లు కంటిమీద కునుకులేకుండా కాపలా ఉండాల్సిన పరిస్థితి. ఒకదశలో విసిగిపోయిన రైతులు పొలం చుట్టూ విద్యుత్తు కంచెను ఏర్పాటు చేస్తుంటారు. దీనివల్ల జంతువులకంటే రైతులే ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ఎందరో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఈ చర్యల వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు గైడ్ టి.వి.రమణయ్య సాయంతో సౌండ్‌గన్ ప్రాజెక్టును తయారు చేశాం. ఇందు కోసం ఒకటిన్నర అడుగుల పొడవైన మూడు ఇంచుల పైపు, నాలుగు అంగుళాల పైపు ఒక అడుగు, ఒక వాల్వు, గ్యాస్‌లైటర్ వంటివాటిని ఉపయోగించాం. పరికరానికి పైన ఏర్పాటు చేసిన నాలుగు అంగుళాల పైపులో ఈగలు, బొద్దింకల నిర్మూలనకు వాడే హిట్ వంటి ద్రావణాన్ని పిచికారి చేయాలి. అనంతరం వాల్వును మూసివేయాలి. లైటరును వెలిగించినప్పుడు దాని ద్వారా వచ్చే మంట వల్ల హిట్‌లోని పదార్థాల మధ్య రసాయనిక వియోగం చెంది ఇథలిన్ వాయువు అధిక పీడనం.. పెద్దశబ్దంతో మూడు అంగుళాల పైపు ద్వారా బయటకు వస్తుంది. ఇలా పెద్ద శబ్దం వచ్చినప్పుడు పంటలపై వాలిన పక్షులు, పొలాలపై పడ్డ వన్యప్రాణులు, పశువులు పారిపోతాయి. ఈ విధానాన్ని వినియోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు ఉండదు. జీవ వైవిధ్యాన్ని కాపాడినట్లు అవుతుందని ఈ విద్యార్థులు వివరించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 3 నుంచి 5 నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రస్తుతం వీరు ప్రశంసలు అందుకుంటున్నారు.




నెల్లూరు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు, గైడు ఉమాదేవి

దొంగలు పడితే అలారం మోతే..

ఎంత పోలీసు నిఘా ఉన్నా.. నిత్యం ఏదోఒక ప్రాంతంలో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు భారీగా నష్టపోతున్నారు. అందుకే ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లాలంటే దొంగల భయంతో వణికిపోతున్నారు. కాలనీల్లో అయితే భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకుంటుంటారు. ఒక్కోసారి దొంగలు వారిని కూడా కొట్టి చోరీలకు ఒడిగడుతుంటారు. వీటిని అరికట్టేందుకు.. అనుమానితులు కాలనీలోకి అడుగుపెట్టగానే స్థానికులను అప్రమత్తం చేసే వ్యవస్థను రూపొందించాలని పిల్లలు భావించారు గాలివీడు కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు వి.శృతి, జె.చంద్రకళ. గైడ్ ఉపాధ్యాయురాలు పి.ఉమాదేవి సహాయంతో.. కాలనీలోకి ఎవరు అడుగుపెట్టినా ఇట్టే పసిగట్టి అలారం మోగించే పరికరాన్ని తయారు చేసిన వీరు.. దాని పనితీరును ఇలా వివరిస్తున్నారు.. ఈ ప్రాజెక్టులో రెండు కంట్రోలర్లను, ఒక స్కానర్‌ను ఇతర పరికరాలను వినియోగించాం. ఇళ్లల్లో లేదా కాలనీల్లో భద్రత కోసం దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కంట్రోలర్, స్కానర్‌ను గేటు వద్ద ఏర్పాటు చేసుకోవాలి. దానికి సంబంధించి మరో కంట్రోలర్‌ను మనకు అవసరమైన ప్రాంతంలో అమర్చుకోవాలి. పగలంతా దొంగల భయం ఉండదు. రాత్రిళ్లు కూడా మనం మేల్కొని ఉన్నంత వరకు సమస్య ఉండదు. మనం నిద్రకు ఉపక్రమించే ముందు మాత్రం సెన్సర్‌ను ఆన్‌చేస్తే సరిపోతుంది. రాత్రిళ్లు ఎవరైనా సెన్సర్‌కు ఏడు మీటర్ల సమీపంలోకి వస్తే ఈ పరికరం స్కాన్ చేసి లైటు వెలుగుతుంది. అక్కడి నుంచి మరో కంట్రోలర్‌కు సమాచారం వెళ్లి అలారం మోగుతుంది. దీంతో మనం జాగ్రత్తపడి తెలిసినవారు వచ్చారా.. లేదా దొంగలు పడ్డారా అనే విషయాన్ని నిర్ధరించుకోవచ్చు. దీన్ని చాలా తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చు. ఎక్కువ ప్రయోజనం కూడా ఉంటుంది. జిల్లా స్థాయిలో ఈ ప్రాజెక్టును ప్రదర్శించగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం నెల్లూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీల్లో ప్రదర్శిస్తున్నాం.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

నెల్లూరు పోటీల్లో ప్రశంసలు



సంప్రదాయ ఆహార పదార్థాల గురించి వివరిస్తున్న విద్యార్థి



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పదార్థాలు

సంప్రదాయ ఆహారం.. సుస్థిర ఆరోగ్యం

ఎలాంటి అనారోగ్య సమస్యల్లేకుండా.. వందేళ్లు హాయిగా జీవించిన మన పూర్వీకుల ఆరోగ్య రహస్యం.. చిరుధాన్యాల వాడకమే. నాడు సంప్రదాయ ఆహార ఉత్పత్తులను వినియోగండం వల్ల మనిషికి కావాల్సిన పోషక విలువలు అందేవి. అందువల్లే వృద్ధులు కూడా శక్తిమంతులుగా ఉంటూ తమపనులు తామే చేసుకునే వారు. ప్రస్తుతం చిరుధాన్యాల వినియోగం చాలావరకు తగ్గిపోయింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించే ప్రాజెక్టును గైడు ఉపాధ్యాయుడు ఎ.వరదారెడ్డి సాయంతో తయారు చేసినట్లు పుల్లంపేట బీపీఎస్ సంస్కృత పాఠశాల విద్యార్థి ఆర్.శివయ్య తెలిపాడు. తాతల ఆరోగ్య రహస్యం- చిరుధాన్యాల వాడకం, పిల్లలకు చిరుధాన్యాలు- బుద్ధి బలాన్ని పెంచే చక్కటి ఆహారం, కొర్రన్నం నోటిన పెట్టు- వరిన్నం పక్కనపెట్టు, సజ్జలు తినండి- స్వస్థతగా ఉండండి, రాగులు తినండి- రక్త వృద్ధిని పొందండి అనే నినాదాలతో ఈ ప్రాజెక్టును తయారు చేశాం. ఏ ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలి.. వాటిలో ఏ పదార్థంలో ఎలాంటి పోషక విలువులు ఎంత మేరకు ఉంటాయి.. కొర్రలు, సజ్జలు, రాగులు వంటి వాటిల్లో ఎలాంటి పోషకాలున్నాయనే విషయాలను జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వివరించాను. సమాజంలో వస్తున్న నూతన పోకడలు మనదేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వాటికి అలవాటుపడి సంప్రదాయ ఆహారాన్ని మరిచిపోతున్నాం. దీని వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలు అన్నీఇన్నీ కావు. ఈ విషయాన్ని తెలుసుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇప్పటికైనా ప్రజలు మేల్కొనాలని చైతన్యపరిచేలా ఈ ప్రాజెక్టును తయారు చేశాను. జిల్లాస్థాయి ప్రదర్శనలో బహుమతిని అందుకున్నా. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఇప్పుడు నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీల్లో ప్రదర్శిస్తున్నాం. ప్రజల్లో కొంత మార్పు వచ్చినా ఎంతో ప్రయోజనం కలుగుతుంది.



రద్దీ మార్గం.. ఒకే వాహనంపై ముగ్గురు.. పోలీసు హెచ్చరికను దిక్కరిస్తూ.. అడ్డంగా రోడ్డుదాటే ప్రయత్నం..



ఆగమన్నా.. దూరిపోతే ఎలాగన్నా..!

మారాలి నేస్తం.. విలువైంది ప్రాణం!

ఎన్నో పుస్తకాలు చదువుకుంటున్నాం.. నిత్యం ఎదురయ్యే అనుభవాల ద్వారా మరెన్నో విషయాలు తెలుసుకుంటున్నాం.. ప్రచార సాధనాలు.. సామాజిక మాధ్యమాలు.. సినిమాల ద్వారా సందేశాలను వంటబట్టించుకుంటున్నాం.. కాని ఏంలాభం. బయటకు రాగానే మనలోకం మనదే. ప్రమాదమని తెలిసినా రైలు గేటుకింద దూరేస్తాం. చరవాణిలో మాట్లాడుతూ వాహనాలు నడిపేస్తాం. ఒకే ద్విచక్రవాహనంపై ముగ్గురు.. అవసరమైతే నలుగురం కూడా ప్రయాణిస్తాం. శిరస్త్రాణం ధరించమంటే నామోషీగా భావిస్తాం. ఇంటివద్ద బయలుదేరేటప్పుడు అమ్మానాన్నలు జాగ్రత్త బిడ్డా అంటే.. అదేదో తిట్టులా భావించి వారివైపు కోపంగా చూస్తాం. ఏదైనా జరగరానిది జరిగినప్పుడో, పోలీసులకు దొరికిపోయినప్పుడో మాత్రం బావురుమంటాం.. ఇదీ నేడు కొందరు యువకులు వ్యవహరిస్తున్న తీరు. నిత్యం ఏదోఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి చిత్రాలు పెట్టి తోటివారికి జాగ్రత్తలు చెబుతున్న వారు తాము మాత్రం జాగ్రత్తపడడం లేదు. కన్నవారు ఎంతో ప్రేమతో కొని పెట్టే బైక్‌తో విన్యాసాలు చేస్తూ వారికి కన్నీళ్లనే మిగులుస్తున్నారు. యువత ప్రాణం విలువ తెలుసుకుని.. రహదారి నిబంధనలు పాటిస్తే వారి సురక్షితంగా గమ్యం చేరడంతో పాటు కన్నవారికి కడుపుకోతను నివారించిన వారవుతారు.

- రైల్వేకోడూరు, న్యూస్‌టుడే

పక్కా గృహం ప్రాప్తిరస్తు

సొంతిల్లు లేని పట్టణ ప్రాంత నిరుపేదలకు గృహయోగం కల్పించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కొన్నేళ్లుగా అద్దె ఇళ్లలో దుర్భరంగా నివాసం ఉంటున్న అల్పాదాయ వర్గాల సొంతింటి కలను సాకారం చేసేలా నిర్ణయం తీసుకుంది. జిల్లాలో నగర, పురపాలిక పరిధిల్లో నివాసం ఉంటున్న పేదలకు సంక్రాంతి పండుగ వేళ వరాలజల్లు కురిపించింది. 2017- 18 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్ పట్టణ గృహ పథకంలో 9,241 పక్కాగృహాలను మంజూరు చేశారు. ఈ మేరకు బుధవారం గృహ నిర్మాణ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి కాంతిలాల్‌దండే ఉత్తర్వు-1 జారీ చేశారు. కడప నగరానికి 1,553, రాయచోటి 705, ప్రొద్దుటూరు 1,270, జమ్మలమడుగు 676, రాజంపేట 528, పులివెందుల 1,237, మైదుకూరు 1,450, ఎర్రగుంట్ల 292, బద్వేలు పురపాలికకు 1,530 కేటాయించారు. ఒక ఇంటి నిర్మాణ వ్యయం రూ.3.50 లక్షలు. కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.లక్ష సాయం చేస్తుంది. లబ్ధిదారుడి వాటా రూ.25 వేలు, బ్యాంకు రుణం రూ.75 వేలు తీసుకోవాల్సి ఉంటుంది. నిర్మించుకునే గృహం వైశాల్యం కనీసం 30 చదరపు మీటర్లు (323 చదరపు అడుగులు) ఉండాలి. ఇందులోనే మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఉత్తర్వులిచ్చారు. కొన్ని నెలలుగా ప్రభుత్వ అధికారిక ప్రకటన కోసం వేయి కళ్లతో ఎదురుచూసిన పేదలు.. సంక్రాంతి పండుగకు ముందు సర్కారు ఇచ్చిన కానుకతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



- ఒంటిమిట్ట, న్యూస్‌టుడే



సౌరబండి.. కాలుష్యం పరారండీ!

వాహనాల నుంచి విడుదలయ్యే పొగ.. కాలుష్య ఉద్గారాలు.. అధిక శబ్దం పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయి. దీనివల్ల భవిష్యత్తులో మానవ మనుగడకే ప్రమాదం పొంచి ఉంది. దీన్నుంచి బయటపడేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. విద్యుత్తుతో నడిచే పొగరహిత బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు యత్నిస్తోంది. మరోవైపు వివిధ సంస్థలు విద్యుత్తుతో నడిచే కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. వీటిని ఛార్జింగ్ చేసుకునేందుకు ఎంతోకొంత ఖర్చవుతుంది. ఆ కొద్దిపాటి ఇంధన ఖర్చుకూడా లేకుండా సౌర విద్యుత్తుతో నడిచే వాహనాలను కొందరు ఔత్సాహికులు ప్రయోగాత్మకంగా తయారు చేస్తున్నారు. అలాంటి ప్రయత్నమే ఈ చిరు వ్యాపారిది. నిత్యం ఊరూరా తిరుగుతూ ఐస్‌క్రీంలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న మైదుకూరు మండలం పెద్దశెట్టిపల్లెకు చెందిన రవి సౌర శక్తితో నడిచే వాహనాన్ని సమకూర్చుకున్నారు. ఒకవేళ వాతావరణం మేఘావృతమై సౌర శక్తి కొరత వచ్చినా.. విద్యుత్తుతో బ్యాటరీలను ఛార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఒకసారి బ్యాటరీలను ఛార్జింగ్ చేసుకుంటే 80 కి.మీ నడస్తుందని రవి తెలిపారు. దీన్నుంచి ఎలాంటి శబ్దం.. పొగ రావు. ఎలాంటి సమస్యలు లేకుండా వాహనం నడుస్తోందని ఇందుకు రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టినట్లు ఆయన వివరించారు.


- మైదుకూరు, న్యూస్‌టుడే

ప్రకృతి కట్టిన బురుజు

పచ్చని ప్రకృతి అందాల మధ్య.. ఎత్తయిన గుట్టపై భారీ బండరాళ్లను ఒకదానిపై ఒకటి క్రమపద్ధతిలో పేర్చి బురుజు నిర్మించినట్లున్న ఆకృతి చూసిన వారిని చకితుల్ని చేస్తుంది. అంతేసి రాళ్లను ఎవరు పేర్చారబ్బా అని ఆశ్చర్యపోయేలా ఉంటుందీ చిత్రం. దగ్గరికెళ్లి పరిశీలించాక ఇదంతా ప్రకృతి చేసిన మాయ అని తెలిసి సంబరపడిపోతారు. సంబేపల్లె మండలం రౌతుకుంట పంచాయతీ దిన్నెమీదపల్లె సమీపంలోని నామాలగుట్టపై ఈ వింతైన సహజ సిద్ధమైన బురుజు కనిపిస్తుంది. భారీ గుండు మీద మిగతా రాతిగుండ్లు ఎంతో చక్కగా అమరి ఉండటం విస్తుగొలుపుతుంది. ఈ దారినపోయే వారంతా కాసేపు ఇక్కడ ఆగి వాటిని చూసి వెళుతుంటారు.

- సంబేపల్లె, న్యూస్‌టుడే

చిత్రం చెప్పిన కథ



రౌతుకుంట వద్ద నామాల గుట్టపై ఆకట్టుకునే గుండ్లు

హాయ్! బుజ్జీ!!



రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

పేపర్ వెయిట్.. తయార్!

తయారీ ఎలా?

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?



1

◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



2

◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



3

◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



4

◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.

పుట్టింది ఎప్పుడంటే?


- 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
- జస్టిన్ స్కూబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
- ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

లోపల పువ్వులెలా?

- ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.








దారి కనుక్కోండి!

సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We [ ] with our (ముక్కు)
2. We [ ] with our (కళ్లు)
3. We [ ] with our (చెవి)
4. We [ ] with our (నాలుక)
5. We [ ] with our (చేతులు)



ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్‌పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు

- మదర్ థెరిసా

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Thumb - థమ్
Subtle - సటల్

కవలలేవి? ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



జవాబులు: స్కూల్ సవాల్: 1. 1857 2. పోర్చుగల్ 3. నయా రాయ్‌పూర్
కవలలేవి: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See 3.Listen 4.Taste 5.Touch

ఉపాధ్యాయ వృత్తి.. సేవే ప్రవృత్తి

ఉత్తమ సేవలకు గుర్తింపు

రాష్ట్రస్థాయి సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపిక

ఆసక్తి ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపారు. అంకితభావంతో పనిచేస్తున్నారు. గృహిణిగా కుటుంబ బాధ్యతలు, గురువులుగా సమర్థంగా విధులు నిర్వహిస్తూ మహిళలకు స్ఫూర్తినిస్తున్నారు. వారందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించిన ప్రభుత్వం జిల్లా నుంచి సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికచేసి సత్కరించింది. రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడంతో తమ బాధ్యతలు మరింత పెరిగాయని, ఉత్తమ బోధన అందిస్తూ భావిభారత పౌరులను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని అంటున్నారు.

సేవలతోనే గుర్తింపు



భార్గవిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి (పాత చిత్రం)



ఖాజీపేట, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కొండా భార్గవి రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపికైంది. విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు, వందశాతం ఫలితాలు, విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరచడంతో ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. 1997లో ఉపాధ్యాయ వృత్తిలో చేరింది. 2009 వరకు చెన్నూరులో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలికగా పనిచేశారు. 2010 వరకు అట్లూరు మండలం, అనంతరం వనిపెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా, 2011 నుంచి 2012 వరకు కస్తూర్బా ప్రత్యేకాధికారిణిగా, 2012 నుంచి ఖాజీపేట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. పిల్లలకు ఉత్తమ బోధన అందించడంతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. పేద విద్యార్థులకు తనవంతు సాయం అందిస్తోంది. ఏటా పదో తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్నారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానంలో నిలిచిన విద్యార్థులకు 2010 నుంచి ప్రోత్సాహక నగదు బహుమతులు సొంతంగా ఇస్తున్నారు. 2015లో అప్పటి జిల్లా కలెక్టర్ అశోక్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చూస్తున్నారు. ఇటీవల మహిళల హక్కుల గురించి 'నాటిమహిళ- నేటి మహిళ' అనే పుస్తకాన్ని రచించి ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. తాను అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆమె చెప్పారు. అవార్డు రావడంతో బాధ్యతలు మరింత పెరిగాయని, విద్యార్థులకు ఉత్తమ విద్య అందేలా చూసి సర్కారు బడులకు గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమన్నారు.

పిల్లల్లో పరివర్తనే లక్ష్యంగా సేవలు



చెన్నూరు, న్యూస్‌టుడే : దివ్యాంగులు అంటే చాలా మంది చిన్నచూపు చూస్తుంటారు. వారి చేష్టలకు తల్లిదండ్రులే ఒక్కోసారి విసుక్కుంటూ ఉంటారు. సమాజం కూడా వీరిని దగ్గరకు తీయదు. అలాంటి వారిని ప్రేమతో దగ్గరకు తీసి విద్యాబుద్ధులు చెబుతూ గుర్తింపు తెచ్చుకుంటోంది ఐఈఆర్‌టీ సుభద్రమ్మ. దివ్యాంగుల్లో పరివర్తన తీసుకొస్తోంది. తరగతి కృత్యాలు, ఇంటి, ఆటపాటల విద్య అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ఆమె అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. సుభద్రమ్మ స్వస్థలం చెన్నూరు. 2002లో ఐఈఆర్టీ విభాగంలో ఉపాధ్యాయునిగా చేరింది. కడప, అట్లూరు మండలాల్లో విధులు నిర్వహించింది. పనిచేసిన ప్రతిచోటా ఉత్తమ సేవలందించడంతో అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకుంది. 2009, 2016లో జిల్లా స్థాయిలో, 2011లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అవార్డు, 2017 ఐఈఆర్టీ ఉపాధ్యాయ విభాగంలో జిల్లా స్థాయి అవార్డు అందుకున్నారు. గణితం, సాంఘిక, సైన్సు పాఠ్యంశాలపై అవగాహన కల్పించడంలో ఉత్తమ పనితీరు చూపినందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అప్పటి విద్యాశాఖ మంత్రి శైలాజనాథ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. దివ్యాంగ పిల్లలకు ఉత్తమ సేవలు అందించి జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు సుభద్రమ్మ పేర్కొంది.



జిల్లా స్థాయిలో అవార్డు, జ్ఞాపిక అందుకుంటున్న ఐఈఆర్‌టీ సుభద్రమ్మ

ఆదర్శవంతులుగా తీర్చిదిద్దుతా..

వల్లూరు, న్యూస్‌టుడే : వల్లూరు కస్తూర్బా ప్రత్యేక అధికారిణిగా పనిచేస్తున్న నజీమున్నీసా సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. తండ్రి ఫక్ృద్దీన్ ఉపాధ్యాయుడు. ఆయననే స్ఫూర్తిగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చింది. 2013 డిసెంబరు 12న కలసపాడు కస్తూర్బాలో ప్రత్యేక అధికారిణిగా విధుల్లో చేరారు. ఉద్యోగంలో చేరిన ఏడాదికే గుర్తింపు తెచ్చుకుని 2014 ఆగస్టు 15న ఉత్తమ ఎస్‌వోగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకుంది. అదే ఏడాది సెప్టెంబరులో అప్పటి జిల్లా కలెక్టరు వెంకటరమణ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఎస్‌వో అవార్డు అందుకున్నారు. 2017 ఆగస్టు వరకూ కలసపాడులోనే పనిచేసిన నజీమున్నీసా కస్తూర్బాను ఆదర్శంగా తీర్చిదిద్దారు. అనంతరం బదిలీపై వల్లూరు కస్తూర్బాకు వచ్చారు. సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూర్బాలో ఎక్కువగా అనాథ పిల్లలు ఉంటారని, వారి ముఖాల్లో ఆనందం చూడడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. ఉత్తమ బోధన అందేలా చూసి అందరినీ ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే జీవతాశయంగా పనిచేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అవార్డు రావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఆడపిల్లలు ఎందులోనూ తీసిపోరని, సమాజానికి ఆదర్శవంతులుగా తయారు చేయడమే ఆశయంగా పనిచేస్తానన్నారు.



విశాఖపట్నంలో అందుకున్న ప్రశంసా పత్రంతో నజీమున్నీసా

కస్తూర్బాకు గుర్తింపు తీసుకొస్తా



పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : పెండ్లిమర్రి కస్తూర్బా పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ప్రమీల రాష్ట్రస్థాయి సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపికయ్యారు. విద్యార్థినులకు క్రీడల్లో శిక్షణ ఇస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించారు. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, రెజ్లింగ్, జిత్‌కునెడో, కర్రసాము తదితర క్రీడల్లో జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కస్తూర్బా విద్యార్థినులు పాల్గొని ప్రతిభ చూపి పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. క్రీడల్లో సాధన చేయడానికి అనువైన ఆటస్థలం లేకున్నా ఉన్న వసతులనే సద్వినియోగం చేసుకుని శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది జిల్లా స్థాయిలో జరిగిన జిత్‌కునెడో పోటీల్లో పది మంది బంగారు, పది మంది రజతం, 20 మంది కాంస్య పతకాలు సాధించారు. సర్వశిక్ష అభియాన్ అధికారులు ప్రమీలను ఉత్తమ పీఈటీగా గుర్తించి రాష్ట్రస్థాయి సావిత్రిబాయి పూలే పురస్కారానికి ఎంపిక చేశారు. 'రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. బాలికలు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇచ్చి వారిని మరింత ప్రోత్సహించి కస్తూర్బాకు గుర్తింపు తీసుకొస్తా' అని వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల అంటోంది.



కర్రసాములో బాలికలకు శిక్షణ ఇస్తున్న పీఈటీ ప్రమీల

జడ్పీ ఛైర్మన్‌కు ప్రొటోకాల్ లేదా?

ఆవేదన వ్యక్తం చేసిన గూడూరు రవి

జిల్లా పరిషత్, న్యూస్‌టుడే: జిల్లా ప్రథమ పౌరుడిగా ఉన్న తనను జిల్లా యంత్రాంగం అవమానిస్తున్నదని ఎప్పుడు ముఖ్య కార్యక్రమం జరిగినా తనను పిలవకుండా అవమానిస్తూనే ఉన్నారంటూ జిల్లా పరిషత్ ఛైర్మన్ గూడూరు రవి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటన, పీబీసీకి నీటి విడుదలకు సంబంధించి మూడో తేదీ ఉదయం 6.45 గంటలకు ఎర్రగుంట్ల తహసీల్దారు వచ్చి ఆహ్వాన పత్రం అందించారని ఇదేనా పద్ధతి అని ప్రశ్నించారు. తాను కేవలం దళితుడిగా ఉంటూ ఛైర్మన్ పదవిని అలంకరించాననే అక్కసు ఉన్నట్లుందన్నారు. అధికారులు కొంతమంది నాయకుల ప్రలోభాలకు తలొగ్గి ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లుందన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి పెంచికల బసిరెడ్డి రిజర్వాయర్‌ను జాతికి అంకితం చేస్తున్న నేపథ్యంలో జిల్లా ప్రథమ పౌరుడిగా ఉన్న తనకు ఇలాంటి అవమానం తరచుగా జరుగుతోందన్నారు. దీనిపై కలెక్టర్, గవర్నర్‌కు, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ రవి

● **అధికారుల నుంచి సమాధానం రాకపోతే నిరసన:** ప్రొటోకాల్ విషయంలో అధికారులు తనకు స్పష్టమైన సమాధానం గురువారం సాయంత్రంలోగా ఇవ్వకపోతే శుక్రవారం నుంచి అంబేడ్కర్ కూడలిలో దీక్ష చేస్తానని జడ్పీ ఛైర్మన్ రవి స్పష్టం చేశారు.

హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలోనే హైకోర్టును ఏర్పాటు చేయాలని రాయలసీమ విద్యార్థి సంఘం (రావిసం) రాష్ట్ర అధ్యక్షుడు వి.రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో బుధవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తర్వాత టంగుటూరు ప్రకాశం పంతులు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఆనాడు శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని కర్నూలులో, హైకోర్టు గుంటూరులో ఉండేదన్నారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ కలిసిపోయిన తర్వాత రాయలసీమ అభివృద్ధి పూర్తిగా వెనుకబడిందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలంగాణగా 2014లో విడిపోయిన తర్వాత శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని రాయలసీమలో కాకుండా కోస్తాలో ఏర్పాటు చేసినప్పుడు హైకోర్టు అయిన రాయలసీమలో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీన ఎన్జీవో హోంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాయలసీమ అభివృద్ధి కోరుకునే ప్రతిఒక్కరూ రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మహేష్, రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయలసీమ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

బయోమెట్రిక్.. ఉద్యోగుల ట్రిక్

పిలిచి మందలించిన జడ్పీ ఛైర్మన్

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ కార్యాలయ ఉద్యోగుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో ఛైర్మన్ గూడూరు రవి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పర్యవేక్షకురాలు తాయారమ్మ పలు సమస్యలను జడ్పీ ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఉదయం 8 గంటలకే కొంతమంది బయోమెట్రిక్‌లో సంతకాలు చేస్తూ రిజిస్టర్‌లో సంతకాలు చేయడం మరుస్తున్నారన్నారు. అందరినీ పిలిచి సంతకాలు పెట్టమంటున్నానని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఛైర్మన్ ఉద్యోగులదరికీ ఫోన్ చేసి డ్యూటీకి రండంటూ పిలవండి అంటూ మందలించారు. పర్యవేక్షించాల్సిన మీరే ఇలా ఉదయం వచ్చి వేలిముద్రలు పెడుతున్నారనడం ఏంటని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోవాలని లేకపోతే చర్యలుంటాయని హెచ్చరిస్తూ పలు సూచనలు సలహాలిచ్చారు.

పదకొండో వేతన సవరణ సంఘం ఏర్పాటుపై స్పందించాలి

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పదో పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల గంగిరెడ్డి డిమాండ్ చేశారు. 2018కి ఏర్పాటు కావాల్సిన వేతన సవరణ సంఘం నియామకంపై స్పందించాలన్నారు. బుధవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాల గంగిరెడ్డి మాట్లాడుతూ.. ఒకవైపు తెలంగాణ రాష్ట్రంలో విడతల వారీగా చెల్లిస్తుంటే ఒకే వేతన సవరణ సంఘమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఇంకా మీనమేషాలు లెక్కించడం బాధాకరమన్నారు. రాష్ట్ర సంఘ నిర్ణయం మేరకు ఆందోళనకు సిద్ధంగా ఉన్నామన్నారు. వేతన సవరణ సంఘ ఏర్పాటులో ఆలస్యం నోషనల్‌గా చెల్లింపు ద్వారా ఉద్యోగి తన విలువైన ఉద్యోగ కాలాన్ని ఆర్థిక నష్టాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగుల కోసం విడుదల చేసి గ్రాట్యుటీ ఫ్యామిలీ పింఛను ఉత్తర్వులు విడుదల చేసినా ఇంకా అమలులోకి రాకపోవడం, అర్ధవేతన సెలవును నగదుగా మార్చే ఉత్తర్వు 2010 నుంచి అమలులోకి రాకపోవడం ఉత్తర్వులోని డొల్లతనాన్ని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. జడ్పీపీఎఫ్‌ను ఖజానా శాఖకు అప్పగించి ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వు 40 అనుగుణంగా విడుదల చేసే అధికారాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు ప్రతాప్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు హరనాథ్‌బాబు, సురేంద్ర, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల గంగిరెడ్డి

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్-2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం
11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం
12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 డీజే రిపీట్
01:15 స్టే..ఫూలిష్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామా రిపీట్
03:30 నా షో నా ఇష్టం రిపీట్
సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామా
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 టాప్స్
10:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ. 6:00, రా. 11:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా. 6:00, రా. 10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 6:30, రా. 10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 1:00, రా. 8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ. 1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ. 9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ. 2:00, రా. 7:00)
- ★ సుఖజీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ. 10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ. 3:00, రా. 9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ. 11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ. 11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ. 3:30, రా. 7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ. 3:45, రా. 7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడె వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగ్రై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఘూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బరానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

SVBC TTD — **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

భక్తి TV — **ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు, 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

ZEE తెలుగు — **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్), 11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

maa — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

GEMINI — **ఉదయం:** 06-00 టెలిషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

HBO — ఉదయం: 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, మధ్యాహ్నం: 12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, సాయంత్రం: 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ రాత్రి: 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

ఫెర్టిగేషన్‌తో ప్రయోజనాలు

ఈ మధ్య కాలంలో చాలామంది రైతులు డ్రిప్ పద్ధతిలో పంటలను సాగు చేస్తున్నారు. డ్రిప్‌ద్వారానే ఆయా పంటలకు అవసరమైన ఎరువులు కూడా అందించే అవకాశం ఉంది. ఈ విషయం తెలియక చాలా మంది రైతులు మొక్కల మొదళ్ల వద్ద ఎరువులు వేస్తూ శ్రమ పడుతున్నారు. మొదళ్ల వద్ద వేసిన ఎరువులు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావడం లేదు. ఈ నేపథ్యంలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిలో కరిగే రసాయనిక ఎరువులను ఫెర్టిగేషన్ ద్వారా అందించవచ్చు.

ఫెర్టిగేషన్ అంటే..

నీటిలో కరిగే రసాయనిక ఎరువులను నీటితో సహా సరైన మోతాదులో మొక్కకు నేరుగా అందజేయడాన్ని ఫెర్టిగేషన్ అంటారు. ఈ పద్ధతిలో మొక్కలకు సాగునీరు, పోషకాలు ఏకకాలంలో అందుదాయి. పర్యావరణంపై కూడా ఎలాంటి చెడు ప్రభావం ఉండదు.

లాభాలు: మొక్కలకు నీరు, పోషక పదార్థాలు ఎప్పుడూ అందుబాటులో ఉండటం వల్ల మొక్కల పెరుగుదల బాగుండి, నాణ్యమైన పంటలు పండుతాయి. ఫెర్టిగేషన్ అన్ని వాతావరణ పరిస్థితుల్లో చేయవచ్చు. తగిన సమయంలో, తగిన మోతాదులో ప్రతిసారి మొక్కల వేర్ల దగ్గరకు పోషకాలను అందించడం వల్ల ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వేసిన ఎరువులు భూమిలో ఇంకిపోకుండా ఉంటాయి. మొక్కల వేర్లకు ఎలాంటి హాని ఉండదు. సమయం కూడా కలిసి వస్తుంది. కూలీల ఖర్చు తగ్గుతుంది. నేల గట్టిపడదు.



ఫెర్టిగేషన్ పరికరాలు

ఏ రకమైన ఎరువులు వాడాలి?

ఈ విధానంలో వాడే ఎరువులు నీటిలో పూర్తిగా, త్వరగా కరగాలి. నీటిలో కరిగిన తర్వాత అవశేషాలు మిగిలిపోయి డ్రిప్పర్లు మూసుకుపోకుండా ఉండాలి. నీటిలో రసాయన ప్రక్రియ జరుగకుండా ఉండాలి. పోషకాల శాతం వీలైనంత ఎక్కువగా ఉండాలి. ఇలా నీటిలో కరిగే ఎరువులను ఫెర్టిగేషన్ ట్యాంక్ ద్వారా అందించవచ్చు. ఎరువులు కారిపోయి వృథా (లీకేజీ) కాకుండా చూసుకోవాలి. డ్రిప్‌లో లీకేజీలు ఉంటే రసాయనాలు వృథా కావడమే కాకుండా అన్ని మొక్కలకు నీరు, రసాయనాలు సమానంగా అందే అవకాశం ఉండదు. ఫెర్టిగేషన్ చేసే రోజుల్లో మొక్కలకు అవసరాన్ని మించి ఎక్కువ నీరు పెట్టొద్దు. ఫెర్టిగేషన్‌లో ఒకటి కంటే ఎక్కువ ఎరువులను ఒకేసారి డ్రిప్‌లోకి పంపించాలనుకుంటే.. ఆ ఎరువుల మధ్య రసాయనిక చర్యలు జరగకుండా ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం ఫెర్టిగేషన్‌కు వాడే ఎరువులను ముందుగా గాజు గ్లాస్‌లో నీటిలో పోసి రెండు గంటల సమయం వరకు కదలకుండా ఉంచాలి. గ్లాస్‌లో మడ్డి లవణాలు పేరుకుపోకుండా ఉంటే డ్రిప్‌ద్వారా ఉపయోగిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ఫెర్టిగేషన్ పరికరాల ఇంజక్షన్ రేటు సరిచూసుకొని అనుకున్న విధంగా రసాయనాలు సిస్టంలోకి వెళుతున్నాయా లేదా తెలుసుకోవాలి. నీరు పెట్టే మొత్తం సమయంలో చివరి 40-50 నిమిషాల ముందు ఫెర్టిగేషన్ పూర్తయ్యేలా చూసుకోవాలి. ఇలా కాకుండా ఫెర్టిగేషన్ తర్వాత ఎక్కువసేపు నీరు పెడితే రసాయనాలు భూమి లోపలి పొరల్లోకి చేరి, వేర్లకు అందకుండా పోయే ప్రమాదం ఉంది. ఫెర్టిగేషన్ తర్వాత డ్రిప్ వ్యవస్థను వెంటనే ఆపేస్తే రసాయన ద్రవం సిస్టంలో ఉండిపోతుంది. డ్రిప్ భాగాలు పాడవుతాయి.

– డాక్టర్ ఎన్.కృష్ణప్రియ,
డాక్టర్ ఎస్.ఎం.మునీంద్రనాయుడు
కె.వి.కె., నెల్లూరు

పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం

పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షేడ్ రేకులతో గానీ కప్పి, నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్' ఏర్పాటుచేయాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి రబ్బర్‌మ్యాట్లను పరచాలి.. తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. పశువుల మల మూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

రెండో విడత బియ్యం పత్రాల మంజూరు

4,906 పత్రాలు సిద్ధం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రెండో విడత బియ్యం పత్రాలను మంజూరు చేసింది. ఇదివరకే మొదటి విడతలో 32,369 మందిని అర్హులుగా గుర్తించి, జిల్లాలో 14,042 బియ్యం పత్రాలను పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధం చేశారు. తాజాగా రెండవ విడతలో 4,906 బియ్యం పత్రాలు మంజూరయ్యాయి. ఇప్పటికే 3,411 పత్రాలను ముద్రించి జిల్లాలోని ఆయా మండలాలకు పంపిణీ చేయడానికి పంపించారు. ప్రభుత్వం ద్వారా ప్రజలు ఎలాంటి లబ్ధి పొందాలన్నా బియ్యం పత్రం నంబరు తప్పనిసరిగా ఉండాల్సిందే. దరఖాస్తు చేసుకొన్న అర్హులైన వారందరికి పత్రాలు చేరనున్నాయి. గత ఏడాది 5 విడతలుగా పత్రాలను ఉన్నతాధికారులు మంజూరు చేశారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకొని తమకు పత్రాలు రాలేదంటూ 1100 (పరిష్కార వేదిక)కు ఫిర్యాదు చేసిన ప్రజలు వేలల్లో ఉన్నారు. వారిని కూడా అర్హులైన వారిగా గుర్తించడానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు.


పులివెందుల సభలో చిన్నారుల సంప్రదాయ నృత్యం


జన్మభూమి సభను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న చంద్రబాబు

10న జిల్లాస్థాయి పోటీ పరీక్ష

కడప విద్య, న్యూస్‌టుడే: అంతర్జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా జనవరి 10వ తేదీన కడప నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఉదయం 9 గంటలకు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లాభాస్కర్, ఖాదర్‌బాషా ప్రకటనలో పేర్కొన్నారు. 80 మార్కులకు వ్యాకరణం, 20 మార్కులకు పాఠ్యాంశాలపైన మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారని తెలిపారు. ప్రశ్నలన్నీ మల్టీపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయనీ ప్రైవేట్ పాఠశాలలు తప్పా మిగిలిన అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చనీ ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.1500, రెండో బహుమతి రూ.1000, మూడో బహుమతి రూ.500, పది ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

కడప నేరవార్తలు: కడప రిమ్స్ ఠాణా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరు మండలం ఓబులంపల్లెకు చెందిన కృష్ణయ్య (42) వైఎస్ఆర్ కూడలి వద్ద ఆటో కోసం నిలబడి ఉండగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరు డిగ్రీ కళాశాలలకు జరిమానా

(మొదటిపేజీ తరువాయి) మోపిన ఆరు డిగ్రీ కళాశాలలు అఫిలియేషన్ ప్రక్రియలో తప్పుడు సమాచారం ఇచ్చి విశ్వవిద్యాలయాన్ని తప్పుదారి పట్టించారని స్పష్టంగా పేర్కొంది. సిఫారసు మేరకు ఒక్కొక్క కళాశాలకు రూ.4 లక్షలు నుంచి రూ.ఆరు లక్షల వరకు జరిమానా విధించామని స్పష్టం చేశారు. అభియోగ పత్రంలో పేర్కొన్న లోపాలను సరిచేసుకొని పూర్తిస్థాయిలో 2018-19 సంవత్సరంలో నిర్వహించే అఫిలియేషన్‌కి తిరిగి దరఖాస్తు చేసుకోవాలని నిబంధన విధించినట్లు ఆయన తెలిపారు. అఫిలియేషన్ ప్రక్రియ అనేది కేవలం ఒక పరిపాలనా సంబంధ వ్యవహారమని దీంతో విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా, విద్యా సంవత్సరానికి భంగం కలగకుండా వ్యవహరించామని పేర్కొన్నారు. తప్పుడు సమాచారమిచ్చి అధికారులను, విశ్వవిద్యాలయాన్ని తప్పుదోవ పట్టించినందుకు కళాశాల యజమాన్యాలపై అత్యంత పారదర్శకమైన రీతిలో చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ఉద్యానానికి ఊతం.. ప్రగతికి సంకేతం!

(మొదటిపేజీ తరువాయి) వద్దకు చేరుకున్నారు. కడప, అనంతపురం జిల్లాలకు చెందిన ముఖ్యనేతలు, కడప అధికారులు సీఎంకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక కాన్వాయ్‌లో సభా వేదిక వెనుక వైపు ఉన్న సిస్టన్ వద్దకుచేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించి గండికోట-చిత్రావతి ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. జాతికి అంకితం చేసిన అనంతరం జలసిరికి హారతి ఇచ్చి కృష్ణమ్మకు హారతి సమర్పించారు. కొందరు రైతులతో ముఖాముఖి నిర్వహించిన అనంతరం సమీపంలోని సభా ప్రాంగణం వద్దకు బాబు చేరుకున్నారు. స్థానిక నాయకులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. సీఎం మాట్లాడుతూ ఒక రైతు బిడ్డగా రైతుల సంక్షేమానికి అనేక విధాలుగా పాటుపడుతున్నట్లు చెప్పారు. నీళ్లుంటే కడప జిల్లాలో బంగారు పంట పండించే భూములు, రైతులు ఉన్నారని, వారికి అండగా నిలుస్తామన్నారు. తనకు పులివెందులలో గెలుపు ఇవ్వకపోయినా.. పేదలను దృష్టిలో ఉంచుకుని వారి అభివృద్ధికి పాటుపడుతున్నట్లు చెప్పారు. సాయం చేసిన వారికి కృతజ్ఞతలు చెబుతామని, మీరు ఆశీర్వదిస్తే నాకు కృతజ్ఞతలు చెప్పినట్లేనని స్పష్టం చేశారు. అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.00 గంటలకు పులివెందులకు చేరుకున్నారు. జన్మభూమి -మా ఊరు కార్యక్రమానికి హాజరైన అనంతరం బహిరంగ సభలో పాల్గొన్నారు. సమీపంలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణినులకు సీమంతంచేసి ఆశీర్వదించారు. జ్యోతి వెలిగించి సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

సంక్షేమమే ధ్యేయం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. లోటుబడ్జెట్ ఉన్నా పింఛన్ల నుంచి రేషన్‌కార్డులు, పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని, ఆఖరుకు చనిపోయినా ఉన్నతంగా చివరి సంస్కారాలు చేసేందుకు మహాప్రస్థానం వంటి కార్యక్రమాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందుకోసం 50 వాహనాలు పని చేస్తున్నాయన్నారు. అభివృద్ధి చేతల్లో చేసి చూపుతున్నట్లు స్పష్టం చేశారు. గోదావరి-కృష్ణాతో పాటు ఇప్పుడు పెన్నాను అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. సాంకేతికత ఉపయోగించుకుని ఎల్‌హెచ్ఎంఎస్ ద్వారా క్షణాల్లో దొంగలను పట్టుకుంటున్నామని.. బాడీ వార్న్ కెమెరాల ద్వారా పోలీసులకు క్రమశిక్షణ అలవడేలా చొరవ చూపుతున్నామన్నారు. పులివెందుల అభివృద్ధికి అన్ని విధాలా కృషిచేస్తామన్న ఆయన.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సభా వేదికపైనే మంజూరు ఇస్తున్నట్లు ప్రకటించారు. హిజ్రాలకు పట్టాలు, రేషన్‌కార్డులతో పాటు పోలీస్ మహిళా వాలంటీర్లకు నియామక పత్రాలను అందజేశారు. డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్‌తో పాటు పలువురు లబ్ధిదారులకు ఆస్తులు పంపిణీ చేశారు. శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు ఎస్వి సతీష్‌రెడ్డి సూచన మేరకు పులివెందుల తాలూకాకు 2000 సామాజిక పింఛన్లతో పాటు అదనంగా మరో 1600 మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. గండికోట ఉత్సవాల లోగోను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. చీనీ, దానిమ్మ గజమాలతో ఉద్యాన రైతులు ముఖ్యమంత్రిని సత్కరించారు.

ఉదయం నుంచి ఉత్కంఠ : పులివెందుల, లింగాలలో సీఎం పర్యటన నేపథ్యంలో నియోజకవర్గంలో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా ప్రతిపక్షం కంచుకోట కావడం, అధికార పక్షం భారీ సభ తలపెట్టడంతో ఎలా ఉండబోతోందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పులివెందుల శ్రీరామథియేటర్ రోడ్డు మార్గంలో తెదేపా, వైకాపాకు చెందిన కొందరుశ్రేణులు పార్టీ జెండాలు చేతబూని ప్రదర్శన చేపట్టారు. తెదేపాకు చెందిన కొందరు వైకాపా వర్గీయులపై దాడికి దిగారు. కార్యక్రమానికి ఆటంకం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం.. స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తమ పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు కనిపించడం లేదంటూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు మరికొందరు మాటపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం పట్టణంలో దావానలంగా వ్యాపించడంతో క్షణాల వ్యవధిలో వైకాపా కార్యకర్తలు జగన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రాయచోటి, పులివెందుల అర్బన్ సీఐలు మహేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌లు అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. మధ్యాహ్నానికి మళ్లీ మరో చోట రాజుకుంది. సీఎం సభా వేదికపైనే ఎంపీ అవినాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సభా వేదికపై చంద్రబాబు మాత్రమే ప్రసంగించగా, అవినాష్ వేచి చూశారు. చివరి క్షణంలో సీఎం అనుమతి తీసుకుని మైకు అందుకున్నారు. గండికోట-చిత్రావతి ఎత్తిపోతల పథకానికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీజం వేశారని, 80 శాతం పనులు అప్పుడే పూర్తయ్యాయని చెప్పారు. ఈ మాటలతో ఒక్కసారిగా కలకలం రేగింది. సీఎం అభ్యంతరం తెలుపుతుండగానే కార్యకర్తలు కేకలు వేశారు. సభా వేదికపై ఓ తెదేపా కార్యకర్త అవినాష్ చేతిలోని మైకు లాక్కునే ప్రయత్నం చేశారు. అతనితో పాటు మరికొందరిని వారించిన సీఎం అవినాష్ తీరును తప్పుపట్టారు. 'రాజకీయాలు ఇక్కడొద్దు.. గౌరవంగా, హుందాగా వ్యవహరించండి, ఇది ప్రభుత్వ కార్యక్రమం, పార్టీ కార్యక్రమాలు బయట చేసుకోండి, పాదయాత్ర అయినా సరే, విమర్శలైనా సరే. దానికి మావాళ్లు సమాధానం చెబుతారు. ఏదైనా సమస్య ఉంటే రాతపూర్వకంగా ఇవ్వండి' అంటూ హితబోధ చేశారు. మైకు కట్ చేయడంతో ఏపీకార్ల్ అభివృద్ధికి, ఇండోర్ స్టేడియంకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ సీఎంను కోరారు. ఈ చర్చ జరుగుతుండగానే సభా వేదిక ముందున్న ప్రజల్లో నుంచి కొందరు కుర్చీలు చేతుల్లోకి తీసుకుని గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి చేసేదేమీ లేక ఎంపీ అక్కడ నుంచి నిష్క్రమించారు. తర్వాత ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎవరెవరు ఏం చేశారన్నది ప్రజలకు తెలుసని అన్నారు. ఎంపీ అడిగిన అంశాలకు నిధుల మంజూరు, పనులు చేయిస్తామని హామీఇచ్చారు. సాయంత్రం 4.40 గంటలకు ఆయన తిరిగి కడప విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో అమరావతి వెళ్లారు.

నేతల వాడి, వేడి : ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తెదేపా నాయకులు మాటల తూటాలు పేల్చారు. కడప, అనంతపురం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కోలాహలంతో సందడి చేశారు. లింగాల సభలో సతీష్‌కుమార్‌రెడ్డి జగన్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. పులివెందుల అభివృద్ధి పట్టించుకోని వ్యక్తి ఇక్కడి ప్రజల గురించి మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. కుప్పం కంటే ముందే పులివెందులకు నీళ్లిచ్చి మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మంత్రులు దేవినేని ఉమా, ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి మాట్లాడారు. ఆదినారాయణరెడ్డి ప్రసంగంలో రామసుబ్బారెడ్డి పేరు ప్రస్తావించడం, ఆయన పక్కనే కూర్చోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కడప జిల్లాకు చెందిన నేతలు తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కస్తూరి విశ్వనాథనాయుడు, మేడా మల్లికార్జునరెడ్డి, వీరశివారెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, వరదరాజులురెడ్డి, బ్రహ్మయ్య, పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్యే జయరాములు, ఎమ్మెల్సీ బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, కడప నాయకుడు పీరయ్య, రామగోపాల్‌రెడ్డి, హేమాద్రిరెడ్డి, రాఘవరెడ్డి, తూగుట్ల మధు, మహబూబ్‌బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి, సర్పంచి విష్ణు, వేంపల్లె తెదేపా అధ్యక్షుడు షబ్బీర్, తొండూరు శివమోహన్‌రెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వేముల ఓబుళరెడ్డియాదవ్, లింగాల విశ్వనాథరెడ్డి, దొండ్లవాగు సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు : పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్సీ బాబూజీ పర్యవేక్షించారు. బాడీ వార్న్ కెమెరాలతో నిఘా ఉంచారు. పులివెందుల సభా ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరు బాబూరావు నాయుడు అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేశారు. సీఎం కలెక్టర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి కొన్ని సూచనలు చేశారు.



గండికోట ఉత్సవాల లోగో ఆవిష్కరణ


పులివెందుల బహిరంగ సభకు హాజరైన మహిళలు


గండికోట ఎత్తిపోతల పథకం శిలాఫలక ఆవిష్కరణలో సీఎం, శ్రీనివాసరెడ్డి, సతీష్‌రెడ్డి



ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.



ప్రతిభ

ఆహారానికి ఏదీ భద్రత...?

జనరల్ స్టడీస్

డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

✦ భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.

✦ 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.

✦ సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

✦ సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.

✦ డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.

✦ నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

> అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.

✦ సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.

✦ 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

✦ అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.

✦ ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.

✦ వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.

✦ ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్ లాపిన్ అభిప్రాయపడ్డారు.

> ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.

✦ డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

✦ 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయీ సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయీ సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.

✦ మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

ప్రతిభ

ఏపీ టెట్

చరిత్ర

ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు

- భారతదేశంలో నివసించిన ఆదిమానవుడిని రామా పిథికస్ అంటారు.
- ఐరోపాలో నివసించిన ఆదిమానవుడిని నియాండెర్తల్ నరుడు అంటారు.
- మొదటి మేధావి మానవుడిగా హోమో ఎరక్టస్‌ను పేర్కొంటారు.
- ఆధునిక మానవుడి శాస్త్రీయ నామం హోమో సెపియన్
- మానవుడి అభివృద్ధి మొత్తం 5 దశల్లో జరిగింది.
- ఆదిమానవుడి కాలాన్ని మూడు యుగాలుగా విభజించారు. అవి: 1. ప్రాచీన శిలాయుగం, 2. మధ్య శిలాయుగం, 3. నవీన శిలాయుగం
- ప్రాచీన, మధ్య శిలాయుగాల్లో మానవుడు వేటను ప్రధాన వృత్తిగా చేసుకుని సంచార జీవితాన్ని గడిపేవాడు. ఈ యుగాల్లో మానవుడు ఆహార సేకరణ/ ఆహార అన్వేషణ దశలో ఉండేవాడు.
- ప్రాచీన శిలాయుగంలో మానవుడు పెద్ద పెద్ద బండరాళ్లను పెచ్చులుగా కొట్టి ఆయుధాలుగా ఉపయోగించేవాడు. వాటినే ఛేదకాలు, దరకాలు, చేతి గొడ్డళ్లు అనేవారు.
- మానవుడు చేతి గొడ్డలిని వాడిన కాలం ప్రాచీన శిలాయుగం.
- మధ్య శిలాయుగంలో అతిచిన్న రాళ్లను ఆయుధాలుగా ఉపయోగించాడు. కాబట్టి ఈ యుగాన్ని సూక్ష్మ శిలాయుగం అంటారు.
- సూక్ష్మ శిలాయుగంలో మానవుడు నిప్పును కనుక్కొన్నాడు. జంతువులను మచ్చిక చేసుకున్నాడు.
- నవీన శిలాయుగంలో మానవుడు వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా మార్చుకుని, స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ యుగంలో రాతి గొడ్డలి, రాతి కొడవలి, రాతి పారలను ఆయుధాలుగా ఉపయోగించాడు.
- మధ్యప్రదేశ్‌లోని నంద్రా గ్రామంలో రాతి పనిముట్లు లభించాయి.
- జమ్మూ కశ్మీర్‌లో రాతితో చెక్కిన పరికరాలు లభించాయి.
- ఝార్ఖండ్‌లో పురాతన రాతి పనిముట్లు లభించాయి.
- తమిళనాడులోని గుడియం గుహల నుంచి సూక్ష్మరాతి పరికరాలను వెలికితీశారు.
- మహారాష్ట్రలోని నెవాస ప్రాంతంలో నవీన శిలాయుగపు పనిముట్లు లభించాయి.
- ఆదిమానవుడు ఉపయోగించిన రాతి గొడ్డలి ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కామకూర్‌లో లభించింది.
- కర్నూలు జిల్లాలోని బెలూమ్ గుహలు, బేతంచెర్ల, బనగానపల్లి ప్రాంతాల్లో ఆదిమానవుడి ఆనవాళ్లను కనుక్కొన్నారు.
- ఎముకలతో చేసిన పనిముట్లు కర్నూలు జిల్లాలోని ముచ్చర్ల చింతమానులో లభించాయి (ఇవి భారత ఉపఖండంలో ఇంకెక్కడా దొరకలేదు).
- ఆదిమానవుడు గుహల్లో చిత్రాలను గీసేవాడు.
- వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ముద్దనూరు మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదిమానవుడి పది రాతి చిత్రకళా స్థావరాలు లభించాయి.
- చింతకుంట రాతి చిత్రకళా స్థావరాల్లో మొత్తం 200 చిత్రాలున్నాయి. వీటిలో 10 తెలుపు రంగులో ఉండగా మిగిలినవి ఎరుపు రంగులో ఉన్నాయి.
- ఎరుపు రంగు చిత్రాల్లో ఒకే గుహలోని మూపురం ఉన్న ఎద్దు చిత్రం ప్రసిద్ధి చెందింది. ఈ గుహను స్థానికంగా ఎద్దుల, ఆవుల గుండు అని పిలుస్తారు.

ఆంధ్రదేశంలో ఉన్న ఇతర రాతి చిత్ర కళా స్థావరాలు

- బొల్లారం, కాలువబుగ్గ, కేతవరం, ఆథోని - కర్నూలు జిల్లా.
  - శ్రీకాళహస్తి, రేణిగుంట, వెంబ ఖండ్రిగ - చిత్తూరు
  - నాయుడుపల్లె, సింగరాయకొండ - ప్రకాశం
  - వేల్పుమడుగు, భోగదవి తెనగల్ - అనంతపురం
  - చింతకుంట, దాపల్లి - కడప
  - కావలి, నందిపాడు - నెల్లూరు
  - వినుకొండ - గుంటూరు
- 12000 సంవత్సరాల నుంచి మానవులు వ్యవసాయం చేసి, పంటలు పండించడం ద్వారా ఆహారాన్ని పొందుతున్నారు.

- సుమారు 100 కోట్ల సంవత్సరాల కిందట భూమి ఏర్పడింది.
- భూమిపై ఆవిర్భవించిన తొలి జీవ పదార్థం లార్వా.
- ప్లాజిల్లేటాను ప్రాథమిక జీవరాశిగా పేర్కొంటారు.
- ఏప్స్ అనే తోకలేని కోతి నుంచి మానవుడు ఆవిర్భవించాడు.
- మానవుడు నివసించిన తొలి ఖండం ఆఫ్రికా. ఆఫ్రికాలోని ఆదిమానవుడిని ఆస్ట్రలోపిథికస్ అంటారు.

భారత్‌లో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం..?



రచయిత
బొత్స నాగరాజు
విషయ నిపుణులు

- **భారతదేశంలో ఆదిమానవుల ప్రారంభ వ్యవసాయ ఆనవాళ్లు లభించిన ప్రాంతాలు**
  బెలూచిస్థాన్ - 9000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  కశ్మీర్ - 5000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  బిహార్ - 4000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 5000 సంవత్సరాల కిందటి బూడిద దిబ్బలు బయటపడ్డాయి.
- అనంతపురం జిల్లాలోని పాళ్వాయిలో బూడిద దిబ్బలు/ మసి దిబ్బలు వెలుగు చూశాయి.
- ఆదిమానవులు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవారు.
- మన రాష్ట్రంలో నేటికీ యానాదులు, చెంచులు సంచార జీవితాన్ని గడుపుతున్నారు.
- ఆదిమానవులు పురుషులు, స్త్రీలు, పిల్లలు అంతా కలిసి గుంపులు, గుంపులుగా వేటకు వెళ్లేవారు.
- వేట బాగా జరగాలని జంతువులు, వృక్షాలు, నదులు, పర్వతాలను పూజించేవారు.
- ఆదిమానవుడు తన ఆహార పదార్థాలను మట్టి పాత్రలు/ కుండల్లో దాచుకునేవాడు.
- చనిపోయిన వారికి రాక్షసగుళ్ల పేరుతో సమాధులు నిర్మించేవారు.

సామ్రాజ్యాలు, గణతంత్రాల ఆవిర్భావం

- 2700 సంవత్సరాల కిందట ప్రజలు గంగా, యమునా పరీవాహక ప్రాంతాల్లో స్థిరపడ్డారు.
- సంస్కృత భాషలో జన అంటే తెగ, పదం అంటే స్థిర పడిన ప్రాంతం.
- మహా జనపదాల కాలంలో దిల్లీ, అత్రంజిఖేర, కౌశాంబి, పట్నా, అయోధ్య, రాజగర్ లాంటి నగరాలు అభివృద్ధి చెందాయి. (రెండో నగరీకరణ).
- గమనిక: సింధు నాగరికత కాలాన్ని తొలి నగరీకరణగా పేర్కొంటారు.
- 16 మహాజనపదాల్లో 14 జనపదాలు రాచరిక వ్యవస్థను, 2 జనపదాలు గణతంత్రాలను కలిగి ఉండేవి.
- వజ్జి, మల్ల నాటి రెండు గణతంత్రాలు.
- ఎన్నికైన రాజ్యాధినేత ఉన్న రాజ్యాలను గణతంత్రాలుగా పేర్కొంటారు.
- భారతదేశంలో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం మగధ సామ్రాజ్యం.
- వజ్జి గణరాజ్యం మగధకు ఉత్తర దిక్కులో ఉండేది.
- మహిళలు, బానిసలు, సేవకులకు గణరాజ్య సభల్లో పాల్గొనే హక్కు లేదు.
- బుద్ధుడు, మహావీరుడు గణ రాజ్యాలకు చెందినవారే.
- **మగధ తొలి సామ్రాజ్యంగా ఆవిర్భవించడానికి దోహదపడిన అంశాలు:**
  - శక్తిమంతమైన రాజులు, వంశాల పాలన
  - ఇనుప గనులు విస్తారంగా ఉండటం
  - సారవంతమైన నదీ తీరప్రాంతాలు ఉండటం.
- మగధ రాజ్యం గంగానదికి రెండు వైపులా విస్తరించి ఉంది.
- మగధ దక్షిణ భాగంలో ఇనుప గనులు విస్తారంగా ఉన్నాయి.
- హర్యంక వంశానికి చెందిన బింబిసారుడు, అజాతశత్రువు మగధను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దారు.
- మహాపద్మనందుడి కాలంలో మగధ వాయవ్యం నుంచి ఒడిశా వరకూ విస్తరించింది.
- మహాజనపదాల కాలంలో భూయజమానులను గృహపతి/ గాహపతి అనేవారు.
- వ్యవసాయ కూలీలను భర్తుకా అని, బానిసలను దాసులు అని పిలిచేవారు.
- యుద్ధంలో ఓడిపోయిన సైనికులను దాసులుగా మార్చేవారు.
- రాజులు సిరిసంపదలతో ఉండటానికి పన్నులు అధికంగా వసూలు చేయడంతోపాటు నిత్యం ఇతర రాజ్యాలపై దండయాత్రలు చేసేవారు.
- పట్టణాల్లో ఉండే వృత్తిపనివారు ఒకరోజు రాజు పొలంలో ఉచితంగా పని చేయడం ద్వారా వృత్తి పన్ను చెల్లించేవారు.
- రైతులు రాజుకు చెల్లించే భూమి శిస్తును 'భాగ' అనేవారు. ఇది పంటలో 1/6 వంతు.
- గోండుల గ్రామపెద్ద పట్లాను పోలి ఉండేవాడు.
- గ్రామంలో అధిక ధనవంతుడైన వ్యక్తిని గ్రామపెద్దగా నియమించేవారు.
- గ్రామపెద్ద పాలనా, న్యాయ, పోలీస్ విధులు నిర్వహించేవాడు.
- నాణేల ముద్రణ, ఉపయోగం మహాజనపదాల కాలంలోనే ప్రారంభమైంది.

మొదటి సామ్రాజ్యాలు

- మౌర్య వంశ, మౌర్య రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. గొప్పవాడు అశోకుడు.
- మౌర్యుల పాలనకు ఆధారాలు: అశోకుడి శాసనాలు, అర్థశాస్త్రం, ఇండికా.
- కౌటిల్యుడు సంస్కృత భాషలో రచించిన అర్థశాస్త్రం ఒక పాలనాశాస్త్రం.
- గ్రీకు రాయబారి మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలో ఇండికా గ్రంథాన్ని గ్రీకుభాషలో రాశాడు.
- మౌర్యుల కాలంలో రాజ్యం నేటి అఫ్గనిస్థాన్ నుంచి దక్షిణాన కర్ణాటక వరకు, తూర్పున బెంగాల్‌వరకు విస్తరించింది.
- మౌర్యుల రాజధాని పాటలీపుత్రం.
- పాటలీపుత్రం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం చక్రవర్తి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండేది.
- అధికారుల పనితీరును వేగుల ద్వారా రాజులు తెలుసుకునేవారు. దూతల ద్వారా రాజు తన సందేశాలను అధికారులకు పంపేవాడు.
- తక్షశిల, ఉజ్జయిని, సువర్ణగిరి, తోశాలి లాంటి ప్రాదేశిక రాజధానులను రాజకుమారులు పరిపాలించేవారు. వారిని గవర్నర్లు/ కుమారామాత్యులుగా పిలిచేవారు.
- మౌర్యుల కాలంలో సువర్ణగిరి బంగారు గనులకు ఎంతో ప్రసిద్ధి చెందింది.
- తక్షశిలలో విదేశీ వస్తువులు విరివిగా దొరికేవి.
- భారతదేశంలో తొలి శాసనాలు వేయించింది అశోకుడు. అతడి శాసనాలు ఎక్కువగా ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి.
- 'నేను చక్రవర్తి అయిన 8 సంవత్సరాలకు కళింగయుద్ధం (క్రీ.పూ. 261) చేశాను' అని అశోకుడు తన 13 వ శిలాశాసనంలో (దౌళి/ జౌగాడ శాసనం) పేర్కొన్నాడు.
- కళింగ యుద్ధంలో లక్షమందికి పైగా మరణించడంతో అశోకుడు హృదయ పరివర్తన చెంది, యుద్ధాన్ని త్యజించాడు.
- ఉపగుప్తుడి సలహాతో అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు.
- ధమ్మ/ ధర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి ధర్మ మహామాత్రులు అనే ఉద్యోగులను నియమించాడు.
- ధమ్మ ప్రాకృత పదం కాగా ధర్మ అనేది సంస్కృత పదం.
- సిరియా, ఈజిప్ట్, గ్రీస్, శ్రీలంక దేశాల్లో ధర్మాన్ని ప్రచారం చేయడానికి రాయబారులను పంపాడు.
- మనుషులకే కాకుండా జంతువులకు కూడా వైద్య సదుపాయాలు కల్పించిన తొలి భారతీయ చక్రవర్తిగా అశోకుడు పేరొందాడు.
- మౌర్యులకు సామంతులుగా ఉన్న శాతవాహనులు దక్కన్‌లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు.
- శాతవాహనుల రాజధాని ధాన్యకటకం (అమరావతి).
- గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్ఠీ పుత్ర పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి లాంటి రాజులు గొప్పవారు.
- అమరావతి, భట్టిప్రోలు, వడ్డమానుకొండ లాంటి ప్రాంతాల్లో బౌద్ధ ఆలయాలు, స్తూపాలను నిర్మించారు.
- రోమ్, బెంగాల్‌తో సముద్ర వ్యాపారం చేశారు.
- రోమన్ నాణేలు, రోమ్ శైలి కుండలు వీరి రాజ్య భాగాల్లో లభించాయి.
- పులోమావి పాలనాకాలం నాటి మ్యాకదోని శాసనం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో దొరికింది.
- పులోమావి 8 వ పాలనా సంవత్సరంలో మాక్యదోని శాసనం వేశారు.
- పులోమావి మహాసేనాపతి స్కందనాగుని శాతవాహన ఆహారంలో కుమారదత్త అధిపతిగా ఉన్న వేపుర గ్రామంలో కాంత తెగ నాయకుడు సమ్వ ఒక చెరువును తవ్వించినట్లు మాక్యదోని శాసనం పేర్కొంటోంది.
- వేపుర గ్రామాధిపతి - కుమారదత్త. కాంత తెగ నాయకుడు - సమ్వ
- శాతవాహనులను ఓడించి క్షాంతామూలుడు ఇక్ష్వాక రాజ్యాన్ని స్థాపించాడు.
- ఇక్ష్వాకుల రాజధాని విజయపురి (కృష్ణానది తీరం, నాగార్జున కొండ ప్రాంతం)
- వీరు రాముడి వంశానికి చెందినవారుగా చెప్పుకున్నారు.
- క్షాంతామూలుడు, వీరపురుషదత్తుడు లాంటి రాజులు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేశారు.
- నాగార్జున కొండవద్ద అతిపెద్ద ఆరామం, స్తూపం నిర్మించారు. (స్తూపం, చైత్యం, విహారం ఈ మూడూ ఉన్న ప్రాంతాన్ని ఆరామం అంటారు.)

భారత ఉపఖండంలో కొన్ని ముఖ్యమైన సామ్రాజ్యాలు

కుషాణులు

- కుషాణులు రెండువేల సంవత్సరాలకు పూర్వమే చైనా ప్రాంతం నుంచి వలస వచ్చి అఫ్గనిస్థాన్ కేంద్రంగా తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- కుషాణుల్లో గొప్పవాడు కనిష్కుడు.
- కనిష్కుడు క్రీ.శ. 78 లో సింహాసనాన్ని అధిష్ఠించి, శక యుగాన్ని ప్రారంభించాడు.
- శక యుగాన్నే శాలివాహన శకం లేదా శతాబ్దంగా పేర్కొంటున్నారు.
- భారతదేశం శక క్యాలండర్‌ను అనుసరిస్తోంది. శక యుగం సాధారణ యుగానికి 78 సంవత్సరాల తర్వాత ఉంటుంది.
- భారత్‌లో కుషాణుల కాలంలో ఇరాన్, చైనా, రోమ్ దేశాలతో వ్యాపారం బాగా జరిగేది.

గుప్తులు

- గుప్తులు బిహార్‌లోని పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- గుప్త వంశ మూలపురుషుడు శ్రీగుప్తుడు. (క్రీ.శ. 320 లో శ్రీగుప్తుడు గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు చెబుతారు)
- గుప్త రాజ్య స్థాపకుడు మొదటి చంద్రగుప్తుడు.
- గుప్త రాజుల్లో గొప్పవాడు రెండో చంద్రగుప్తుడు. ఇతడి బిరుదు విక్రమార్కుడు.
- రెండో చంద్రగుప్తుడి కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొంటారు.
- రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులు ఉండేవారు. నవరత్నాల్లో కాళిదాసు గొప్పకవి.
- **ముఖ్యమైన గుప్తరాజులు:** మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, రెండో చంద్రగుప్తుడు, కుమారగుప్తుడు, స్కంధగుప్తుడు.

హాజరు 4,174 మంది.. అర్హత పొందింది 610

- కడపలో సైనిక నియామక ర్యాలీ ప్రారంభం
- సోల్జర్ జనరల్ డ్యూటీ ఉద్యోగాలకు ఎంపికలు
- మొదటిరోజు 4,174 మంది అభ్యర్థుల రాక
- ఫిజకల్ ఫిట్‌నెస్ పరీక్షలో 610 మందికి అర్హత
- 1.6 కిలోమీటర్ల పరుగులోనే చతికిలబడ్డ అభ్యర్థులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కడప మున్సిపల్ స్టేడియంలో సైనిక నియామక ర్యాలీ బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభం అయ్యింది. సోల్జర్ జనరల్ డ్యూటీ ఉద్యోగ నియామకానికి సంబంధించి అనంతపురం, ప్రకాశం జిల్లాల నుంచి 4,174 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో 610 మంది అర్హత సాధించారు. ఏర్పాట్లలో చిన్న లోపాలు మినహా నియామక ప్రక్రియ తొలిరోజు సాఫీగా సాగింది. గుంటూరు, చెన్నై నుంచి దాదాపు 100 మంది ఆర్మీ అధికారులు, సిబ్బంది ఈ సైనిక నియామక ర్యాలీని చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు విచ్చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు తొలిరోజు జరిగిన సైనిక నియామక ర్యాలీ ప్రక్రియను పరిశీలించేందుకు రాలేదు. స్క్రీనింగ్ పరీక్ష అనంతరం తెల్లవారుజామున 4 గంటల నుంచే పరుగు పందెంను ప్రారంభించారు. ఒక్కోసారి పరుగు పందానికి 200 మంది అభ్యర్థుల వరకు పరిగెత్తేందుకు ట్రాక్‌లోకి ఆర్మీ అధికారులు పిలవడం జరిగింది. 1.6 కిలోమీటర్ల పరుగు పందాన్ని కేవలం 5 నిమిషాల 30 సెకన్లలో పూర్తి చేయాల్సి రావడంతో చాలావరకు అభ్యర్థులు పరుగు పందెంలోనే అనర్హతకు గురయ్యారు. పరుగుపందెంలో అర్హత సాధించిన వారికి పుల్‌అప్స్ తీయించడం.. 9 అడుగుల కందకం దూకటం, ఒక కడ్డీపై నిలబడి చేతులు బ్యాలెన్స్‌గా నడవడం తదితర పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. అంతకు ముందు అభ్యర్థుల ఎత్తు, బరువు, ఛాతి కొలతలను చూశారు. తక్కువ సమయంలో ఎక్కువ దూరం పరిగెత్తాల్సి ఉండడంతో పలువురు అభ్యర్థులు స్పృహ కోల్పోయారు. వారికి అక్కడే ఉన్న 108లో వైద్యసేవలను అందించారు. సోల్జర్ జనరల్ డ్యూటీకి సంబంధించి 4 వేలకు పైగా అభ్యర్థులు వచ్చినప్పటికీ తొలిరోజు ఎలాంటి తోపులాటలు జరగకుండా పోలీసు శాఖ చక్కటి పనితీరును కనబరిచింది.

మరుగుదొడ్ల సమస్య

అభ్యర్థులకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షను మున్సిపల్ స్టేడియం బయట చేపట్టారు. ఇక్కడ తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారి స్క్రీనింగ్ పరీక్షకు వచ్చిన అభ్యర్థిని మళ్లీ బయటకు పంపించకపోవడంతో చాలామంది అభ్యర్థులు మూత్రం పోసుకునేందుకు నీటి బాటళ్లను ఉపయోగించడం అక్కడ పరిస్థితి తీవ్రతను చాటింది. స్టేడియం లోపల మరుగుదొడ్లను ఏర్పాటు చేసినప్పటికీ స్టేడియం బయట స్క్రీనింగ్ పరీక్షల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ఈ సమస్య పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఒక్కోరోజు 4 వేల నుంచి 5 వేల మంది అభ్యర్థులు సైనిక నియామక ర్యాలీకి వస్తున్న నేపథ్యంలో మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాల్సి ఉంది.



సైనిక నియామక ర్యాలీకి విచ్చేసిన ప్రకాశం, అనంతపురం జిల్లాల యువత

కనిపించని జిల్లా అధికారులు

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కడప మున్సిపల్ స్టేడియంలో బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభం అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు దాదాపుగా సైనిక నియామక ర్యాలీ వైపు రాలేదు. అయితే వివిధ శాఖల నుంచి పలువురు సిబ్బంది వచ్చి అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చూశారు. తొలిరోజు కొన్ని మౌలిక వసతుల సమస్యలు కనిపించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై రెండవ రోజు నుంచి అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది.

నేటి పోటీల వివరాలు

సోల్జర్ జనరల్ డ్యూటికి సంబంధించి ఈ నెల 4వ తేదీన చిత్తూరు, కడప జిల్లాల అభ్యర్థులకు సైనిక నియామక ర్యాలీని ఆర్మీ అధికారులు చేపట్టనున్నారు. దాదాపు ఈ రెండు జిల్లాల నుంచి 5 వేల మంది వరకు అభ్యర్థులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అభ్యర్థులు సంబంధిత అర్హత పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో సైనిక నియామక ర్యాలీకి రావాలని అధికారులు సూచిస్తున్నారు.



స్క్రీనింగ్ పరీక్ష కోసం నిరీక్షణ



పుల్‌అప్స్ చేస్తున్న అభ్యర్థులు



తొమ్మిది అడుగుల కందకాన్ని దూకుతూ..!

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆర్టీసీ ఎండీని కలసిన ఎన్ఎంయూ

చిన్నచౌకు (కడప), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివారెడ్డి ఆర్టీసీ ఎండీ మాలకొండయ్యను కలసి విన్నవించారు. కొత్త ఏడాది సందర్భంగా ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు బుధవారం విజయవాడలో ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఎండీ మాలకొండయ్యను కలసి పుష్పగుచ్ఛాలిచ్చారు. ఈ సందర్భంగా ఎండీ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానంటూ ఎండీ హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఎండీని కలసిన వారిలో ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రమణారెడ్డితో పాటు పలువురు ఉన్నారు.



ఆర్టీసీ ఎండీ మాలకొండయ్యను కలిసిన ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు

స్నేహితులను చిదిమేసిన మృత్యువు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న మినీలారీ ● రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

సిద్దవటం, న్యూస్‌టుడే : ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు స్నేహితుల్ని మినీలారీ రూపంలో ఎదురొచ్చిన మృత్యువు పొట్టనపెట్టుకుంది. కడప- చెన్నై జాతీయ రహదారిపై సిద్దవటం మండలంలో భాకరాపేట శివారులో బుధవారం జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరు ఘటనా స్థలంలోనే మృతిచెందగా మరొకరు ఆసుపత్రికి తీసుకెళ్లాక ఊపిరి వదిలారు. సిద్దవటం ఎస్సై అరుణ్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. అట్లూరు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన బంకా రత్నమయ్య (25), నెల్లూరు జిల్లా చావోలి గ్రామానికి చెందిన రవి (28) స్నేహితులు. ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన వీరిద్దరు ఏడాది కిందట స్వగ్రామాలకు వచ్చారు. బుధవారం సొంతపనిపై వారిద్దరు అట్లూరు నుంచి కడపకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. భాకరాపేట దాటుకుని మలుపువద్దకు వెళ్లగానే కడప నుంచి రైల్వే కోడూరుకు వెళ్లేందుకు మద్యం సీసాల లోడుతో ఎదురుగా వచ్చిన మినీలారీ వారిని ఢీకొందని ఎస్సై తెలిపారు. ప్రమాదంలో రత్నమయ్య అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. తీవ్రంగా గాయపడిన రవిని 108 వాహన సిబ్బంది కడప రిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రిలోకి తీసుకెళ్లగానే రవి కూడా మృతిచెందారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.



ఘటనా స్థలంలో మృతిచెందిన రత్నమయ్య



మృతిచెందిన రవి

7న జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: కడప జిల్లా శరీర సౌష్ఠవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు నూనె నాగేష్, షేక్ యూనుస్ బాషా ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను మిస్టర్ ఫిట్ జిమ్ పైఅంతస్తులోని కడప జిల్లా శరీర సౌష్ఠవ సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు పతకాలు, జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. పోటీలు జరిగే రోజు క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన క్రీడాకారులు ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 8099237117ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మూసీ కాదు.. కేసీ

చిన్నచౌకు (కడప), న్యూస్‌టుడే: మీరు చూస్తున్నది మురుగు కాల్వ కాదు.. మూసీ అంతకంటే కాదు మురుగు కాల్వ తరహాలో చెత్తా చెదారమంతా పేరుకుపోయిన ఈ కాలువ కడపకు తాగునీటిని అందించడానికి నిర్మించిన కడప-కర్నూలు కాలువ. అదే నండి మన కేసీ. ఇదెక్కడో కాదు కడప బిల్టప్ వద్ద ఉన్న కాల్వ దుస్థితి. ఇందులో చెత్తాచెదారం వేయడంతో ప్లాస్టిక్ పేపర్లు, సంచులతో కంపు కొడుతోంది. చెత్త అడ్డుగా ఉండడంతో నీరు ముందుకు వెళ్లలేకపోతోంది. దీనికి తోడు కాల్వలో గుర్రపు డెక్క ఏపుగా పెరగడంతో దోమలకు నిలయంగా మారింది. కాల్వ చుట్టూ కంచె ఉన్నప్పటికీ ప్రజలు చెత్తా చెదారాన్ని తీసుకొచ్చి కాల్వలో వేస్తున్నారు. సంబంధిత అధికారులు కేసీ కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



బిల్టప్ వద్ద ఉన్న కేసీ కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం, గడ్డి

బద్వేలు

పుస్తకాల పంపిణీ


పోరుమామిళ్ల: ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్స్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు థామస్‌రెడ్డి, గీతా వివిధ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం రాత పుస్తకాలను పంపిణీ చేశారు. పట్టణంలోని ఆదిఆంధ్రాపాలెం, గిరినగర్‌కాలనీ, మహబూబ్‌నగర్ ప్రాథమిక పాఠశాల, కాపువీధిలోని పాఠశాలలలో చదువుతున్న 637 మంది విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు మేనేజర్ ప్రసాదురెడ్డి పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరణ

పోరుమామిళ్ల: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కాలమానిని ఎమ్మెల్యే తిరువీధి జయరాములు ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో బుధవారం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, చెన్నయ్య, రవిచంద్ర, గుర్రయ్య, తిరుమలదాసు, బొల్లు రమణయ్య పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలి

శంఖవరం (కలసపాడు), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు పాఠశాల వార్షిక ప్రణాళిక నివేదికలను త్వరగా సిద్ధం చేయాలని పాఠశాల సముదాయ ఛైర్మన్ ఎ.కొండిశెట్టి తెలిపారు. బుధవారం శంఖవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షిక ప్రణాళికపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి ప్రణాళికలను పారదర్శకంగా, యాజమాన్య కమిటీ ఆమోదంతో పూర్తి చేసి మండల విద్యావనరుల కేంద్రంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ టి.చెన్నరాయుడు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సముదాయ ఛైర్మన్ కొండిశెట్టి

ప్రమాదమని తెలిసినా పట్టదు..!

మోరీల వద్ద రక్షణ చర్యలు శూన్యం ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



శంఖవరంలో ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మోరీ



పిడుగుపల్లె వద్ద రక్షణ గోడలేని వంతెన



మోరీ వద్ద నామమాత్రంగా ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక

శంఖవరం (కలసపాడు), న్యూస్‌టుడే: ప్రధాన రహదారి విస్తరణకు రూ.కోట్లు ఖర్చు చేసిన ఆర్‌అండ్‌బీ ఖర్చు చేస్తున్నారు. కానీ, రక్షణ గోడలు లేని మోరీలు, వంతెనల గురించి అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పోరుమామిళ్ల ప్రధాన రహదారిలోని శంఖవరం వద్ద మోరీకి ఇరువైపుల రక్షణ గోడలు లేవు. ఇక్కడ ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు పొరపాటున పక్కకు వెళితే ఆరు అడుగుల గుంతల్లో వాహనాలు పడిపోయే అవకాశం ఉంది. ఇక్కడ ఆర్‌అండ్‌బీ అధికారులు నామమాత్రంగా సూచికలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరగక ముందే మోరీకి ఇరువైపుల రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా అనిల్



అనిల్

బద్వేలు, న్యూస్‌టుడే: ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా బద్వేలుకు చెందిన అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలకు గుర్తింపుగా గత నెల 28, 29, 30వ తేదీలలో గుంటూరులో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కుపరిశ్రమ స్థాపనకు లక్ష మంది విద్యార్థులతో ఉద్యమాన్ని నడపడం జరిగిందన్నారు.

తప్పిన పెనుప్రమాదం

టేకూరుపేట(పోరుమామిళ్ల), న్యూస్‌టుడే: టేకూరుపేట గ్రామంలోని హోటల్‌లోకి ఓ ప్రైవేటు పాఠశాల బస్సు దూసుకెళ్లింది. పోరుమామిళ్ల నుంచి టేకూరుపేట గ్రామం పరిధిలోని విద్యార్థులను దించి తిరిగి బుధవారం బస్సు వెళుతుంది. డ్రైవర్ టీ తాగేందుకు టేకూరుపేటలోని హుసేనయ్య హోటల్ వద్ద బస్సు నిలిపాడు. బస్సుకు హ్యాడ్ బ్రేక్ వేయలేదు. డ్రైవర్ దిగిన కాసేపటకి బస్సు ముందుకెళ్లింది. క్లీనర్ బస్సును అదుపు చేసేందుకు ప్రయత్నించాడు. అప్పటికే బస్సు హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సమస్యలపై చంద్రబాబుకు వినతిపత్రం

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పులివేందులకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును బుధవారం కలసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం ఇచ్చినట్లు యోవేవి పాలకమండలి సభ్యురాలు ఎన్డీ విజయజ్యోతి పేర్కొన్నారు. బద్వేలు, పోరుమామిళ్ల చెరువుకు బ్రహ్మంసాగర్ నుంచి నీటిని వదిలేందుకు శాశ్వత జీవో విడుదల చేయాలని ఎడమ కాల్వ ద్వారా 800 క్యూసెక్‌లకు తక్కువ కాకుండా నీటిని వదిలి బద్వేలు, పోరుమామిళ్ల చెరువులకు నీటిని అందించి పంటలను కాపాడాలని కోరినట్లు చెప్పారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

కలసపాడు: జిల్లాలో బుధవారం పర్యటించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కడపలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో తెదేపా నాయకురాలు, యోవేవి పాలకమండలి సభ్యురాలు ఎన్.డి.విజయజ్యోతి, తెదేపా శ్రేణులు కలిశారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.డేవిడ్, పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న విజయజ్యోతి, తెదేపా శ్రేణులు

మినీ నీటిశుద్ధికేంద్రం వితరణ

గోపవరం, న్యూస్‌టుడే: బద్వేలు పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు గోపవరం గ్రామీణ నీటిపారుదల శాఖలో ఏఈగా పని చేస్తున్న శ్రీహరి దాదాపు రూ.30 వేలు గల మినీ నీటిశుద్ధి కేంద్రాన్ని వితరణగా ఇచ్చారు. బుధవారం నోడల్ అధికారి పద్మజ, తహసీల్దారు నరసింహులు, గృహనిర్మాణశాఖ ఏఈ రఫికుద్దీన్‌లు పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి పద్మజ మాట్లాడుతూ సుమారు 152 మంది విద్యార్థులు గల సరస్వతి శిశుమందిర్‌కు శ్రీహరి వితరణ చేయడం మంచి విషయమన్నారు.



మినీ నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు

కృష్ణా నీటిని అందించిన ఘనత చంద్రబాబుదే

బద్వేలు గ్రామీణ: నిత్యం కరవుతో అల్లాడుతున్న కడప జిల్లాకు కృష్ణానీటిని అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందని తెదేపా బద్వేలు పట్టణ అధ్యక్షుడు కొంకుల రాంబాబు అన్నారు. బుధవారం బద్వేలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పులివేందులకు కృష్ణానీటిని అందించలేకపోయారన్నారు. కార్యక్రమంలో తెదేపా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె రమణ, నాయకులు కె.రవి, శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు రాచాయపేటలో జన్మభూమి

గోపవరం, న్యూస్‌టుడే: జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని రాచాయపేట పంచాయతీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

బద్వేలులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	10
పచ్చిమిరప	30
బెండకాయలు	24
కాకరకాయలు	36
మటిక్కాయలు	30
క్యాబేజీ	30
క్యారెట్	50
దొండకాయలు	30
చిక్కుడు	40
ఉర్లగడ్డ	30
బీరకాయలు	32
ఉల్లిపాయలు	50
వంకాయలు	24
బీట్‌రూట్	80
బంగాళదుంప	20
క్యాలీఫ్లవర్	50
అల్లం	50
కాకరకాయలు	32

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	400
చికెన్	120
100 గుడ్లు	400
డజను గుడ్లు	52
చేపలు	100

తెరపై ఈనాడు

శేఖర్ : ఒక్క క్షణం
కేజీఎన్ : హలో
నౌషాద్ : ఎంసీఏ(మిడిల్ క్లాస్‌అబ్బాయి)
పోరుమామిళ్ళ : శ్రీదేశాయి : ఎంసీఏ,
వెంకటేశ్వరా : హలో


సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

పెండ్లిమర్రి (కలసపాడు), న్యూస్‌టుడే: మండలంలోని పెండ్లిమర్రి కస్తూర్బా బాలికల విద్యాలయంలో బుధవారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా సామాజిక సేవా కమిటీ కన్వీనరు ఎం.రామకృష్ణారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు ఎస్.వి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సి.వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కె.ప్రసాద్, జిల్లా ప్రధానకార్యదర్శి యు.సుబ్రమణ్యం సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహిళా ఉపాధ్యాయులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కస్తూర్బా తాత్కాలిక ప్రత్యేక అధికారి ప్రీతి, ఎస్టీయూ నాయకులు టి.వెంకటసుబ్బయ్య, ఎన్.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు: సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. బద్వేలులోని సిద్ధవటం రహదారిలో బుధవారం సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలవేశారు. ఈ సందర్భంగా పూలే ఆశయ సాధన సమితి ఛైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ మహిళా పాధ్యాయురాలిగా స్త్రీలు విద్యవంతుల కావాలని పాటుపడిందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, మహిళా సంఘం నాయకురాలు నాగభూషణమ్మ, భాజపా నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్బాచారి, బద్దెన కళాపీఠం కార్యదర్శి సాంబశివారెడ్డి, కౌన్సిలర్ గోపాలస్వామి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: జ్యోతిబాయిపూలే జయంతిని బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ నాయకులు అబ్దుల్‌ఖాదర్ జ్యోతిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్త్రీవిద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మస్తాన్, రవికుమార్, సోమయ్య, చెన్నయ్య, మహ్మద్‌రఫీ, జయకుమార్, హసన్‌వల్లీ పాల్గొన్నారు.

గోపవరం: జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని కాలువపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వీరజయలక్ష్మీతోపాటు పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు క్రిష్ణారెడ్డి, బాబు, ప్రసాద్, లక్ష్మీరెడ్డి, విద్యాసాగర్‌లు మహిళా ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఉపాధ్యాయులు సుధారాణి, అనిషా బేగం, కృష్ణకుమారి పాల్గొన్నారు.



బద్వేలు: సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న వక్తలు

కాశినాయన: సావిత్రిబాయు పూలే జయంతిని పురస్కరించుకొని యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను మోడల్ పాఠశాలలో నిర్వహించారు. విజేతలకు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి, సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి పాల్గొన్నారు.



కలసపాడు: సావిత్రీబాయిపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వక్తలు

బద్వేలు

పోలీసు సేవల కొరకు 100

ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడికి కృషి

కాశినాయన న్యూస్‌టుడే: ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడి మనందరి బాధ్యతని ఎఫ్‌బీవో గోపాలకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఇటుకులపాడు గ్రామంలో ఎర్రచందనం ప్రాముఖ్యతపై, ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక విభాగం ఐజీ కాంతరావు ఆదేశాల మేరకు కళాజాత నిర్వహించారు. ఎర్రచందనం నీకు వందనం అనే లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏబీవో కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి- మా ఊరు



కలసపాడు: మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శివప్రసాద్



కాశినాయన: సావిశెట్టిపల్లెలో మాట్లాడుతున్న తహసీల్దార్



జన్మభూమి గ్రామసభలో బైఠాయించిన సీపీఐ నాయకులు



బద్వేలు గ్రామీణ: మాట్లాడుతున్న బి.కోడూరు ఎంపీపీ బి పద్మావతి



చంద్రన్న కానుకలను పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి

తెల్లపాడు (కలసాపడు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జన్మభూమి మా ఊరు కార్యక్రమం చేపట్టిందని మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్, ఎంపీడీవో బి.మైథిలి తెలిపారు. బుధవారం మండలంలోని తెల్లపాడు, పుల్లారెడ్డిపల్లెల్లో సర్పంచులు డి.ఈశ్వర్‌రెడ్డి, పి.నారాయణరెడ్డి అధ్యక్షతన జన్మభూమి మాఊరు గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 218 మందికి చంద్రన్నబీమా ఉపకారవేతనాల పత్రాలు, 20 మందికి కొత్త రేషన్‌కార్డులు, 88 మంది డ్వాక్రా మహిళలలకు రూ.12.30 లక్షల వడ్డీ లేని రుణాలు, 27 మందికి ప్రభుత్వ ఇంటిస్థలాల పత్రాలు పంపిణీ చేశారు. వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, పశువైద్యాధికారి సి.చెన్నారెడ్డి ఉచిత వైద్య, పశువైద్య శిబిరాలు ఏర్పాటుచేసి సేవలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో శ్రీనివాసులు, ఈవోపీఆర్ జాన్‌వెస్లీ, ఏపీఎం గంగార్జున, ఏపీవో గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన: పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ రాజేష్ సంతోష్ అన్నారు. మంలంలోని సావిశెట్టిపల్లె, రంపాడు గ్రామంలో జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజన్ కుమార్, ఎంఈవో బాల ఓబయ్య, ఏపీఎం ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు(బద్వేలు గ్రామీణ): రాష్ట్రాభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రజలు అండగా ఉండాలని బి.కోడూరు ఎంపీపీ బి.పద్మావతి పేర్కొన్నారు. బుధవారం బి.కోడూరు మండలంలోని తంగెడుపల్లె గ్రామంలో ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నాగరాజు, ఎంపీడీవో మల్లన్న, తహసీల్దారు దుగ్గిరెడ్డి, వెలుగు ఏపీఎం సుజాత, ఏవో చంద్రమోహన్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టరు ప్రశాంతి పాల్గొన్నారు. * తెదేపా పాలనలో బడుగు బలహీన వర్గాల ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని బద్వేలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ పేర్కొన్నారు. బుధవారం బద్వేలు మండలంలోని చింతలచెరువు పంచాయతీ సచివాలయం వద్ద ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రతాప్‌రెడ్డి, సర్పంచి జి.జయసుబ్బారెడ్డి, ప్రత్యేకాధికారి మురహరిరెడ్డి, ఎంపీడీవో వెంకటేష్, తహసీల్దారు మాదవకృష్ణారెడ్డి, వైద్యాధికారి చంద్రహాసరెడ్డి, వెలుగు ఏపీఎం సుబ్బారెడ్డి, ఉపాధి ఏపీవో జయచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు: ప్రధానిమంత్రి అవాస్ యోజన కింద వెయ్యి ఇళ్లు మంజూరు అయ్యాయని బద్వేలు పురపాలిక ఛైర్మన్ పార్థసారధి అన్నారు. స్థానిక రాధాకృష్ణనగర్, దూదేకుల వీధిలో 5, 6, 7, 8వ వార్డులలో జరిగిన జన్మభూమి మా ఊరు గ్రామసభలకు హాజరయ్యారు. కౌన్సిలర్లు సాయికృష్ణ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ గ్రామసభను అడ్డుకున్న సీపీఐ నాయకులు

నాలుగు విడతలగా జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజలకు ఏం చేశారో తెలియజేయాలని సీపీఐ నాయకులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బద్వేలులోని 8వ వార్డు రాధాకృష్ణానగర్‌లో బుధవారం జరిగిన గ్రామసభను సీపీఐ నాయకులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో జకరయ్య, చంద్రమోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



గోపవరం: ప్రసంగిస్తున్న తహసీల్దారు నరసింహులు

పోరుమామిళ్ల: గ్రామాలలోని సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని దమ్మన్నపల్లె గ్రామంలో బుధవారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలను చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శేషారాంసింగ్, సర్పంచి నరసమ్మ, ఎంపీటీసీ యాసం భవాని తదితరులు పాల్గొన్నారు. * సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి కోరారు. మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలలో అధికారులు హామీలు ఇస్తున్నారే తప్ప వాటి పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.

గోపవరం: ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని నోడల్ అధికారి పద్మజ, ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ నరసింహులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బేతాయపల్లె గ్రామంలో జన్మభూమి- మా ఊరు సభను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పంచాయతీకి మంజూరైన నూతన రేషన్‌కార్డులు, పింఛన్‌లను పంపిణీ చేశారు. పశువైద్య అధికారి పవన్ ఆధ్వర్యంలో పశువుల మందులను పంపిణీ చేశారు. సర్పంచి సునీత, వీఆర్వో నరసింహులు, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఆయకట్టు ఛైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, సీసీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చెన్నకృష్ణయ్య (పాతచిత్రం)

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: గత నెల 17న జరిగిన విద్యుదాఘాతంతో తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న చెన్నకృష్ణయ్య(38) బుధవారం మృతి చెందాడని ఎస్సై పెద్దఓబన్న తెలిపారు. గత నెల రామాయపల్లె గ్రామంలో పంట పొలం వద్ద వీఆర్‌వో చెన్నకేశవులు, అతని తమ్ముడు చెన్నకృష్ణయ్య, కుటుంబసభ్యులు విద్యుత్తు తీగలను స్తంభాలపై లాగుతున్నారు. ఈక్రమంలో విద్యుత్తు ప్రసారం కావడంతో ఘటనా స్థలంలోనే చెన్నకేశవులు మృతి చెందాడు. చెన్నకృష్ణయ్య తీవ్రంగా గాయపడటంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. భర్త మృతితో భార్య సాలెమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు. చెన్నకృష్ణయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కోలుకుంటున్న విద్యార్థులు



ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్న హసీన



కోలుకుంటున్న లక్ష్మీప్రియాంక



కడప రిమ్స్‌లో కోలుకుంటున్న శ్రీకాంత్

బద్వేలు, న్యూస్‌టడే: బద్వేలు పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద మంగళవారం రాత్రి ఆటో, ద్విచక్రవాహనం పరస్పరం ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన విద్యార్థినులు లక్ష్మీప్రియాంక, హసీనతోపాటు మరో యువకుడు శ్రీకాంత్ కడప, తిరుపతి ఆసుపత్రులలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. స్థానిక మహేశ్వరరెడ్డి పాఠశాలలో పదో తరగతి చదువుతన్న విద్యార్థినులు తరగతులను ముగించుకుని ఆటోలో మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో స్వగ్రామమైన చింతలచెరువుకు బయలుదేరిన ఆటో, శ్రీకాంత్ వెళుతున్న ద్విచక్రవాహనం స్థానిక మార్కెట్ యార్డు వద్ద పరస్పరం ఢీకొన్నాయి. ప్రాథమిక చికిత్స అనంతరం కడప, తిరుపతి పట్టణాలకు క్షతగాత్రులను తరలించిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ పథకాలపై విద్యార్థుల ప్రచారం



బయనపల్లె దళితవాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

బద్వేలు గ్రామీణ: బద్వేలు మండలంలో ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం బద్వేలు శ్రీబీవీఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామనగర్, బయనపల్లె, దళితవాడలలో ఆరోగ్యం-ఆనందం- పోషక విలువలు గల ఆహారంతో ఆరోగ్యం అన్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు బి.రామలక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీ రాఘవరెడ్డి, పి.హరిహరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విషపురుగు కాటుతో రైతు మృతి

ఖాజీపేట, న్యూస్‌టుడే : మండలంలోని మిడుతూరు గ్రామానికి చెందిన రైతు ఇట్టెం బాలయ్య(36) విషపురుగు కాటుకు గురై బుధవారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు బాలయ్య వరిపంటకు రసాయన మందు పిచికారి చేస్తూ స్పృహతప్పి పడిపోయారన్నారు. ఆసుపత్రికి తీసుకెళ్లాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. విషపురుగు కాటు వల్లనే మృతిచెంది ఉంటారని వైద్యులు సూచించినట్లు చెప్పారు. బాలయ్యకు ఇద్దకు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలిసి తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ మిడుతూరుకు వెళ్లి మృతుడికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్ వెంట ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

మైదుకూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే సమ్మె తప్పదని జేఏసీ ఛైర్మన్ కె.మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. బుధవారం మైదుకూరులోని ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ కార్యాలయం వద్ద విద్యుత్తు కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచి నేరుగా వేతనం అందించాలన్నారు. ప్రస్తుత విధానం వల్ల దళారుల ప్రమేయం పెరిగి కార్మికులు నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు కావడం లేదన్నారు. ఒప్పంద కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. జరుగుతున్న అన్యాయాలపై పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు సురేష్, సృజన్, ఎన్.ఈశ్వరయ్య, కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకల అందజేత

కొండాపురం : ప్రతి ఒక్కరు ఆనందంగా పండుగలు చేసుకోవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా.చంద్రబాబునాయుడు రంజాన్‌తోఫా ముస్లింలకు, క్రిస్మస్ కానుకలను క్రైస్తవులకు, అలాగే సంక్రాంతి కానుకలను హిందువులకు ఇస్తున్నారని మంత్రి ఆదినారాయణరెడ్డి సోదరుడు శివనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొండాపురంలో సంక్రాంతి కానులను ఆయన అందజేశారు.

అవసాన దశలో ఆయుర్వేద ఆస్పత్రి భవనం

మరమ్మతులు చేయాలని కోరుతున్న స్థానికులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలో ఎనిమిదేళ్లుగా ఆయుర్వేద ఆసుపత్రి కొనసాగుతోంది. జమ్మలమడుగుతో పాటు మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన ప్రజలు ఆయుర్వేద మందుల కోసం వస్తుంటారు. చికిత్స కోసం వస్తున్న రోగులు భవనాన్ని చూసి భయపడుతున్నారు. ఆస్పత్రి కోసం కేటాయించిన భవనం పడిపోయే స్థితిలో ఉండడమే ఇందుకు కారణం. జమ్మలమడుగు అభివృద్ధి కమిటీ కట్టించిన ఈ భవనంలో ఆయుర్వేద ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. నేటి వరకు ఆస్పత్రికి సొంత భవనాన్ని నిర్మించలేదు. దీంతో ఇది పాత భవనంలోనే కొనసాగుతోంది. ఉన్న రెండు గదుల పైభాగంలో ఇనుపచువ్వలు బయటకు కన్పిస్తున్నాయి. భవనం ముందు వైపు చీలికలు ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో ఉన్న రెండు గదుల్లో నీరు చేరుతుండడం వల్ల వైద్యసేవలకు ఆటంకంగా మారుతోంది. ఇప్పటికైనా ఆయుర్వేద విభాగం ఉన్నతాధికారులు స్పందించి జమ్మలమడుగు ఆయుర్వేద ఆస్పత్రి భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని, అలాగే సొంత భవనాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన జమ్మలమడుగులోని ఆయుర్వేద ఆస్పత్రి


ఆయుర్వేద ఆస్పత్రి పైభాగంలో బయటపడిన ఇనుపచువ్వలు


ఆస్పత్రి భవనంలో పైకప్పు ఇలా..

సీఎం కార్యక్రమానికి కొందరు నాయకుల గైర్హాజరు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యక్రమానికి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, సి.ఎం.సురేష్‌నాయుడు వర్గాల నాయకులు గైర్హాజరయ్యారు. పులివెందులలో బుధవారం జరిగిన ముఖ్యమంత్రి కార్యక్రమానికి ఈ ఇద్దరు నాయకుల అనుచరులు వెళ్లకపోవడం చర్చనీయాంశంగా మారింది. సీఎం కార్యక్రమానికి రావాలని తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో తాము దూరంగా ఉన్నట్టు ఈ నాయకులు తెలిపారు. మంత్రి ఆదినారాయణరెడ్డి వర్గానికి చెందిన నాయకులు మాత్రమే పులివెందులకు తరలివెళ్లారు.

ఇళ్ల పట్టాలు ఇప్పించాలంటూ ఆందోళన


తహసీల్దార్ కార్యాలయంలో మహిళల నిరసన

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సభకు వస్తే ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని నమ్మబలికి ఇవ్వకుండా మోసం చేశారంటూ జమ్మలమడుగు మండలానికి చెందిన మహిళలు ఆందోళన చేపట్టారు. బుధవారం రాత్రి జమ్మలమడుగు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కన్నెలూరు, అంబవరం, గూడెంచెరువు, పొన్నతోట గ్రామాలకు చెందిన మహిళలు బైఠాయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పులివెందులలో ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగ సభ ఉంది.. ఈ కార్యక్రమానికి వస్తే ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని చెప్పి అక్కడ ఇవ్వకుండా తిరిగి పంపించి వేశారని వారు ఆరోపించారు. ఆగ్రహించిన మహిళలు బుధవారం రాత్రి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. పనులు వదులుకుని సీఎం సభకు వస్తే ఇలా మోసం చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీటీలు వేణుగోపాల్, ఆర్ఐ కిశోర్ కల్పించుకుని బిజీ షెడ్యూల్ వల్ల ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేకపోయామని, జన్మభూమి గ్రామసభల్లో తప్పకుండా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: అనంతపురంలో నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పోటీల్లో జమ్మలమడుగు విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు శ్రీజిత్ ఐఎంఏ అబాకస్ అకాడమీ నిర్వాహకులు కీర్తి, ప్రియాంక తెలిపారు. ఛాంపియన్లుగా ఎం.బి.వర్ధన్‌రెడ్డి(గౌతమ్ మోడల్ స్కూల్), పి.లాస్యప్రియ(భారతి విద్యామందిరం) నిలిచారని అన్నారు. ఫస్ట్ రన్నరప్‌గా ఎల్.ఇశాంత్‌రెడ్డి(జాన్ హైస్కూల్), కె.వి.వరుణ్ సుమన్ కుమార్ (గీతాంజలి హైస్కూల్), వి.లోకేష్ (బాలాజీ హైస్కూల్) సాధించారని అన్నారు. గౌతం మోడల్ పాఠశాలకు చెందిన జోషిత, స్వాతి, అఖిలేష్‌రెడ్డి ద్వితీయ స్థానం, భారతి విద్యామందిరంలో చదువుతున్న రిషేశ్వర్ తృతీయ స్థానం దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.



అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ధైర్యసాహసాలతో ముందుకెళ్లాలి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే : విద్యను అభ్యసిస్తూ ధైర్యసాహసాలతో విద్యార్థులు ముందుకు నడవాలని రామకృష్ణ మఠం కార్యదర్శి స్వామి సుకృతానంద పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో తెలిపారు. విద్యార్థులు సృజనాత్మకత కలిగిన విద్యను అభ్యసించి ప్రతిభతో ఉన్నత చదువులు చదవాలని ఆయన సూచించారు. ప్రాథమిక విద్యలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువు కొనసాగించాలని విద్యార్థులకు తెలిపారు. వివేకానందుడు నడచిన సన్మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తును మంచిగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రామకృష్ణ సేవా సమితి సెక్రటరీ కొత్తపు రామ్మోహన్‌రెడ్డి కుమారుడు గంగా చైతన్యకుమార్‌రెడ్డి 32వ జన్మదినం, వివేకానందుని జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు బాగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఎన్.వెంకటరెడ్డి, వై.శివప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న స్వామి సుకృతానంద

చిత్రావతికి నీటిని విడుదల చేయండి

తిమ్మాపురం(కొండాపురం), న్యూస్‌టుడే: చిత్రావతి నదిలో నీటి తడిలేక గత 10 సంవత్సరాలుగా రైతాంగం ఇబ్బంది పడుతోందని, చిత్రావతి నదికి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వ విప్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తెదేపా నాయకులు లావనూరు నారాయణరెడ్డి, కోడూరు శివారెడ్డి, తిమ్మాపురం బాబుల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మరో మంత్రి చంద్రమోహన్‌రెడ్డిలకు పులివెందులలో వినతిపత్రం అందజేసినట్లు వారు పేర్కొన్నారు. వారు బుధవారం సాయంకాలం 'న్యూస్‌టుడే'తో చరవాణి ద్వారా మాట్లాడుతూ సుమారు 10 సంవత్సరాలుగా చిత్రావతినది ప్రవహించక నది ఒడ్డున ఉన్న భూముల రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గొడ్డుమర్రి నుంచి చిత్రావతినదికి అక్కడ నుంచి గండికోట ప్రాజెక్టు వరకు నీరు వస్తే చిత్రావతి నది బడ్డున ఉన్న భూములకు ఎంతో ఉపయుక్తమన్నారు. నదిలో నీటి తడులు లేక రైతులు పూర్తిగా ఇబ్బంది పడుతున్నారని తెలిపి, వినతిపత్రం అందించామన్నారు. వెంటనే స్పందించిన మంత్రి మరో వారం రోజుల్లో నీటివిడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పులివెందులలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామసభకు కొండాపురం మండలం నుంచి పెద్ద సంఖ్యలో తెదేపా నాయకులు, అభిమానులు తరలివెళ్లారు. బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బస్సులు, ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు.


జలవనరులశాఖ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కొండాపురం తెదేపా నాయకులు

ప్రతి విద్యార్థి కృషితోనే స్వచ్ఛ పాఠశాల

మైలవరం, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి కృషి చేయడం ద్వారానే స్వచ్ఛ పాఠశాల సాధ్యమవుతుందని సీఎస్ఆర్ విభాగాధిపతి రాజశేఖర్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నకొమ్మెర్ల ఉన్నత పాఠశాలకు రెండు పెద్ద చెత్త బుట్టలను పంపిణీ చేశారు. పాఠశాల స్వచ్ఛత కోసం హ్యాండ్ వాష్ సిస్టమ్, బయో టాయిలెట్ నిర్మించారన్నారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో పాటు స్వచ్ఛ పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ స్వచ్ఛ పాఠశాల అభివృద్ధికి దాల్మియా సీఎస్ఆర్ చేస్తున్న కృషి అభినందనీయమని స్వచ్ఛ పాఠశాల కోసం కృషి చేసి సాధిస్తామన్నారు. సీఎస్ఆర్ సిబ్బంది గురుదేవి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళాలోకానికి వన్నెతెచ్చిన మహనీయురాలు



సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ మహాసభ నేతలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త, గొప్ప రచయిత అని, ఆమె మహిళా లోకానికి వన్నె తెచ్చిన మహనీయురాలని బీసీ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక కన్వీనర్ బడిగించల చంద్రమౌళి కొనియాడారు. సావిత్రిబాయి పూలే 187వ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఉన్నత స్థితికి చేరుకోవాలంటే విద్య అవసరమని గుర్తించి మన దేశంలో బాలికలకు మొట్టమొదటి పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ మహాసభ నేతలు బాలకృష్ణ, చిన్న రామ్మూర్తి, సుబ్రహ్మణ్యం, కుండా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: మండల పరిధిలోని చిన్నకొమ్మెర్ల ఉన్నత పాఠశాలలో భారత మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి 1848 జనవరి 1న పూణెలో మొదటి బాలికల పాఠశాల ప్రారంభించారన్నారు. నూతన వ్యవస్థ కోసం మహిళల సకల హక్కుల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాటం చేశారన్నారు. ఆమెను మహిళలంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు.


మైలవరం : కేకును కోస్తున్న ఉపాధ్యాయినులు

జమ్మలమడుగులో మార్కెట్ ధరలు
(నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	08
పచ్చిమిరప	25
బెండకాయలు	30
మటిక్కాయలు	35
వంకాయలు	20
బీట్‌రూట్	40
బంగాళదుంప	20
కాకర	30
దొండకాయలు	35
అల్లం	50
చిక్కుడు	40
క్యారెట్	60
ఎర్రగడ్డలు	50
క్యాబేజీ	30
బీరకాయలు	50
బీన్స్	60
ముల్లంగి	30

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	400
చికెన్	200
100 గుడ్లు	380
డజను గుడ్లు	50
చేపలు	100

తెరపై ఈనాడు

సాయిరాం : హలో
టి.పి.ఆర్ : 2 కంట్రీస్
టి.ఎన్.ఆర్ : ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్)
ఎర్రగుంట్ల : హేమ: ఎం.సి.ఎ.
వెంకటేశ్వర: 2 కంట్రీస్

జమ్మలమడుగు

సంక్రాంతి పండుగ సందర్భంగా పోటీలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13న పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం ఒక ప్రకటనలో తెలిపింది. ముగ్గులు, వంటలు, మ్యూజికల్ ఛైర్స్, వెల్‌బేబీ షో పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీలోగా కన్నెలూరు ప్రాథమిక పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజల్లో ప్రశ్నించేతత్వం రావాలి

జమ్మలమడుగు గ్రామసభలో మంత్రి ఆదినారాయణరెడ్డి



లబ్ధిదారులకు సంక్రాంతి కానుకలను అందజేస్తున్న మంత్రి ఆది

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకే జన్మభూమి గ్రామసభలను నిర్వహిస్తున్నామని మంత్రి ఆదినారాయణరెడ్డి అన్నారు. సభలకు ప్రజలు వస్తున్నారే తప్ప తమ ప్రాంతంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాలేకపోతున్నారని, సభల్లో అధికారులను వారు ప్రశ్నించడంలేదన్నారు. ఎప్పుడైతే ప్రశ్నించే తత్వం పెరుగుతుందో సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయని ఆయన చెప్పారు. 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమంలో భాగంగా బుధవారం జమ్మలమడుగు పురపాలిక పరిధిలోని మూడు, నాలుగు వార్డులకు సంబంధించిన గ్రామ సభలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రేషన్‌కార్డులు అన్నింటికీ అవసరమని, అందువల్ల లేనివారు తప్పనిసరిగా వాటిని తీసుకోవాలన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని కోరారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో చదివితే ట్రిపుల్ ఐటీ సీటు సులభంగా పొందవచ్చని చెప్పారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించేందుకు ఉపయోగపడే పుస్తకాలను తమ ట్రస్టు తరపున ఉచితంగా అందజేస్తామన్నారు. సభకు ముందు హాజరైనవారంతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఇందులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తులసమ్మ, కమిషనర్ లక్ష్మీరాజ్యం, తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఆర్ఐ కిశోర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు గ్రామీణ : పులివెందులలో సీఎం చంద్రబాబు జన్మభూమి - మా ఊరు కార్యక్రమానికి విచ్చేస్తున్న సందర్భంగా జమ్మలమడుగు మండలంలోని ఇంటి స్థలాలు మంజూరైన లబ్ధిదారులు బుధవారం పులివెందులకు బయలుదేరారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల లబ్ధిదారులను మూడు బస్సులలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంపించారు.

☆గ్రామీణ ప్రజల సమస్యలను పరిష్కరించాడికే ప్రభుత్వం గ్రామ సభలను చేపడుతోందని ప్రజలు సమన్వయం పాటించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పి.బొమ్మేపల్లె గ్రామ పంచాయతీలో ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో 5వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను గ్రామ సభల్లో రాయితీ రూపంలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిష్కార మార్గం చూపుతారన్నారు. మండల వ్యవసాయాధికారి శివ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో వరి సాగు చేసే రైతులు పంటకు ఈనెల 15వ తేదీలోపు రూ.450 చొప్పున బీమా చేయించుకోవాలని తెలిపారు. బొమ్మేపల్లె గ్రామంలో 50కి పైగా వ్యక్తిగత మరుగుదొడ్లకు స్థలం లేకపోవడంతో ప్రజలకు అందుబాటులో ఉండేలా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని గ్రామ ప్రజలు తహసీల్దార్‌కు విన్నవించారు. బి.ఆర్.కొట్టాల, ఒంటిమిద్దె, బొమ్మేపల్లె గ్రామాల నుంచి రేషన్‌కార్డుకు, పక్కా గృహాలకు, పింఛన్‌లకు దరఖాస్తులు వచ్చాయని, అర్హులైన వారికి మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.

లావనూరు(కొండాపురం) : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పొట్టిపాడు, వెంకయ్యకాల్వ, లావనూరు గ్రామ పంచాయతీల్లో జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, వాటిని అర్హత కల్గిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజల చెంతకు పరిపాలన తెచ్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. మూడు గ్రామాల్లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అధికారులు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో అమర్‌నాథరెడ్డితో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైలవరం: సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి అనిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని వద్దిరాలలో ఎంపీడీవో నారాయణరెడ్డి, మురపంది పంచాయతీలో ప్రత్యేకాధికారి అనిత ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. అనిత మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందించడమే జన్మభూమి ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు భూపేష్, తహసీల్దార్ షేక్‌మోహిద్దీన్, తెదేపా నాయకుడు నరసింహారెడ్డి, సర్పంచి లక్ష్మీనరసమ్మ, తిరుమల్‌రెడ్డి, ఏపీఎం రమణ, ఏపీవో వెంకటసుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.



కొండాపురం : జన్మభూమి కార్యక్రమంలో పత్రాలు అందజేస్తున్న ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య



మైలవరం : సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అనిత



జమ్మలమడుగు గ్రామీణ : తమ సమస్యలను తహసీల్దార్‌కు వివరిస్తున్న పి.బొమ్మేపల్లె గ్రామ ప్రజలు

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఎటువంటి రోగాల భారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో నాగరాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పొన్నతోట పంచాయతీలో 5వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం-ఆనందం విషయాలపై చర్చించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ సభలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. కుటుంబంలో ఆడపిల్లలను మగవారికి సమానంగా పెంచాలని, ప్రభుత్వం వారి అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్‌లు, పక్కా గృహాలను, చంద్రన్న బీమా, సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆటల, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉచిత పశు, ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

వేపరాల(జమ్మలమడుగు), న్యూస్‌టుడే: మైలవరం మండలం వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరుణ్‌బాబు అధ్యక్షతన, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయిని కె.విజయకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సావిత్రి బాయి మొదటి మహిళా ఉపాధ్యాయినిగా సమాజానికి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. పూలే జీవిత చరిత్రను, మహిళలకు చేసిన సేవలను ఉపాధ్యాయురాలు విజయకుమారి వివరించారు. అనంతరం ఉపాధ్యాయినులను సన్మానించారు.

కట్టుబాట్లను ధిక్కరించిన ధీశాలి : మహాత్మా జ్యోతిరావు పూలే ధర్మపత్ని అయిన సావిత్రిబాయి పూలే హైందవ మత కట్టుబాట్లను ధిక్కరించి బాలికా, వితంతు విద్యను ప్రోత్సహించిన ధీశాలి అని భాజపా దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ఆంజనేయులు కొనియాడారు. బుధవారం జమ్మలమడుగు పట్టణం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో జయంతి వేడుకలను నిర్వహించారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినపుడే సావిత్రిబాయి పూలే ఆశయం నెరవేరుతుందన్నారు. భాజపా నాయకుడు నూకల లక్ష్మీనారాయణ, వైకాపా నాయకుడు నరసింహులు, న్యాయవాది భూతమాపురం సుబ్బారావు హాజరై ఉపాధ్యాయినులను సన్మానించారు.

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో బుధవారం సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయినులు స్వర్ణలత, లీలావతమ్మ, సర్వేశ్వరిలను సత్కరించారు. దేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే అని ప్రధానోపాధ్యాయుడు కె.సుబ్బిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.సి.వెంకటసుబ్బయ్య, పి.రవిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పండుగలా 'జన్మభూమి - మాఊరు'

చిన్నదండ్లూరు(ఎర్రగుంట్ల), న్యూస్‌టుడే: మండలపరిధిలోని చిన్నదండ్లూరు గ్రామంలో బుధవారం ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం పండుగలా సాగింది. డప్పువాయిద్యాలు, చెక్కభజనలతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అధికారులు కూర్చొనే వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మామిడి ఆకులు, పూలతో బాగా అలంకరించారు. గ్రామానికి సంబంధించిన వివరాలు, జన్మభూమి-మాఊరు కార్యక్రమ వివరాలను ప్రొజెక్టురు ద్వారా తెరపై గ్రామస్థులకు తెలియజేశారు. గతంలో జరిగిన నాలుగు జన్మభూమి-మాఊరు కార్యక్రమాల్లో వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారాలను తెరపై వివరించారు. ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన సందేశాన్ని తెలియజేశారు. గ్రామస్థులు, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం సీమంతం కార్యక్రమంలో గర్భిణులకు పూలు, పండ్లు, చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎం.నల్లపురెడ్డి, తహసీల్దారు బి.మహేశ్వరరెడ్డి, ఎంఈవో బాలశౌరమ్మ, పర్యవేక్షకుడు సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయాధికారి అరుణ, హౌసింగ్ ఏఈ బాలిరెడ్డి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు కళావతి, అధికారులు పాల్గొన్నారు. అలాగే ఇల్లూరు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పింఛన్లు పంపిణీ చేశారు. అధికారులు, గ్రామస్థులు జన్మభూమి ప్రతిజ్ఞ చేశారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న పురపాలిక సిబ్బంది

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందిస్తోందని పురపాలిక అధ్యక్షుడు హెచ్.ముసలయ్య పేర్కొన్నారు. స్థానిక రెండోవార్డులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెదేపా పేదలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమపథకాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.

కడప

తెరపై ఈనాడు

రవి - హలో, **ప్రతాప్** - 2 కంట్రీస్
రాజా (రహత్) - ప్రాజెక్ట్ **మురళి** - ఒక్క క్షణం,
సుధ -10, **తాహర్** - సప్తగిరి ఎల్ఎల్బి, **అమీర్** -
టైగర్ జిందాహై, **రమేష్ :** ఎంసీఏ , **అప్సర** - రాజుగారి
గది-2 **ఎస్ఆర్ సాయిబాబా** - ఎంసీఏ

జన్మభూమిలో విశ్వవిద్యాలయ విద్యార్థులు

యోవేవి (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం మొయిళ్లకాలువ గ్రామంలో యోవేవి అధికారులు జన్మ భూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుశాఖ, జాసేప కోఆర్డినేటర్ ఆచార్య టి.రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎన్ ఈశ్వరరెడ్డి, డాక్టర్ జి.విజయభారతి, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వెన్నెముకకు ఉచిత శస్త్ర చికిత్స

కడప రిమ్స్, న్యూస్‌టుడే: జిల్లాలో మొట్ట మొదటిసారిగా ఎన్టీఆర్ సేవా పథకం ద్వారా అర్హులైన రోగులకు అనుబంధ ఆసుపత్రులలో వెన్నెముక శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తున్నట్లు న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. వెన్నెముక సమస్యల ద్వారా మెడనొప్పి, నడుము నొప్పి, సయాటికా, చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, నరాల బలహీనత వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇవి ప్రాథమిక దశలో మందులతో నయమవుతాయని, మందులతో తగ్గని ఎడల శస్త్రచికిత్స ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. వీటి పట్ల నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యం, మల మూత్రాల సమస్యలు వచ్చే ప్రమాదముందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లారీ.. ఆటో ఢీ

కడప నేరవార్తలు: రిమ్స్ ఠాణా పరిధిలో వైఎస్ఆర్ కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వైఎస్ఆర్ కూడలి సమీపంలో ఆటో వెళ్తుండగా లారీ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ శివయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు ఉపాధి ఇంటర్వ్యూలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: వినూత్న ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌లో మండలాల వారీగా పని చేసేందుకు సేల్స్ రెప్రజెంటేటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు కొత్త కలెక్టరేట్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. 19 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి పదో తరగతి పాస్/ఫెయిల్/ఏదేని డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల పురుష అభ్యర్థులు ఇంటర్వ్యూలలో పాల్గొనాలని కోరారు.

క్రీడా పోటీలతో అనుభవం.. అవకాశం

ఈసీసీ క్రికెట్ టోర్నీతో మెలకువలు ● 13 రోజుల పాటు పండుగ వాతావరణం

క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగు చూడాలంటే పోటీల్లో విరివిగా పాల్గొనాలి. టోర్నమెంట్లలో పాల్గొనడం ద్వారా వారిలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది.. కొత్త విషయాలపై అవగాహన ఏర్పడుతుంది.. మెలవకులు నేర్చుకునే అవకాశం కలుగుతుంది. పది మందిలో గుర్తింపు వస్తుంది. ప్రత్యేకతలను చాటుకునే అవకాశం దక్కుతుంది. అదృష్టం బాగుండి నిపుణుల కంటపడితే అవకాశాలు తలుపుతడతాయి. ఇవన్నీ నగరవాసులకే పరిమితం అనుకుంటే పొరపాటే. ఈనాడు క్రికెట్ టోర్నీతో గ్రామీణ యువతకు కూడా ఈ అవకాశం దక్కింది. అందుకే విజేతలుగా నిలవకపోయినా తమకు అనేక విషయాలు నేర్చుకునే అవకాశం దక్కిందని యువ క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడుసార్లు ఈసీసీ కప్ విజేతగా నిలిచి రన్నర్‌గా నిలిచిన శ్రీహరి జట్టు సీనియర్ ఆటగాళ్ల తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే...

- న్యూస్‌టుడే, కడప క్రీడలు



మైదానంలో క్రికెట్ ఆడుతున్న దృశ్యం

టోర్నీలోనే అత్యధిక పరుగులు



నా పేరు షేక్ జహీర్ అబ్బాస్. తల్లిదండ్రులు గౌసియాబేగం, షేక్ అన్వర్. మాది కడప నగరం. నేను స్వతహాగా బ్యాట్స్‌మెన్‌ను. నేను కేడీసీఏ తరఫున జిల్లా, సౌత్‌జోన్ మ్యాచ్‌లు ఆడాను. ఈనాడు టోర్నీలో పోటీలు నిర్వహించడం వల్ల యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగు చూస్తుంది. ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయి. నేను ఈ టోర్నీలో అత్యధికంగా మూడు అర్ధ సెంచరీలు చేశాను. మొదటి మ్యాచ్‌లో 35 పరుగులు, మూడు వికెట్లు, రెండో మ్యాచ్‌లో 53 పరుగులు, రెండు వికెట్లు, మూడవ మ్యాచ్‌లో 74 పరుగులు, మూడు వికెట్లు, నాలుగో మ్యాచ్‌లో 53 పరుగులు, మూడు వికెట్లు, ఫైనల్లో 35 పరుగులు, రెండు వికెట్లు చేశాను. కేవలం మరుగున ఉన్న ఆటను వెలికి తీయడానికి ఇది చక్కటి వేదిక. ఇలాంటి పోటీలను నిర్వహిస్తేనే క్రీడాకారులు మునుముందు మరింత మెరుగ్గా రాణించడానికి అవకాశం ఉంటుంది. ఛాంపియన్‌గా నిలవాలనే కసి పెరుగుతుంది.

క్రికెట్ అంటే చాలా ఇష్టం



నా పేరు అజహరుద్దీన్.. నేను వికెట్ కీపర్‌ను. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి క్రికెట్ ఆటను ఎక్కువగా ఆడే వాడిని. టీవీల్లో క్రికెట్ ఎక్కువగా చూసేవాణ్ణి. ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ పోటీల ద్వారా మరింతగా ఆటలపై మక్కువ కలిగింది. నేను చక్కగా ఆడి మంచి క్రికెటర్‌గా రాణించాలని నిర్ణయించుకున్నా. అందుకు తగిన శిక్షణ, పోటీలు అవసరమని ఈనాడు నిర్వహించిన ఈ కార్యక్రమం నాకు ఎంతో ఉపయోగపడుతుంది. నాలో ఉన్న ప్రతిభను అంచనా వేసుకునేందుకు ఇదో చక్కని అవకాశం.

క్రికెటేతర క్రీడలకు ప్రోత్సాహం



నా పేరు పి.కసిరెడ్డి. తల్లిదండ్రులు నల్లమ్మ, పీవీ.సుబ్బారెడ్డి వ్యాపారం చేస్తారు. జట్టులో నేను మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్. ఈనాడు టోర్నీలో మొదటి మ్యాచ్‌లో 17, రెండో మ్యాచ్‌లో 20, మూడో మ్యాచ్‌లో 19, నాలుగో మ్యాచ్‌లో 25 పరుగులు చేశాను. ఈ మెగా టోర్నీ మాలాంటి క్రీడాకారులకు చక్కగా ఉపయోగపడింది. ఈనాడు క్రికెట్ ఆటనే కాకుండా క్రికెటేతర క్రీడలను కూడా ప్రోత్సాహించడంలో ఎల్లప్పుడు ముందుంటుంది. గ్రామీణ పిల్లల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసి వారిని మంచి క్రీడాకారులుగా తయారు చేయడంలో ఈనాడు ముందుంటుంది.



బౌలింగ్ చేస్తున్న క్రీడాకారుడు

నాన్న ప్రోత్సాహంతో రాణింపు



నా పేరు వై.దిలీప్, తల్లిదండ్రులు నిర్మలారాణి, వై.జోసఫ్. మాది చెన్నూరు. నాన్న ప్రోత్సాహంతో క్రీడాకారుడిగా రాణిస్తున్నా. చిన్నప్పటి నుంచి ఆటలపై మక్కువ పెంచుకుని అందులో రాణించడానికి కష్టపడుతున్నా. నాతోటి మిత్రుల సహకారం, సమష్టి కృషితో ఆటల్లో చక్కగా రాణించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇప్పుడు ఈనాడు టోర్నీతో మా నైపుణ్యం వెలుగులోకి వచ్చినందుకు సంతోషంగా ఉంది. నేను రెండో మ్యాచ్‌లో కలిపి ఆరు వికెట్లు తీసి మా జట్టు ఫైనల్లో వరకు వెళ్లడానికి నా పాత్ర ఉండడం సంతోషంగా ఉంది. ఈనాడు సంస్థ ఇలాంటి టోర్నీలు మరిన్ని నిర్వహించడం వల్ల మరింత మంది యువ క్రికెటర్లు వెలుగులోని వస్తారు.

దేశం తరఫున ఆడాలి



నా పేరు పి.ప్రవీర్‌రెడ్డి. తల్లిదండ్రులు రూప, పీఆర్.రెడ్డి. జట్టులో నేను ఓపెనింగ్ బౌలర్‌ను. ఈనాడు టోర్నమెంట్లో మొత్తం నాలుగు వికెట్లు తీశాను. రెండు విలువైన క్యాచ్‌లు పట్టాను. మొదటి మ్యాచ్‌లో నాలుగు, రెండో మ్యాచ్‌లో ఒకటి, మూడో మ్యాచ్‌లో రెండు, నాలుగో మ్యాచ్‌లో ఒకటి వికెట్లు తీశాను. ఈ మెగా టోర్నీ మాకు చక్కగా ఉపయోగపడింది. తరువాత జిల్లా, రంజీ మ్యాచ్‌లో ఆడి పోటీల్లో నా ప్రతిభ చూపుతూ తర్వాత భారత్ తరఫున ఆడే స్థాయికి ఎదగాలన్న పట్టుదలతో శ్రమిస్తున్నా. నిరంతరం ఇందుకోసం నా కృషి జరుగుతుంది. ఎప్పటికైన అనుకున్నది సాధిస్తా. ఆ క్రమంలో ఈనాడు ఓ చక్కని వేదిక కల్పించడం ఆనందంగా ఉంది.

రాష్ట్రస్థాయి ఎదగడానికి అవకాశం



నా పేరు టి.వంశీ. తల్లిదండ్రులు జయమ్మ, సుమిత్ర. మేము కడప నగరంలో నివాసం ఉంటున్నాం. నేను ఓపెనింగ్ బౌలర్. మొదటి మ్యాచ్‌లో ఒకటి, రెండో మ్యాచ్‌లో రెండు, మూడో మ్యాచ్‌లో ఒక వికెట్ తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాను. మాలాంటి క్రీడాకారుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీయడానికి ఈనాడు ఛాంపియన్ క్రికెట్ పేరుతో పోటీలను నిర్వహించడం ఆనందంగా ఉంది. జిల్లాలోని యువ క్రీడాకారులు ప్రతిభను వెలికితీసి జిల్లాస్థాయిలో గెలిచిన వారికి ప్రాంతీయ స్థాయి టోర్నీకి, అక్కడి నుంచి రాష్ట్రస్థాయి టోర్నీకి పంపడం ఆనందంగా ఉంది. అక్కడ రాణిస్తే జాతీయస్థాయి వరకు వెళ్లవచ్చు. మా కళాశాల జట్టు కొన్నేళ్లుగా జిల్లా ఛాంపియన్. ఈ సారి రన్నర్లుగా నిలిచాం.

మార్కెట్ ధరలు



కడప రైతు బజారులో కూరగాయల ధరలు (నిన్నటివి).. చికెన్, గుడ్లు, మటన్, చేప ధరలు బయట మార్కెట్‌లో పలికిన ధరలు కూడా అదే రోజువి.
- న్యూస్‌టుడే, కడప వ్యవసాయం

కూర గాయలు	కిలోకు ధర రూపాయల్లో...
టమోటా	09
పచ్చిమిరప	20
వంకాయ	16
బెండ	20
బీర	20
కాకర	20
మటిక	20
చిక్కుడు	24
అలసంద	24
అనపకాయలు	24
ఉల్లిపాయలు	40
బంగాళదుంపలు	18
క్యాబేజి	18
క్యారెట్	66
బీన్సు	28
బీట్రూట్	30
కీర	18
దోస	20
దొండ	26
ముల్లంగి	16
అల్లం	48
కాలీఫ్లవర్	32

మాంసం ధరలు..

చికెన్ మామూలు	160
చికెన్ స్కిన్‌లెస్	180
గుడ్లు డజను	43
మటన్	480
చేప	80 నుంచి 140

ఉచితంగా కార్పొరేట్ విద్య

కడప విద్య, న్యూస్‌టుడే: కడప ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఫౌండేషన్ ఫర్ ఎకానమిక్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ కాలమానినిని కడప ఉప విద్యాధికారి జిలానీబాషా, నగరపాలక విద్యాధికారి కేవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఉచితంగా ఇంటర్మీడియట్ స్థాయిలో కార్పొరేట్ విద్య హాస్టల్‌తో పాటూ అందించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి చాంద్‌బాషా మాట్లాడుతూ.. ఆసక్తి గల ముస్లిం మైనారిటీ బాలురు (పదో తరగతి చదువుతున్నవారు) తమ పేరు ఈ నెల 25వ తేదీ లోపూ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉచిత విద్య కోసం ప్రవేశ పరీక్ష ప్రొద్దుటూరు, రాయచోటిలో ఈ నెల 28వ తేదీన, కడపలో ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇలియాస్‌బాషా, అయూబ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



నోటిఫికేషన్‌ను ఆవిష్కరిస్తున్న ఉప విద్యాధికారి

దాడి కేసులో ఆరుగురి అరెస్టు

కడప నేరవార్తలు: కడప చిన్నచౌకు ఠాణా పరిధిలో మహిళపై జరిగిన దాడి కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కడప ఓంశాంతి నగర్‌కు చెందిన సుమలత అదే ప్రాంతానికి చెందిన వెంకట రమణారెడ్డి ఇంట్లో అద్దెకు ఉంటోంది. డిసెంబరు 31వ తేదీ వెంకటరమణారెడ్డి భార్య ఇంటి ముందర నీళ్లు చల్లుతుండగా ఆ నీళ్లు సుమలత ఇంటి వద్దకు వెళ్లాయి. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదిలా ఉండగా మరుసటి రోజు వెంకటరమణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మోహన్, గోవర్ధన్‌రెడ్డి, శివరామిరెడ్డి, నల్లపురెడ్డి సుమలత ఇంట్లోకి వెళ్లి ఆమెపై దాడి చేశారు. ఆమెతో పాటు సుమలత భర్త, అత్తపై కూడా దాడి చేశారు. గాయపడిన వీరు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు వెళ్లారు. బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. బుధవారం వారిని వై.కూడలి వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండుకు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

కడప

విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులు వేయాలి

చింతకొమ్మదిన్నె: విద్యార్థులు చిన్నతనం నుంచే పరిశోధనలపై దృష్టి పెంచుకొని ఉన్నత చదువుతో పరిశోధనలు చేసి కొత్త కొత్త వాటిని కనిపెట్టాలని ఎంఈవో నాగమునిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జమాల్‌పల్లెలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. దీనిని ఎంఈవో పరిశీలించి విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రయోగాలను చూసి వాటి గురించి తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పూలమాల వేస్తున్న నారాయణమ్మ తదితరులు



సన్మానం అందుకున్న మహిళా ఉపాధ్యాయురాళ్లు



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: భారతీయ తొలి ఉపాధ్యాయుని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బుధవారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేశారు. మహిళాధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీడిత జనాలకు విద్య నేర్పి భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే ఖ్యాతి గడించారన్నారు. మహిళా ఉపాధ్యక్షురాలు జయశ్రీ, ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, నగర అధ్యక్షుడు గోవిందు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు శివయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటరమణ, బీసీ నాయకుడు పురుషోత్తం యాదవ్ పాల్గొన్నారు.

☛ భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఎర్రముక్కపల్లెలోని పద్మ మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో తెలుగు రాష్ట్ర ప్రజాసమితి ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేశారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంతో ప్రకటించాలని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎన్.రాజా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జయవర్ధన్, ఎస్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, అంతర్జాతీయ మానవ హక్కుల హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, టీఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణా పాల్గొన్నారు.

☛ సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు స్థానిక బీఎస్పీ కార్యాలయంలో బుధవారం జరిగాయి. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలను బీఎస్పీ నాయకులు చంద్రమౌళి, ఓబయ్య వేశారు. నగర అధ్యక్షుడు దేవా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

☛ **ఏడురోడ్లు:** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా పేరు గడించిన సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శప్రాయురాలని బ్లడ్ 2 లివ్ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక గుంతబజారులోని రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మానసిక వికలాంగుల పాఠశాలలో డీబీఎంకే సంస్థ జిల్లా అధ్యక్షుడు మాదినేని నిత్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాళ్లకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ విస్సు రాయల్, డీబీఎంకె సభ్యురాలు శివజ్యోతి, సాయి, సురేంద్ర, రాస్ ఉపాధ్యాయులు లలిత, పద్మావతి, చంద్రకళ, వరలక్ష్మి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బిల్టప్, (కడప): సామాజిక విప్లవకారిణి, చదువుల తల్లి సావిత్రిబాయి పూలేనని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (అభావిస) రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగా సురేష్ అన్నారు. సావిత్రిబాయి పూలే 187వ జయంతి సందర్భంగా బుధవారం కడపలోని బాలికల జూనియర్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఆమె పోరాట స్ఫూర్తితో దేశంలో అనేక ఉద్యమాలు జరిగాయని, సమాజంలో మార్పు చోటు చేసుకుందని వివరించారు. ఇప్పటి విద్యార్థినులు సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంకుశం, క్రాంతి, గంగాధర్, ఈశ్వరయ్య, కళాశాల ప్రిన్సిపల్ మస్తాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (రావియుస) ఆధ్వర్యంలో బుధవారం కడపలోని వివిధ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి భరత్ ఆధ్వర్యంలో.. సావిత్రిబాయి పూలే చిత్రటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాత్విక్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప విద్య, : సమాజంలో ఉన్న రుగ్మతలను నిర్మూలించేందుకు సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని కడప చెమ్ముమియాపేట బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయారెడ్డి కొనియాడారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక చెమ్ముమియాపేట బాలుర ఉన్నత పాఠశాలలో సామాజిక విప్లవకారిణి, భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల సహ ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బరాజు, రామమూర్తి, వాణి, మేరీ, బాబు, చెన్నయ్య, గణేష్ పాల్గొన్నారు.

జిల్లా దుర్గంధ పరిషత్



ప్రాంగణంలో ఉన్న చెత్త చెదారం

ఎర్రముక్కపల్లె (కడప), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణం అస్తవ్యస్తంగా తయారైంది. ముఖ్య కార్యనిర్వాహణాధికారి, ఉప ముఖ్యనిర్వాహణాధికారి మొదలుకుని సుమారు 80 మంది ఉద్యోగులు పనిచేసే కార్యాలయ ప్రాంగణం దుర్గంధంగా తయారైంది. చెత్త, తిన్న తర్వాత పడేసిన విస్తరాకులు కూడా ఎక్కడివక్కడే ఉండిపోయాయి. మురుగు నీరు ప్రవహిస్తూనే ఉన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కల పెంపకం వీరికి పట్టనట్లుంది. నాటేందుకు తీసుకొచ్చిన మొక్క చాన్నాళ్లుగా ఇలా బెంచీకే పరిమితమైంది. చూసిన వారంతా ఇది జిల్లా పరిషత్ కార్యాలయమేనా అంటున్నారు.

యాజమాన్య పద్ధతులు చేపట్టండి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: మినుము పంటలో సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రంజిత, తేజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొర్లపల్లె, పెండ్లిమర్రి మండలంలోని కొత్తగిరియపల్లె గ్రామాల్లోని మినుము పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామూహిక క్షేత్ర ప్రదర్శనలో భాగంగా 25 ఎకరాలకు రైతులకు టీబీజీ-104 మినుము విత్తనాన్ని రైతులకు అందించామన్నారు. అలాగే విత్తనశుద్ధి మందు ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు 5 చొప్పున పుసుపు బంక ఎరలు, జీవన ఎరువులు పంపిణి చేసినట్లు తెలిపారు. పూత దశలో పురుగులను గుడ్ల దశలో గుడ్లను నివారించడానికి వేప నూనె 5 ఎం.ఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. లింగాకర్షక బుట్టలు, పసుపు బంక ఎర్రల వల్ల లద్దె పురుగు, తెల్లదోమ ఉనికి ఉద్ధృతిని గమనించి వాటిని నివారించాలన్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు.





పింఛన్లు అందిస్తున్న అధికారులు, మాట్లాడుతున్నతెదేపా నాయకుడు హరిప్రసాద్

పోటెత్తిన జనం.. వినతులు ఘనం

కడప నగరపాలిక, న్యూస్‌టుడే: కడప నగరంలోని అయిదు వార్డుల్లో బుధవారం జన్మభూమి - మాఊరు రెండో రోజున కార్యక్రమాలు నగరపాలిక ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమం వార్డుల వారీగా ప్రతిరోజూ నిర్వహించడం జరుగుతుందని నగరపాలిక అధికారులు తెలిపారు. వార్డుల్లోని ప్రజలు జనవరి 11వ తేదీ వరకు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని వారు తెలిపారు. సంబంధిత వార్డులోని ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియజేస్తూ లిఖిత పూర్వక వినతి పత్రాలు సమర్పించారు. ప్రధానంగా వృద్ధులకు, వితంతువులకు పింఛను, రేషన్‌కార్డులు, ఇంటి స్థలం, ఇతర సమస్యలను అధికారులకు తెలియజేశారు. బుధవారం రెండో రోజు దేవుని కడప ఏటీఎం సమీపంలోని 2వ వార్డులో, ముత్తరాసుపల్లె జిల్లా పరిషత్ పాఠశాల 12వ వార్డులో, నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్ 21వ వార్డులో, అమీన్‌పీర్ రోడ్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల 32వ వార్డులో, నబీకోట 42వ వార్డులో మొత్తం అయిదు వార్డుల్లో జన్మభూమి - మా ఊరు కార్యక్రమాలు నిర్వహించారు. వార్డుల్లోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో నగరపాలక అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నగరంలో నేడు జన్మభూమి

గురువారం 3వ వార్డు రామాంజనేయపురం ఎస్టీ కాలనీలో, 14వ వార్డు ప్రకాష్‌నగర్ ఏఆర్‌పీ కాలనీలో, 23వ వార్డు సాయిబాబా అనాథ శరణాలయంలో, 33వ వార్డు రెడ్‌క్రాస్ వద్ద నున్న మున్సిల్ పాఠశాలలో, 43వ వార్డు రవీంద్రనగర్ గంగమ్మ దేవస్థానంలో జరుగుతుందని నగరపాలక అధికారులు తెలిపారు.

కమలాపురం

నేడు మహబూబ్ సుబహాని ఉరుసు

కమలాపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని పడమరవీధిలో ఉన్న శ్రీహజరత్ మహబూబ్ సుబహాని, ఖుతుబే రబ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలాని, దస్తగిరిస్వామి ఉరుసు గురువారం నిర్వహిస్తున్నట్లు పఠాన్ అఫ్జల్ అలీ ఖాన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ మహమ్మద్ ఫైజుల్ గఫ్ఫార్‌షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండాను పట్టణంలోని పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి

కమలాపురం : స్థానిక బీఎస్పీ కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. బీఎస్పీ నియోజకవర్గ బాధ్యుడు సీవీ రమణ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలల్లో మార్పు కోసం, వారి హక్కుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. నాయకులు అబ్బయ్య, రాజన్న, సుబ్బన్న, దానం పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : మండల పరిధిలోని ఇందిరానగర్ వద్ద సోమవారం తెల్లవారజామున కారు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన విషయం విధితమే. ఇందిరానగర్‌లోని బాధిత కుటుంబీకులను బుధవారం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి పరామర్శించి ఓదార్చారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున నాలుగు కుటుంబాలకు రూ.40 వేలు, గాయపడిన ఇరువురికి రూ.5 వేల చొప్పున రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తెదేపా నాయకులు వై.ఎరికల్‌రెడ్డి, సూర్యప్రతాప్ రెడ్డి, బాలగంగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పి.చంద్రశేఖర్, వెల్లటూరు సర్పంచి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మినుములో యాజమాన్య పద్ధతులు అవసరం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మినుము పంటలో సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఊటుకూరు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రంజిత, తేజు సూచించారు. బుధవారం గొర్లపల్లె, పెండ్లిమర్రి మండలంలోని కొత్తగిరియపల్లె గ్రామాల్లో మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామూహిక క్షేత్రప్రదర్శనలో భాగంగా 25 ఎకరాలకు రైతులకు టీబీజీ-104 మినుము విత్తనం అందించామన్నారు. విత్తనశుద్ధి మందు ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు 5 చొప్పున, పుసుపు బంక ఎరలు, జీవన ఎరువులు పంపిణీ చేసినట్లు చెప్పారు. మినుము పంటలో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు వివరించారు.

అతివేగం.. అజాగ్రత్త.. నిర్లక్ష్యం

తెలిసినా పాటించని నిబంధనలు ● గాలిలో కలుస్తున్న ప్రాణాలు

అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కుటుంబాలను విషాదంలో నింపుతున్నాయి. ఒకరికి తోడు లేకుండా చేస్తే మరొకరికి పేగుబంధాన్ని తెంచుతున్నాయి. మానవ తప్పిదాల వల్లనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తెలిసీ నిబంధనలు పాటించకపోవడం, అతి వేగం, అనుభవం లేకున్నా, మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ ప్రమాదాలు చేస్తున్నారు. రవాణాశాఖ అధికారులు, పోలీసు యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నా ప్రయోజనం లేకుంది. వాహనదారులు, చోదకులు, ప్రజలు మేల్కొంటేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు.



చెన్నూరు మండలం బుడ్డాయపల్లె వద్ద గతేడాది ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో చోదకులు ఇద్దరూ మృతిచెందారు. నిబంధనలు పాటించకుండా వాహనాలను నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు అంటున్నారు.

కమలాపురం, న్యూస్‌టుడే : పని మీద బయటికి వెళ్లిన వ్యక్తి క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చే వరకు కుటుంబ సభ్యుల్లో ఆందోళన. ఆలస్యమైతే కంగారు. ఫోను చేసి ఎక్కడున్నావని వాకాబు చేస్తున్నారు. ఎలాంటి చెడు వార్త వినాల్సి వస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. మనం జాగ్రత్తగా వెళ్తున్నప్పటికీ ఎదురుగా వస్తున్న వాహనదారులూ అంతే జాగ్రత్తగా రావాలి. ఏ ఒక్కరు నిబంధన పాటించకపోయినా ప్రాణాలు గాలిలో కలిసిపోయినట్లే. ఒక నిండు ప్రాణం పోతే కుటుంబ సభ్యులు అనాథలవుతారు. పిల్లల చదువులు, వివాహాలు ఆగిపోయే ప్రమాదం ఉంది.



కొత్తగంగిరెడ్డిపల్లె వద్ద మృతి చెందిన కొత్తూరు భాస్కర్ రెడ్డి(పాతచిత్రం)

● ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం, నాలుగు చక్రాల వాహన చోదకులు, ముందు, వెనుక సీట్లో కూర్చున్న వారు తప్పనిసరిగా సీటుబెల్టు ధరించాలన్నది నిబంధన, సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం, మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనం నడపకూడదనే చట్టాన్ని చాలా మంది ఖాతరు చేయడం లేదు. ప్రమాదాలను కొని తెచ్చుకుని విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేసి జరిమనా విధిస్తున్నా చోదకుల్లో మార్పురావడం లేదు. తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వాహనదారుల్లో చైతన్యం తీసుకొస్తే కొంతవరకైనా ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

● డిసెంబరు 21న పెండ్లిమర్రి మండలం కొత్తగంగిరెడ్డిపల్లె వద్ద కారు ఢీకొనడంతో కొత్తూరు భాస్కర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. అదే నెల 31న చెన్నూరు మండలం శేషయ్యగారిపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో తాడిగొట్ల నారాయణ దుర్మరణం చెందారు. వీఎన్‌పల్లె మండలం సంగాలపల్లె- వీఎన్‌పల్లె గ్రామాల మధ్య స్త్రీశక్తి భవనం ఎదురుగా జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఈ నెల 1న పెండ్లిమర్రి మండలం ఇందిరానగర్ వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. వల్లూరు, చింతకొమ్మదిన్నె, కమలాపురం మండలాల్లో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో సుమారు పదిమంది వరకు ప్రాణాలు కోల్పోయారు.

ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు ఇవే

● కమలాపురం మండలంలో క్రాస్‌రోడ్డు, పాపఘ్ని బస్సు వంతెన సమీపం, గొల్లపల్లె వంక కాజ్‌వే ఇరుకుగా ఉండడంతో అక్కడా, పందిళ్లపల్లె వద్ద పధాన రహదారిలో, భైరవేశ్వరుడి ఆలయం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వేగనిరోధకాలు, సూచిక ఫలకలు లేకపోవడమే కారణమని వాహనచోదకులు అంటున్నారు.

● వల్లూరు మండలంలో బస్టాండు చెంత, తప్పెట్ల, గోటూరు వంకలపై ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు మృత్యువాత పడ్డారు. అయినా వాహనదారులను హెచ్చరిస్తూ ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయలేదు.

● కడప- కర్నూలు జాతీయ రహదారిలో చెన్నూరు మండలం ఉంది. రహదారి పనులు కొన్నిచోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కొత్త రోడ్డు వద్ద, చిన్నమాచుపల్లె, శేషయ్యగారిపల్లె తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందారు. పనులు పూర్తిచేయిస్తే ఈ ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించవచ్చు.

● పులివెందుల- కడప రహదారిలో ఉన్న పెండ్లిమర్రి మండల పరిధిలో వైవీయూ బైపాస్, పగడాలపల్లె, రామచంద్రాపురం, ఎల్లటూరు, గుర్రాలచింతలపల్లె నిత్యం వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడం, రహదారిపైనే వాహనాలు నిలుపుతుండడం, వేగనిరోధకాలు లేకపోవడమే ప్రమాదాలకు కారణమని వాహనదారులు అంటున్నారు.

మద్యం తాగి నడపడం వల్లే..



ఎక్కువ మంది వాహన చోదకులకు మద్యం తాగడం అలవాటైంది. మద్యం మత్తులో వాహనాన్ని అదుపు చేయలేరు. వాహనం ఎలా, ఎంత వేగంతో వెళుతోంది గమనించలేరు. అలాంటి వారితోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపులు, ఇరుకు రహదారులు, రద్దీ ఎక్కువగా ఉన్న చోట్ల గుర్తులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయలేదు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలి. **- వెంకటరమణ, వాహన చోదకుడు, కమలాపురం**

చోదకుల్లో చైతన్యం రావాలి



వాహనాలు నడిపే వారిలో చైతన్యం రావాలి. గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవాలంటే నిబంధనలు పాటించాలి. వాహనదారులకు తరచూ అవగాహన కల్పిస్తున్నాం. శిరస్త్రాణం, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని, అతివేగం పనికిరాదని, అధికలోడుతో వెళ్లకూడదని చెబుతూనే ఉన్నాం. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తున్నాం. ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

- మహమ్మద్‌రఫీ, ఎస్సై, కమలాపురం

కమలాపురంలో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
మటిక	26
టమోటా	10
బీన్స్	40
దొండకాయలు	28
క్యారెట్	50
కాలీఫ్లవర్(ఒకటి)	12
కాకరకాయలు	30
పచ్చిమిర్చి	26
వంకాయలు	28
బెండకాయలు	26
ఉర్లగడ్డలు	26
చిక్కుడు	28
బీట్రూట్	40
అల్లం(పాతది)	60
అల్లం(కొత్తది)	50
ముల్లంగి	28
బీరకాయలు	32
అలసంద	28
ఎర్రగడ్డలు	50
మునగకాయలు (నాలుగు)	12
నిమ్మకాయలు (డజను)	10
అనప	30
కరివేపాకు(కట్ట)	10
కొత్తిమీర(కట్ట)	10

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	440
చికెన్	160
చికెన్ స్కిన్‌లెస్	180
నాటుకోడి స్కిన్	350
గుడ్లు(డజను)	60
చేపలు	150

తెరపై ఈనాడు

కమలాపురం : ప్రదీప్ : ఎంసీఏ
చెన్నూరు : కృష్ణ : అదిరింది
కడపలో.. రవి - హలో, **ప్రతాప్ -** 2 కంట్రీస్, **రాజా (రహత్) -** ప్రాజెక్ట్, **మురళి -** ఒక్క క్షణం, **సుధ -** ఆక్సిజన్, **తాహర్ -** సప్తగిరి ఎల్‌ఎల్‌బి, **అమీర్ -** టైగర్ జిందాహై, **రమేష్ :** ఎంసీఏ, **అప్సర -** రాజుగారి గది-2, **ఎస్‌ఆర్ సాయిబాబా -** ఎంసీఏ

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



నందిమండలం ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయురాలు పద్మను సన్మానించిన ఉపాధ్యాయినులు



చింతకొమ్మదిన్నె : సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

నందిమండలం(పెండ్లిమర్రి), న్యూస్‌టుడే : సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం నందిమండలం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కళావతి మాట్లాడుతూ నిమ్నజాతుల అభివృద్ధికి, మహిళా సాధికారతకు, బాలికల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయురాలు పద్మను ఉపాధ్యాయినులు సన్మానించారు.

చెన్నూరు : సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించాలని ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం చెన్నూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అలివేలు సావిత్రిబాయి జీవిత విశేషాల గురించి విదార్థులకు వివరించారు. జనవిజ్ఞాన వేదిక మండలశాఖ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ప్రధానకార్యదర్శి రంగనాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు బాషా పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : సావిత్రి బాయి పూలే ఆశయ సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని ఎంఈవో నాగమునిరెడ్డి అన్నారు. బుధవారం చింతకొమ్మదిన్నె ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతిని ఆర్‌ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్, ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి స్వాతి, ఉపాధ్యక్షుడు మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

రామనపల్లె(చెన్నూరు), న్యూస్‌టుడే : సర్కారు బడుల్లోని విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాల సంచులు పంపిణీ చేశారు. బుధవారం రామనపల్లె గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ వారు సేవాభావంతో విద్యావాహిని ప్రాజెక్టు కింద విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, దేశభక్తి పాటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీయడం కోసం కృషి చేస్తోందన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి చంద్రశేఖర్, ఎస్‌ఎంసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి చంద్రశేఖర్

మైదుకూరు

ఉత్తమ సేవలకు ప్రశంసలు

ఖాజీపేట, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కొండా భార్గవికి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే అవార్డు అందజేసింది. బుధవారం వైజాగ్‌లోని కట్టమంచి రామలింగారెడ్డి ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, సర్వశిక్షాభియాన్ పథక సంచాలకుడు శ్రీనివాస్, విద్యాశాఖ కమిషనర్ శ్రీనివాసులు చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు కొండా భార్గవిని అభినందించారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

మైదుకూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే సమ్మె తప్పదని జేఏసీ ఛైర్మన్ కె.మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. బుధవారం మైదుకూరులోని ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ కార్యాలయం వద్ద విద్యుత్తు కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచి నేరుగా వేతనం అందించాలన్నారు. ప్రస్తుత విధానం వల్ల దళారుల ప్రమేయం పెరిగి కార్మికులు నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు కావడం లేదన్నారు. ఒప్పంద కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. జరుగుతున్న అన్యాయాలపై పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు సురేష్, సృజన్, ఎన్.ఈశ్వరయ్య, కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పొగబెడుతున్నారు



బద్వేలురోడ్డులో ప్లాస్టిక్ పైపుల కర్మాగారం వద్ద కాలుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ఇంటిలో చెత్తే కదా అని ఒకచోట పడేసి కాల్చకూడదు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తకు నిప్పుపెట్టడం జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. పర్యావరణం, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జారీ చేసిన ఉత్తర్వులు నగర, పురపాలికల్లో సక్రమంగా అమలు కావడం లేదు. మైదుకూరులోని బద్వేలు రోడ్డులో ప్లాస్టిక్ గొట్టాల పరిశ్రమ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలకు రహదారి పక్కనే నిప్పు పెడుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్చడం వల్ల డయాక్సీన్లు, కార్బన్ మోనాక్సైడ్, పాలీసైక్లిక్ హైడ్రో కార్బన్స్, సూక్ష్మ, అతిసూక్ష్మ ధూళి కణాలు, ఓలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్, బెంజిన్ వంటి ప్రమాదకర రసాయనాలు గాల్లో కలుస్తున్నాయి. ఆ గాలిని పీల్చే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనుంది. పర్యావరణం, ప్రజారోగ్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించే వారిపై పుర అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

- మైదుకూరు, న్యూస్‌టుడే

మైదుకూరులో మార్కెట్ ధరలు

(నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	10
పచ్చిమిరప	20
బెండకాయలు	30
మటిక్కాయలు	30
వంకాయలు	25
బీట్‌రూట్	25
బంగాళదుంప	30
కాకర	50
క్యాలీఫ్లవర్	40
అల్లం	70
చిక్కుడు	60
క్యారెట్	40
ఎర్రగడ్డలు	60
క్యాబేజీ	50
మునక్కాయలు	120
బీన్స్	30
దొండ	30
ముల్లంగి	40

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	440
చికెన్	140
100 గుడ్లు	410
డజను	55
చేపలు	100

తెరపై ఈనాడు

విజయ్ : ఎంసీఏ,

భారత్ : హలో

ఖాజీపేట :

రాజ్: ఆక్సిజన్

బస్సులు లేక ప్రయాణికుల పాట్లు



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు



టాపుపై కూర్చుని ప్రయాణిస్తూ..



తెలుగు వెలుగు బస్సుకు వేళాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు

ఫోకస్

మైదుకూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పులివెందుల పర్యటనకు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులను పంపడంతో ప్రయాణికులకు బస్సుల కొరత ఏర్పడింది. ఉన్న బస్సులు కిక్కిరిసి ప్రయాణించాయి. గమ్యస్థానాలు చేరేందుకు కొందరు యువకులు, విద్యార్థులు బస్సు తలుపుల వద్ద వేలాడుతూ ప్రయాణించారు. మరికొందరు టాపు ప్రయాణాలు చేశారు. బస్సు ఎక్కడానికి కుస్తీ పట్టాల్సి వచ్చింది. వృద్ధులు, మహిళలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మైదుకూరు డిపోలో 48 బస్సులు ఉండగా 26 బస్సులను ముఖ్యమంత్రి పర్యటన కోసం పంపారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. విధిలేక కొందరు ప్రైవేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయించారు.

6న జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష

ఖాజీపేట, న్యూస్‌టుడే : స్థానిక టీచర్సు కాలనీలోని రెయిన్‌బో పాఠశాలలో ఈనెల 6న జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభా పోటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంటు తవ్వా సుధాకర్‌రెడ్డి తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు, వింప్ డైరెక్టరు విజయ్‌కుమార్‌తో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసం, పరీక్షల్లో ఒత్తిడిని ఎదుర్కోవడం, జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విషపురుగు కాటుతో రైతు మృతి

ఖాజీపేట, న్యూస్‌టుడే : మండలంలోని మిడుతూరు గ్రామానికి చెందిన రైతు ఇట్టెం బాలయ్య(36) విషపురుగు కాటుకు గురై బుధవారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు బాలయ్య వరిపంటకు రసాయన మందు పిచికారి చేస్తూ స్పృహతప్పి పడిపోయారన్నారు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. విషపురుగుకాటు వల్లనే మృతిచెంది ఉంటారని వైద్యులు సూచించినట్లు చెప్పారు. బాలయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలిసి తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ మిడుతూరుకు వెళ్లి మృతుడికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్ వెంట ఉన్నారు.

దాడుల నుంచి రక్షణ కల్పించాలని వినతి



లోకాయపల్లె మహిళలతో చర్చిస్తున్న సీపీఎం నాయకులు

జీవీసత్రం(మైదుకూరు), న్యూస్‌టుడే : జీవీసత్రం పరిసర గ్రామాలకు చెందిన ఓ వర్గం వారు చేస్తున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం లోకాయపల్లెకు చెందిన మహిళలు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ రామకృష్ణకు సమస్యను విన్నవించుకున్నారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. ఓ యువతి విషయంలో నెలకొన్న వివాదం సమస్యకు కారణమైందని, అగ్రవర్ణాలకు చెందిన కొందరు గ్రామం వద్దకు చేరుకుని దుర్భాషలాడుతున్నారని, బజారుకు సరకుల కోసం వెళ్లినా అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా ఇదే సమస్య ఉందని పిల్లలు సైతం భయంతో గడపాల్సి వస్తోందని పేర్కొన్నారు. జీవీసత్రం, పెద్దశెట్టిపల్లె, ఎన్.ఎర్రబల్లె, సోమయాజులపల్లె, నాగసానిపల్లె గ్రామాలకు చెందిన వారు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న మహిళలను మాలమహానాడు నాయకుడు పుల్లయ్య పరామర్శించి న్యాయం చేయాల్సిందిగా ఎస్సైని కోరారు. విషయం తెలుసుకున్న కుల వివక్ష పోరాట సమితి నాయకుడు సునీల్, సీపీఎం నాయకుడు శివకుమార్, సుబ్బరాయుడు, రాజ తదితరులు మహిళలతో చర్చించారు. ఘర్షణలు తలెత్తకుండా గ్రామం వద్ద పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై రామకృష్ణ విలేకరులకు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో సుబ్బరాయుడు

దువ్వూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈవో సుబ్బరాయుడు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్థానిక ఎంఆర్‌సీలో బుధవారం సూక్ష్మ ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలకు కావాల్సిన అన్ని సదుపాయలు పొందుపరిచి సమగ్ర ప్రణాళికను తయారు చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానోపాధ్యాయులు అహల్యబాయి, జయరామయ్య, సి.వీరారెడ్డి, రంగశైలజ పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



ప్రదర్శనలో పాల్గొన్న బాలికలు

మైదుకూరు, న్యూస్‌టుడే : మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ వేదిక జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండు చేశారు. మహిళా విద్య కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా దినోత్సవంగా ప్రకటించినా ఎలాంటి వేడుకలను నిర్వహించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం వివిధ పాఠశాలల బాలికలచే పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కడప రోడ్డులోని ఉన్నత పాఠశాల నుంచి పట్టణ వీధుల్లో ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్స్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండు చేశారు. బాలికలు, మహిళలు ఉపయోగించే శానిటరీ న్యాప్‌కిన్స్‌పై జీఎస్టీని మినహాయించాలని, బాలికా విద్యను ప్రోత్సహిస్తూ ప్రాథమిక స్థాయి నుంచి పౌష్టికాహారం, ఉపకార వేతనం అందించాలన్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని, బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మలత, ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్షుమ్మ, యూటీఎఫ్ నాయకులు రాయప్పరాజు, సత్తార్‌పైజీ, అబ్దుల్‌కలాం, ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక సంఘం కాలమానిని ఆవిష్కరణ



కాలమానిని ఆవిష్కరిస్తున్న నాయకులు

బ్రహ్మంగారిమఠం(మైదుకూరు), న్యూస్‌టుడే : బ్రహ్మంగారిమఠంలోని వ్యవసాయ అధికారి మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ రైతు, కార్మిక సంఘం కాలమానిని బుధవారం సంఘ నాయకులు ఆవిష్కరించారు. సంఘ నాయకులు నరసింహారెడ్డి, గజ్జల నాగిరెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు. పంటల సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించాలని నాయకులు ఆకాంక్షించారు.

కొత్తపేట(ఖాజీపేట): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఎస్టీయూ ఎంతగానో కృషిచేస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బాలగంగిరెడ్డి అన్నారు. మండంలోని కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు రాజశేఖర్ చేతుల మీదుగా నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడంలో, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి ఎస్టీయూ కృషిచేస్తోందన్నారు. సంఘ నాయకులు ఓబన్న, కృష్ణానాయక్, మస్తాన్‌వల్లి, వీరశేఖర్, జగన్ పాల్గొన్నారు.

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ కాలమానిని బుధవారం మైదుకూరులోని సంఘ నాయకులు ఎంఈవో పద్మలత చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, శ్రీనివాసయాదవ్, రమణ, గురుమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీయులు కాదండోయ్!



టోపీలతో మహిళలు

తలకు టోపీ. పైన కోటు. చేతికి గ్లౌజ్‌లు. మెడకు రుమాలు. భుజానికి సంచితో కనిపిస్తున్న ఈ మహిళలు విదేశీ పర్యాటకులు అనుకుంటే పప్పులో కాలేసినట్లే! మైదుకూరు పురపాలిక పరిధి గడ్డంవారిపల్లెకు చెందిన మహిళా కూలీలు. ప్రముఖ కంపెనీ గడ్డంవారిపల్లె వద్ద విత్తనం కోసం రైతులచే జొన్నపంటను సాగు చేయించింది. సాగు చేసిన ఆడ, మగ మొక్కలను క్రాసింగ్ చేసేందుకు మహిళా కూలీలను నియమించారు. ప్రత్యేక వస్త్రధారణతో మహిళలు పనులకు వెళ్తున్నారు.

- మైదుకూరు, న్యూస్‌టుడే

నేడు రెండు గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు

ఖాజీపేట, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపేట, ఆంజనేయకొట్టాలు గ్రామాల్లో గురువారం జన్మభూమి- మాఊరు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి వెంకటరమణ తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి నిర్వహిస్తోందని, అర్హులు బియ్యం పత్రాలు, పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మైదుకూరు

ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి


చాపాడు : లక్ష్మిపేట గ్రామసభలో అధికారుల ఎదుట కన్నీరు పెడుతున్న వీరనారాయణమ్మ


ఖాజీపేట : మాట్లాడుతున్న తెదేపా మండలశాఖ అధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి


మైదుకూరు : సర్పంచితో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఖాజీపేట, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తోందని. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని జన్మభూమి కార్యక్రమం రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి అన్నారు. బుధవారం చెముళ్లపల్లె గ్రామంలో సర్పంచి రెడ్యం అరుణ ఆధ్యక్షనత ఏర్పాటు చేసిన గ్రామసభను ఆమె పరిశీలించారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. వైద్యాధికారి సెల్వియా సాల్మోన్ వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యసేవలు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి సురేష్‌రెడ్డి, తెదేపా నాయకులు రెడ్యం వెంకట్రామిరెడ్డి, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పుల్లూరు : పుల్లూరు పంచాయతీ రహమత్‌ఖాన్‌పల్లెలో బుధవారం జన్మభూమి గ్రామసభ సర్పంచి పూల తహరున్నీషా అధ్యక్షతన నిర్వహించారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ హుసేన్, తహసీల్దారు పార్వతి, ఉప తహసీల్దారు మాధవీలత, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.


దువ్వూరు : చంద్రన్న కానుకలు అందజేస్తున్న తహసీల్దారు రవిశంకర్‌రెడ్డి

పింఛను కోసం కన్నీరు

భద్రిపల్లె(చాపాడు) : మండలంలోని లక్ష్మిపేటలో జరిగిన జన్మభూమి- మాఊరు గ్రామసభలో కేతవరం గ్రామానికి చెందిన వీరనారాయణమ్మ తనకు పింఛను మంజూరు చేయలేదని కన్నీరు పెట్టుకుంది. బుధవారం గ్రామసభ జరుగుతుండగా వీరనారాయణమ్మ తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెంది పదేళ్లు అవుతున్నా పింఛను రాలేదన్నారు. తనకు 60 ఏళ్లు నిండాయని, వృద్ధాప్య, వితంతు పింఛను ఏది ఇచ్చినా అర్హురాలినే అని అధికారులకు వివరించింది. స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి సుబ్బరామాంజనమ్మ మాట్లాడుతూ తాను కార్యదర్శిగా వచ్చాక దరఖాస్తు చేసుకోలేదని, ఇప్పుడు తీసుకుని ఆన్‌లైన్ చేయిస్తానని చెప్పారు. సర్పంచి సుమలత, ఎంపీటీసీ సభ్యురాలు జ్ఞానమ్మ, మాజీ ఎంపీపీ గురివిరెడ్డి, స్థానిక నాయకులు వీరశేఖర్‌రెడ్డి, నారపురెడ్డి పాల్గొన్నారు. భద్రిపల్లె గ్రామసభకు తహసీల్దారు పుల్లారెడ్డి హాజరయ్యారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను అందించారు. సర్పంచి చందా పార్వతి పాల్గొన్నారు.

జన్మభూమి గ్రామసభలకు స్పందన

జీవీసత్రం(మైదుకూరు) : జన్మభూమి-మాఊరు గ్రామసభలకు మంచి స్పందన లభించింది. వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పింఛను పత్రాలు, బియ్యంకార్డులను పంపిణీ చేశారు. దరఖాస్తు చేసినా మంజూరు కానివారు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను శాఖల వారీగా అధికారులు ప్రజలకు వివరించారు. బుధవారం మైదుకూరు మండలం జీవీసత్రంలో సంపద సృష్టి కేంద్రం వద్ద సర్పంచి షంషాద్‌బేగం ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. తహసీల్దారు నాగేశ్వరరావు, ఎంపీడీవో రామానుజం, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఏవో లక్ష్మణ్‌కుమార్, వైద్యురాలు సుధావాణి, ఆరోగ్య అధికారి రాజ పాల్గొన్నారు. పురపాలికలోని రాయప్పగారిపల్లెలో వార్డు సభ్యురాలు పోతురాజు రత్నాలు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పురపాలిక ఛైర్మన్ రంగసింహా, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం (మైదుకూరు) : బ్రహ్మంగారిమఠం లోని తోట్లపల్లె జన్మభూమి గ్రామసభ నిర్వహించారు. సర్పంచి శ్రీవాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మండలాధ్యక్షుడు చక్రవర్తి, ఎంపీటీసీ సభ్యులు బాలయ్య హాజరయ్యారు. గ్రామసభలో భూములకు సంబంధించి ఆన్‌లైన్ సమస్యలను ప్రస్తావించారు. బియ్యంకార్డులు, పింఛన్‌పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృష్ణయ్య, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దువ్వూరు : సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఐ.బయనపల్లె, కృష్ణంపల్లె గ్రామాల్లో ఎంపీడీవో ఎ.వి.రమణారెడ్డి, తహసీల్దారు ఎస్.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జన్మభూమి- మాఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించి స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.15 వేలు అందిస్తోందన్నారు. ఆరోగ్యం- ఆనందం అనే భావనతో ఎన్టీఆర్ వైద్యసేవ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, అన్న అమృత హస్తం పథకం అమలు చేస్తోందన్నారు. పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైద్యాధికారి బి.కిరణ్‌కుమార్ వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యసేవలు అందించారు. గృహనిర్మాణశాఖ ఏఈ వీరన్న, ఏవో ప్రవీణ్‌కుమార్, నీటిపారుదలశాఖ ఏఈ రాజ్‌కుమార్, పీఆర్ ఏఈ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నేడు జన్మభూమి- మాఊరు గ్రామసభలు.. మండల పరిధిలోని వెంకుపల్లె, పెద్దజొన్నవరం, జిల్లెళ్ల గ్రామాల్లో గురువారం జన్మభూమి- మాఊరు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.వి.రమణారెడ్డి తెలిపారు. అన్ని శాఖల అధికారులు గ్రామసభలకు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

పల్లె కబుర్లు


సర్వర్‌ఖాన్‌పేటలో చేతిపంపు వద్ద నెలకొన్న అపరిశుభ్రత

సర్వర్‌ఖాన్‌పేట : సర్వర్‌ఖాన్‌పేటలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతిపంపు వద్ద అపరిశుభ్రత నెలకొంది. చేతిపంపు చుట్టూ చిత్తుకాగితాలు, వ్యర్థపదార్థాలు ఉన్నాయి. మంచినీటిని పట్టుకునేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, పంచాయతీ అధికారులు స్పందించి చేతిపంపు వద్ద అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చెన్నముక్కపల్లె : గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరింది. ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులకు సరిపడా సౌకర్యాలు లేవు. వర్షాకాలంలో గదంతా ఉరుస్తోంది. ఆరోగ్య ఉపకేంద్రానికి నూతన భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు.

అగ్రహారం : అగ్రహారంలోని నత్తడషావలి దర్గా వద్ద నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాన్ని ఇరుకైన అద్దె గదిలో నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి గడువులోగా పూర్తయ్యేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

\- ఖాజీపేట, న్యూస్‌టుడే

తగ్గిన టమోటా ధరలు


రహదారి పక్కన కుప్పగా పోసి విక్రయిస్తున్న రైతు

దువ్వూరు, న్యూస్‌టుడే : నవంబరులో కిలో టమోటాలు రూ.50 ధర పలికాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నాలుగు రూపాయలతోనే విక్రయిస్తున్నారు. అధిక ధర ఉండడం చూసి మండల పరిధిలోని మనేరాంపల్లె, చిన్నశింగనపల్లె, మూడిండ్లపల్లె తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో టమోటా సాగుచేశారు. తగ్గిన ధరలు చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. నెల కిందట ధరలు ఆశాజనకంగా ఉండటంతో భారీగా పెట్టుబడులు పెట్టారు. దిగుబడులు చేతికి వచ్చే సరికి ధరలు పతనమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటాలను మార్కెట్‌కు తరలిస్తే వ్యాపారులు కిలో రెండు రూపాయలతో కొనుగోలు చేస్తున్నారని, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని అంటున్నారు. టమోటాలకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని రైతన్నలు కోరుతున్నారు.

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి


ఖాజీపేట : సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు

ఖాజీపేట, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, బాలికల సంక్షేమం కోసం ఆమె అందించిన సేవలు మరువలేనివన్నారు. కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శాంతకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బాలగంగిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చాపాడు : ఆడపిల్లలు ఇంటి గడప దాటని రోజుల్లో సావిత్రిబాయి ధైర్యం చేసి బాలికల విద్య కోసం ఉద్యమాలు చేసిన గొప్ప నాయకురాలని ప్రధానోపాధ్యాయుడు నరహరిశర్మ అన్నారు. బుధవారం లక్ష్మిపేట ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జనవిజ్ఞాన వేదిక మహిళా నాయకురాలు జవహర్‌మున్నీర్ మాట్లాడుతూ మహిళలను విద్యావంతులుగా చేయడంలో, వితంతువుల శ్రేయస్సు కోసం సావిత్రిబాయి చేసిన కృషి మరువలేనిదన్నారు. జవివే నాయకుడు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చాపాడులో..

ప్రొద్దుటూరు

పింఛన్ల పంపిణీలో రాజకీయ వివక్ష తగదు

ప్రొద్దుటూరు పురపాలిక, న్యూస్‌టుడే: అర్హులైన 77 మంది చేనేత పింఛనుదారులకు మూడు నెలలుగా డబ్బులు ఇవ్వకుండా రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు వ్యవహరించడం తగదని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోసంగి వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం 5వ వార్డులోని జన్మభూమి-మాఊరు సభలో ప్రత్యేకాధికారి మధుసూదన్‌రెడ్డిని కలిసి ఆయన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈనెల 2న 77 పింఛన్లను ఇవ్వాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ కాలయాపన చేస్తున్నారన్నారు. సదరు విషయాన్ని పరిగణనలోకి తీసుకొని చేనేత పింఛనుదారులకు న్యాయం చేయాలని ఆయన ప్రత్యేకాధికారిని కోరారు.

సంక్రాంతి కానుకల పంపిణీ

ప్రొద్దుటూరు పురపాలిక, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని 27వ వార్డులో బియ్యం పత్రాల లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలను స్థానిక కౌన్సిలరు తలారి పుల్లయ్య బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ప్రతి పేదవాడు సంక్రాంతి పండగను సంతోషంగా జరుపుకోవాలని ఉచితంగా సరకులను అందిస్తున్నారని చెప్పారు.



సరకులను పంపిణీ చేస్తున్న కౌన్సిలరు తలారి పుల్లయ్య

రేపు ఉపాధి ఇంటర్వ్యూలు

కడప ఏడురోడ్లు : వినూత్న ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌లో మండలాల వారీగా పని చేసేందుకు సేల్స్ రిప్రజెంటేటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు కొత్త కలెక్టరేట్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహిస్తామని, 19 నుంచి 30 సంవత్సరాల వారు అర్హులని చెప్పారు.

ప్రొద్దుటూరులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
పచ్చిమిరప	30
టమోటాలు	10
బెండకాయలు	50
మటిక్కాయలు	42
వంకాయలు	30
బీట్‌రూట్	50
బంగాళదుంప	30
కాకర	50
క్యాలీఫ్లవర్ (ఒక పువ్వు)	50
అల్లం	70
చిక్కుడు	40
క్యారెట్	70
ఎర్రగడ్డలు (పాతవి)	50
ఎర్రగడ్డలు (కొత్తవి)	66
క్యాబేజీ	42
మునక్కాయలు	50
బీన్స్	120
దొండ	30

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	420
చికెన్	150
చికెన్ స్కిన్‌లెస్	160
నాటుకోడి మాంసం	320
100 గుడ్లు	500
చేపలు	130

తెరపై ఈనాడు

బీవీఎస్ : గరుడ వేగ, **వెంకటేశ్వర :** ఎంసీఏ, **సుధ :** హలో **అర్చన :** జై లవకుశ **ఆరవేటి :** ప్రొజెక్ట్, **శ్రీసాయిరాజేశ్వరి సినీహబ్ :** ఒక్క క్షణం, జ్యూమన్‌జి, 2 కంట్రీస్

ప్రభుత్వ పథకాలను ఆదాయ వనరులుగా మలుచుకోవాలి



ప్రొద్దుటూరు గ్రామీణ: పొదుపు మహిళలకు వడ్డీ లేని రుణ పత్రం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి



ప్రొద్దుటూరు గ్రామీణ: గర్భిణులకు సీమంతం చేస్తున్న వైద్యురాలు కల్పన, అంగన్వాడీ సిబ్బంది



రాజుపాళెం: పగిడాలలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ ప్రభాకరరెడ్డి

పెద్దశెట్టిపల్లె(ప్రొద్దుటూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేసే వివిధ అభివృద్ధి పథకాలను సుస్థిర ఆదాయ వనరులుగా గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు, కమలాపురం నియోజకవర్గాల జన్మభూమి కార్యక్రమ పర్యవేక్షకుడు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. సేంద్రియ ఎరువులతో సాగుచేసిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్, రాబడి ఉందని, ఆ దిశగా వ్యవసాయ పద్ధతులను మార్చుకోవాలని కోరారు. బుధవారం మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె, చౌటపల్లె గ్రామాలలో జన్మభూమి గ్రామసభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, మందులు వాడకుండా శనగ పంటకు అధిక దిగుబడి వచ్చేలా అన్నదాతల్లో మార్పు, ప్రేరణ కల్పించాలని ఏవో సాగర్‌కుమార్‌రెడ్డికి సూచించారు. బిందు సేద్యం అమల్లోకి తీసుకురావాలని చెప్పారు. తడి, పొడి కసువు వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువుల తయారీపై సర్పంచి బి.మేరిని జన్మభూమి పర్యవేక్షకుడు ప్రశ్నించగా పంచాయతీరాజ్ సిబ్బంది నుంచి సమాధానం రాకపోవడంపై అసహనం వ్యక్తపరిచారు. లేకపోతే గ్రామాల్లో అపరిశుభ్రత, అనారోగ్యం, పర్యావరణ విఘాతం ఉంటుందని హెచ్చరించారు. తమ పిల్లలకు పౌష్టికాహారం అవసరమనుకుంటే అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. వృద్ధాప్యంలో అమ్మ, నాన్నల ఆలనపాలన చూడకుండా కొత్త బియ్యంకార్డులు, పింఛన్లు, పక్కాగృహాల కోసం బయటకు పంపడం సర్వసాధారణంగా ఉంటున్నారు. ఈ విధంగా వ్యవహరించే కుటుంబ సభ్యులను గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు మందలించి, వారిలో మార్పు తీసుకురావాలని కోరారు. తాత్కాలిక సంక్షేమ పథకాలను ఆశించకుండా అందుబాటులో ఉన్న ఉపాధి, సంపాదన మార్గాలను సమన్వయం చేసుకోవాలని, ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో ఆధారపడ వద్దని తెలిపారు. అనంతరం వడ్డీ లేని రుణాలు కింద పొదుపు మహిళలకు పత్రాలను పంపిణీ చేశారు. గర్భిణులకు శ్రీమంతం చేసి ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, తహసీల్దారు వెంకటశివారెడ్డి, గృహనిర్మాణ ఏఈ వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ హసీనా, అంగన్వాడీ సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, శాంతకుమారి, ఉపాధి హామీ ఏపీవో జగదీష్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు కల్పన, ఎంపీటీసీ సభ్యురాలు కె.మేరి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల ప్రస్తావన : పెన్నాలోకి మైలవరం జలాలను వదిలిపెట్టాలని మైలవరం ఉత్తర కాల్వ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు బోడేల బాబుల్‌రెడ్డి జన్మభూమి పర్యవేక్షణ అధికారికి వినతి పత్రం అందజేశారు. కొత్తపేటలో విద్యుత్తు నియంత్రిక లేక తాగునీటి గొట్టపు బావి నిరుపయోగంలో ఉందని సూర్యనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. కొత్తపేట ఎస్సీ కాలనీలో కొత్తగా విద్యుత్తు తీగలు, స్తంభాలు ఏర్పాటు చేయాలని సుబ్బరాయుడు కోరారు. పెద్దశెట్టిపల్లె ఎస్సీ కాలనీలో నియంత్రిక ఫ్యూజులు పోతున్నట్లు స్థానికుడు ఫిర్యాదు చేశారు. 100 శాతం విద్యుత్తు సరఫరా ఉండాలని, అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఈ రాజబాబుకు పర్యవేక్షణాధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు.



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

పోషక విలువలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రొద్దుటూరు(నేరవార్తలు): పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా నిత్యం సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మోక్షేశ్వరుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సంజీవనగర్‌లో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఎస్సీ వసతి గృహం నందు ఆరోగ్యం-ఆనందం అనే అంశంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఎన్‌టీఆర్ వైద్యసేవలు, సీఎం ఆరోగ్య కేంద్రాలు, ఉచిత డయాలసిస్ సేవలు, ఆరోగ్యరక్ష, జననీ సురక్ష యోజన వంటి పథకాలను వినియోగించుకొని నిత్యం ఆరోగ్యంగా ఉండాలని అవగాహన కల్పించారు. పట్టణంలో ప్రతిరోజూ నాలుగు ఆరోగ్య వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని పీపీ యూనిట్ అధికారి డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ సూర్యకుమారి, ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే తెదేపా ధ్యేయం

పగిడాల(రాజుపాళెం): మండలంలోని పగిడాల, వెంగాళాయపల్లె గ్రామాలలో సర్పంచులు విజయలక్ష్మి, అనురాధ అధ్యక్షతన బుధవారం జన్మభూమి-మాఊరు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పగిడాల గ్రామసభలో మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రాజుపాళెం మండలంలోని రైతులకు జిల్లాలోనే అత్యధికంగా రూ.32 కోట్ల మేర బీమా మంజూరైనట్లు తెలిపారు. పగిడాల గ్రామ రైతులకు రూ.21 లక్షలు వచ్చినట్లు చెప్పారు. అధికారుల కృషి వల్లే పెద్దమొత్తంలో బీమా మంజూరైందని కొనియాడారు. అనంతరం తెదేపా నాయకురాలు మల్లేల లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం పింఛన్లు, రేషన్ కార్డులను పంపిణీ చేశారు. వెంగాళాయపల్లెలో మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపులపై అధికారులను నిలదీశారు. అనంతరం సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ మంజుల, తహసీల్దారు జ్ఞానకిరణ్‌మూర్తి, ఎంపీడీవో శివప్రసాదువర్మ, ఏఈలు భరత్‌రెడ్డి, వివేకానందరెడ్డి, హరికృష్ణ, ఏపీవో రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి సభలోనే బియ్యం పత్రం మంజూరు

77 చేనేత పింఛన్లు ఇవ్వాలని కౌన్సిలరు బైఠాయింపు







మాట్లాడుతున్న లింగారెడ్డి... బైఠాయించిన 5వ వార్డు కౌన్సిలరు మురళీధర్‌రెడ్డి... మాట్లాడుతున్న పురపాలిక మాజీ ఛైర్మన్ గుర్విరెడ్డి

ప్రొద్దుటూరు పురపాలిక, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 'జన్మభూమి-మాఊరు' సభల్లో అడిగిన వెంటనే అర్హులకు బియ్యం పత్రాలివ్వడానికి ఒక నోడల్ అధికారిని నియమించనున్నారని ఏపీ పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ మల్లేల లింగారెడ్డి పేర్కొన్నారు. అర్హులైన ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరు పట్టణంలోని 5, 6, 7, 8వ వార్డులలో స్థానిక కౌన్సిలర్లు యామిని, గంగాదేవి, భ్రమరాంబ అధ్యక్షతన, పుర ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 'జన్మభూమి- మాఊరు' సభలు జరిగాయి. 5వ వార్డు వైకాపా కౌన్సిలరు మురళీధర్‌రెడ్డి సభకు అధ్యక్షత వహించలేదు. నేరుగా సభకొచ్చి కింద కూర్చున్నారు. ఏపీ పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ మల్లేల లింగారెడ్డి, పుర కమిషనరు, పుర ఛైర్మన్ వేదిక పైకొచ్చి మీకు కేటాయించిన ఆసనంలో కూర్చోవాలని ఆహ్వానించారు. అందుకు కౌన్సిలరు నిరాకరించారు. గత మూడు నెలలుగా అర్హులైన 77 మంది చేనేతలకు పింఛన్లు పంపిణీ చేయకుండా తెదేపా నేతలు అడ్డుకున్నందుకు తాను నిరసన వ్యక్తం చేస్తున్నానన్నారు. పురపాలక కార్యాలయం వద్ద ఎమ్మెల్యే, చేనేత పింఛన్‌దారులతో కలిసి రిలేనిరాహార దీక్షలు చేస్తున్నా పట్టించుకోరా అని మురళీధర్‌రెడ్డి ప్రశ్నించారు. దాంతో లింగారెడ్డి, రఘురామిరెడ్డి జోక్యం చేసుకొని మంత్రి ఆదితో 4న కచ్చితంగా పింఛన్లు పంపిణీ చేయిస్తామని హామీ ఇచ్చారు. మీ మాటల మీద నమ్మకం లేదని, అధికారికంగా పుర కమిషనరు బండి శేషన్నతో ప్రకటన చేయించాలని భీష్మించుకుని కూర్చున్నారు. తర్వాత కమిషనరు మాట్లాడుతూ 77తో పాటు మరో 149 చేనేత పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని కూడా 4న జన్మభూమి సభలో మంత్రి ఆదినారాయణరెడ్డితో పంపిణీ చేయిస్తున్నామని వెల్లడించారు. దీంతో సభను బాయ్‌కాట్ చేస్తున్నానని మురళీధర్‌రెడ్డి సభ నుంచి నిష్క్రమించారు. అనంతరం సభ సాఫీగా కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి మాట్లాడుతూ సమస్యలుంటే పరిష్కారం కోసం అర్జీలు పెట్టాలని సూచించారు. 7, 8వ వార్డుల్లో పుర మాజీ ఛైర్మన్ ఉండేల గుర్విరెడ్డి నేతృత్వంలో సభలు జరిగాయి. అర్హులైన మహిళలకు కుట్టుమిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. నీటిపారుదల సంస్థ డైరెక్టరు చెమికెల పురుషోత్తంరెడ్డి, జన్మభూమి పర్యవేక్షకుడు మధుసూదన్, ఆర్వో మునికృష్ణారెడ్డి, టీపీవో శివగురుమూర్తి, డీఈఈ రాజేష్, సభ ప్రత్యేకాధికారులు సి.ప్రసన్నకుమార్, వి.నరసింహమూర్తి, దేవదానం, జి.సునీల్, అధికారులు, తెదేపా నేతలు ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, చెన్నయ్య, ఏసుదాసు పాల్గొన్నారు.

వైద్యురాలు, కౌన్సిలరు వాగ్వాదం...

ప్రొద్దుటూరు 6వ వార్డులో జరిగిన 'జన్మభూమి-మాఊరు' సభలో స్థానిక కౌన్సిలరు యామిని, హోమియోపతి వైద్యురాలు రాజేశ్వరి మధ్య వాగ్వాదం జరిగింది. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు సక్రమంగా వైద్యసేవలు అందించలేదని, ప్రతి చిన్న విషయానికి లంచం అడుగుతున్నారని, జీతాలు తీసుకుంటూ రోగులను దోపిడీ చేయడం సబబుగా ఉందా అని కౌన్సిలరు వైద్యాధికారిణిని నిలదీశారు. తాను హోమియో వైద్యురాలునని, మహిళలకు సంబంధించిన వైద్యురాలిని కాదని, తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని వైద్యురాలు రాజేశ్వరి బదులిచ్చారు. వైద్య వ్యవస్థను అడ్డదారిలోకి నెట్టివేయడం సమంజసంగా లేదని కౌన్సిలరు అన్నారు. జిల్లా తెదేపా మాజీ అధ్యక్షురాలు మల్లేల లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఆసుపత్రిలో జరుగుతున్న తీరు చాలా అన్యాయంగా ఉందన్నారు.

ప్రొద్దుటూరు

ఆర్థిక ప్రణాళికలపై అవగాహన అవసరం

వైఎంఆర్ కాలనీ(ప్రొద్దుటూరు), న్యూస్‌టుడే: స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 'చిన్న, మధ్యతరహా పెట్టుబడుల ప్రాధాన్యత' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెబీ సంస్థకు చెందిన ఆర్థిక విశ్లేషకుడు రాఘవరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చిన్న, మధ్యతరహా పెట్టుబడుల ఆర్థిక ప్రణాళికలను ఎంచుకుని అమలు చేయడం ద్వారా భవిష్యత్తుకు బంగారు బాట అవుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ రామానుజ బాబాజీ, ఎంబీఏ హెచ్‌వోడీ డాక్టర్ హరికిషన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల పాలిట పెన్నిధి తెదేపా ప్రభుత్వం

ప్రొద్దుటూరు పురపాలిక, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలను అందించడమే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం కృషి చేస్తోంది, మాజీ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి చేనేతల పట్ల వ్యతిరేకి కాదని, అత్యధిక మంది చేనేతలకు పింఛన్లు ఇప్పించడమే ఆయన అభిమతమని, వైకాపా ఎమ్మెల్యే రాచమల్లు ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేయడం సమంజసంగా లేదని పుర ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కౌన్సిలరు తలారి పుల్లయ్య, తెదేపా మైనార్టీ సెల్ జిల్లా నేత ఫరీద్ పేర్కొన్నారు. పుర ఛైర్మన్ ఛాంబరులో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 77 మందితో పాటు, మరో 149 మంది చేనేతలకు పింఛన్లను వరదరాజులురెడ్డి మంజూరు చేయించారన్నారు. స్థానిక 11వ వార్డులోని కాన్పుల ఆసుపత్రిలో గురువారం జరిగే 'జన్మభూమి-మాఊరు' సభలో మంత్రి ఆదినారాయణరెడ్డితో చేనేత పింఛనుదారులకు డబ్బులు ఇప్పిస్తామని చెప్పారు. అర్హులైన 226 మంది చేనేత పింఛనుదారులు ఉదయం పదిగంటలకు హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మార్కాపురం గణేష్‌బాబు, పట్టణ తెదేపా మాజీ అధ్యక్షుడు ఘంటసాల వేంకటేశ్వర్లు, రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుర ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి

ఘనంగా రమణ మహర్షి జయంతి

వైఎంఆర్ కాలనీ(ప్రొద్దుటూరు), న్యూస్‌టుడే: స్థానిక కొర్రపాడు రోడ్డులోని రమణ మహర్షి ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బుధవారం భగవాన్ రమణ మహర్షి 138వ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ రమణ మహర్షులకు విద్యార్థులు, ఉపాధ్యాయులచే లక్ష పుష్పార్చన నిర్వహించారు. అనంతరం 750 మంది విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు వెంకటరమణ, కరస్పాండెంట్ కేవీఎస్ ఆచారి, ప్రధానోపాధ్యాయుడు రవిప్రకాశ్, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రమణ మహర్షి జయంతి వేడుకలో విద్యార్థులు

మహిళల విద్యాభివృద్ధికి సావిత్రి బాయి పూలే కృషి





సావిత్రిభాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు.. మాట్లాడుతున్న శ్యామలమ్మ

వైఎంఆర్ కాలనీ(ప్రొద్దుటూరు), న్యూస్‌టుడే: మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే ఎంతో కృషి చేశారని ఉప విద్యాశాఖాధికారిణి శ్యామలమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక హోమస్‌పేటలోని పురపాలిక ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఉప విద్యాశాఖాధికారిణి శ్యామలమ్మ మాట్లాడుతూ మహిళల విద్య కోసం సావిత్రిబాయి స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి బాలికలకు విద్యాబోధన చేశారని పేర్కొన్నారు. దీంతో ఆమె దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారని చెప్పారు. అనంతరం యూటీఎఫ్ కాలమానిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రుడు, ఉపేంద్ర, సుందరం, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

★ స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో బుధవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి హాజరై మాట్లాడారు. సావిత్రభాయి పూలే జయంతిని దేశవ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారని చెప్పారు. అనంతరం సావిత్రిబాయి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జింకా సుబ్రహ్మణ్యం, సుందరం, బీసీ సంరక్షణ సమితి మాదాసు మురళి, సెన్సారు బోర్డు సభ్యుడు మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

6న జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష

ఖాజీపేట, న్యూస్‌టుడే : స్థానిక టీచర్సు కాలనీలోని రెయిన్‌బో పాఠశాలలో ఈనెల 6న జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభా పోటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంటు తవ్వా సుధాకర్‌రెడ్డి తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు, వింప్ డైరెక్టరు విజయ్‌కుమార్‌తో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసం, పరీక్షల్లో ఒత్తిడిని ఎదుర్కోవడం, జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణ పనులు ప్రారంభం

అమృతనగర్(ప్రొద్దుటూరు గ్రామీణ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని అమృతనగర్-1లో పది పడకల గదులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు పనులకు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి, రాష్ట్ర నీటిపారుదల సంస్థ అధ్యక్షుడు చెమికెల పురుషోత్తంరెడ్డి బుధవారం భూమి పూజలు చేశారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో వాటి నిర్మాణాలు చేపడుతున్నారు. అమృతనగర్-1, 2లలో ఇందిరమ్మ గృహసముదాయాల్లో పదివేల మంది జనాభా ఉన్నారు. వీరికి అత్యవసర వేళల్లో వైద్య సేవలు లేవు. దీనిపై 'ఈనాడు'లో పలు దఫాలుగా కథనాలు ప్రచురితమయ్యాయి. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఇక్కడ ఆసుపత్రి సేవలు ఉండాలని, వైద్యుడు, సిబ్బందిని కేటాయించాలని ఎంపీపీ మల్లేల ఝాన్సీరాణి తీర్మానం చేశారు. కలెక్టరు బాబురావునాయుడు ఇటీవల అమృతనగర్‌లో పర్యటించినప్పుడు వివిధ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మాజీ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి విన్నపం మేరకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఎంపీల్యాడ్ కింద మరో రూ.20 లక్షలు రానున్నాయి. దీంతో పది గదులు ఉన్న ఆసుపత్రి త్వరగా అందుబాటులోకి వస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లె పంచాయతీ నుంచి ఆర్థిక సాయాన్ని అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి భరోసా ఇచ్చినట్లు అమృతనగర్ వాసులు చెప్పారు. కార్యక్రమంలో డీఈ గోపాల్‌రెడ్డి, ఏఈ భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యుడు సుబ్బరాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తోట మహేశ్వరరెడ్డి, అర్కటవేముల క్రిష్ణారెడ్డి, మీ-సేవా కేంద్రం నిర్వహకుడు నిజాం బాషా, భానుమతి, సునీత, నాయబ్‌రసూల్, ఓబులేసు పాల్గొన్నారు.



భూమి పూజలో మాజీ ఎమ్మెల్యే, చిమికెల పురుషోత్తంరెడ్డి

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

మైదుకూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే సమ్మె తప్పదని జేఏసీ ఛైర్మన్ కె.మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. బుధవారం మైదుకూరులోని ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ కార్యాలయం వద్ద విద్యుత్తు కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచి నేరుగా వేతనం అందించాలన్నారు. ప్రస్తుత విధానం వల్ల దళారుల ప్రమేయం పెరిగి కార్మికులు నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు కావడం లేదన్నారు. ఒప్పంద కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. జరుగుతున్న అన్యాయాలపై పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు సురేష్, సృజన్, ఎన్.ఈశ్వరయ్య, కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపరిశ్రమ ఏర్పాటుపై సీఎంకు వినతి

గాంధీరోడ్డు(ప్రొద్దుటూరు గ్రామీణ), న్యూస్‌టుడే: జిల్లాలోనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడుకు విన్నపం చేసినట్లు ఉక్కు పరిశ్రమ సాధన సమితి అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. పులివెందులలో జరిగిన సమావేశానికి వచ్చిన ముఖ్యమంత్రిని కలిసి జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు వలన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విస్తృతం అవుతాయని తెలిపినట్లు చెప్పారు. కరవు, దుర్భిక్షం వలన జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసపోతున్న కుటుంబాలు అధికంగా ఉన్నాయని, ఉక్కు పరిశ్రమ ఉంటే సుస్థిర ఉద్యోగాలు, ఉపాధి ఉంటాయని తెలిపినట్లు చెప్పారు.



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

9న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

వైఎంఆర్ కాలనీ(ప్రొద్దుటూరు), న్యూస్‌టుడే: 2004 అక్టోబరు ఒకటవ తేదీ తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రస్తుతం అమలులో ఉన్న కాంట్రిబ్యూటరీ పింఛను పద్ధతిని(సీపీఎస్) రద్దు చేసి పాత పద్ధతినే పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగా పాత తాలూకా కేంద్రాల వద్ద జరిగే ధర్నాను విజయంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీబీ రోడ్డులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడారు. దేశవ్యాప్తంగా 40 లక్షల మంది, రాష్ట్ర వ్యాప్తంగా 1,86,000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ పథకం పరిధిలో ఉన్నారని తెలిపారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు సామాజికంగా, ఆర్థికంగా భద్రత లేకుండా పోతుందన్నారు. పదవీ విరమణ చెందిన ప్రభుత్వ ఉద్యోగికి పింఛను ఇవ్వడమనేది ప్రభుత్వాల కనీస బాధ్యత అని 1980లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురయ్య, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఖలందర్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షులు రమణయ్య, మల్లికార్జునరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు చెంచిరెడ్డి, ప్రొద్దుటూరు మండల శాఖ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకుడు శ్యాంసుందర్‌రెడ్డి

పులివెందుల

వెలిగల్లు నీరివ్వాలని సీఎంకు వినతిపత్రం

చక్రాయపేట, న్యూస్‌టుడే: పులివెందులలో బుధవారం జరిగిన 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు కె.రామచంద్రారెడ్డి వెలిగల్లు నీటిని సాగు కోసం ఇవ్వాలని కోరుతూ 10 వేల మంది రైతుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. చక్రాయపేట మండలం చాలా వెనుకబడి, కరవు మండలంగా ఉందని పేర్కొన్నారు. మండలంలోని రైతులకు ఎలాంటి సాగునీటి వనరులు లేక వారు కరవుతో అలమటిస్తున్నారన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నీటిని అందించవలసిందిగా ముఖ్యమంత్రిని కోరారు.

విద్యార్థులు సామాజిక సేవలో తరించాలి

చక్రాయపేట, న్యూస్‌టుడే: సామాజిక సేవచేస్తూ విద్యార్థులు తరించాలని స్థానిక ఐటీఐ ప్రిన్సిపల్ మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఐటీఐలో విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మురళీకృష్ణ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించారు. వివిధ మొక్కలను నాటారు. అనంతరం చెట్లకు పాదులు చేసి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ అధ్యాపక సిబ్బంది కూడా పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలను తొలగించి, చెట్లకు నీరు పోస్తున్న విద్యార్థులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

మడూరు(తొండూరు), న్యూస్‌టుడే: నిద్రమత్తులో ఆ లారీ చోదకుడు రోడ్డు పక్కనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. అయితే అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఈ ఉదంతం వివరాలు ఇలా ఉన్నాయి..

మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో చిలమకూరు నుంచి బెంగళూరు వెళుతున్న ఓ సిమెంటు లారీ తొండూరు మండలం, మడూరు సమీపానికి వచ్చింది. ఆ సమయంలో నిద్ర ముంచుకురావడంతో చోదకుడు రోడ్డుకు కుడివైపున ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో ఆ స్తంభం మూడు ముక్కలై, లారీ బోల్తాపడింది. అయితే ఈ ప్రమాదంలో చోదకుడు, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని ఏఎస్సై రమణయ్య తెలిపారు.



బోల్తాపడిన లారీ

ఆగని లీకేజీలు.. తాగునీరు వృథా

గొందిపల్లె (వేముల), న్యూస్‌టుడే: గొందిపల్లె మంచినీటిపథకం నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన గొట్టపుమార్గాలకు లీకేజీలు ఏర్పడడంతో తాగునీరు వృథా అవుతోంది. దీంతో ప్రజలకు సక్రమంగా నీరందడంలేదు. గ్రామంలోని ఎస్టీ, బీసీ కాలనీల్లో ఏర్పాటుచేసిన మంచినీటి పథకాల నుంచి దిగువప్రాంతానికి నీరందించేందుకు ఏర్పాటుచేసిన గొట్టపుమార్గాల్లో లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. లీకేజీలతో ఒకటిన్నర అంగుళాల వరకు నీరు వీధుల్లో పరుగులు తీస్తోంది. వీటికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలను నివారించి తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చిందని, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వృథాగా పోతున్న తాగునీరు

అంతర్‌వర్శిటీ క్రికెట్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఎంపిక

వేంపల్లె, న్యూస్‌టుడే: దక్షిణ ప్రాంత అంతర్ వర్శిటీ క్రికెట్ పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఐటీకి చెందిన 16 మంది విద్యార్థులు ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు విశాఖపట్నం ఆంధ్రా వర్శిటీలో జరిగే పోటీలలో వీరు పాల్గొననున్నారు. ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు అంతర్ వర్శిటీ క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల డైరెక్టరు భగవన్నారాయణ, ఏవో అమరేంద్ర, క్రీడా విభాగం సమన్వయకర్త షంషాద్‌బేగం, ఫిజికల్ డైరెక్టర్లు రమణారెడ్డి, ఓబయ్య హర్షం వ్యక్తం చేశారు.



క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టరు, ఏవో, తదితరులు

సావిత్రిబాయిపూలేకు ఘనంగా నివాళి



పూలే చిత్రపటానికి పూలమాలలు వేసిన శ్రీనివాసులురెడ్డి..



ఉపాధ్యాయినులకు బహుమతులను అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు

చక్రాయపేట, న్యూస్‌టుడే: సంఘ సంస్కర్త సావిత్రిబాయిపూలే సేవలు మరపురానివని రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం స్థానిక గ్రంథాలయ అధికారి పి.ఇబ్రహీం ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి జిల్లా గ్రంథాలయసంస్థ అధికారి శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. సావిత్రబాయిపూలే 186వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయసంస్థ అధికారి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రముఖ సంఘ సంస్కర్త, భారత తొలి ఆదర్శ ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే తన జీవితాన్ని విద్యాబోధనకే అంకితం చేసిన నారీశిరోమణి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు బాలనారాయణ, అధ్యాపకుడు బాబయ్య, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినుల పాత్ర కీలకమైంది..

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: యువతరం నేటి సమాజానికి ఉపయోగపడేలా ఉండాలంటే అందులో ఉపాధ్యాయినులదే కీలక బాధ్యత అని సింహాద్రిపురం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు అన్నారు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయినుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఆమె జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో ఉపాధ్యాయినులకు, గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో పాఠశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

జడ్పీటీసీ సభ్యురాలిని పరామర్శించిన ఎంపీ, మాజీ మంత్రి

లింగాల, పులివెందుల, న్యూస్‌టుడే: మూడు రోజుల కిందట ప్రమాదంలో గాయపడ్డ జడ్పీటీసీ సభ్యురాలు అలవలపాటి అనసూయమ్మను బుధవారం పులివెందులలోని ఆమె స్వగృహంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిలు పరామర్శించారు. గండికోట-పీబీఆర్ ఎత్తిపోతల పథకాల పరిశీలనలో భాగంగా ఆదివారం గండికోట జలాశయంలో నీటి మట్టాన్ని పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో గాయపడ్డారు. వైద్యులు నెల పాటు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. సమాచారం తెలుసుకున్న ఎంపీ, మాజీమంత్రి పరామర్శించి ప్రమాదం ఎలా జరిగిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'మైకు కట్‌చేయించడం అప్రజాస్వామికం'

వేముల, న్యూస్‌టుడే: ప్రజలు ఎన్నుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతుంటే సీఎం చంద్రబాబునాయుడు మైకు కట్‌చేయించడం అప్రజాస్వామికమని జడ్పీటీసీసభ్యుడు మరకా శివక్రిష్ణారెడ్డియాదవ్ విమర్శించారు. వేములలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ వాస్తవాలను మాట్లాడుతుంటే జీర్ణించుకోలేక అసహనంతో మైకును కట్‌చేయించడం సిగ్గుచేటన్నారు. ఎన్నో ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన వ్యక్తి ఓపిగ్గా సమస్యలను వినాల్సిందిపోయి రెచ్చిపోవడం దారుణమన్నారు. సీఎం వాస్తవాలను గ్రహించి సంయమనం పాటించాలని కోరారు.

స్టాళ్ల వద్ద సందడే సందడి

న్యూస్‌టుడే, పులివెందుల, పులివెందుల గ్రామీణ, వేంపల్లె - న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సభా ప్రాంగణంలో ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారుల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు పంపిణీ చేసేందుకు 90 సైకిళ్లను ఏర్పాటుచేశారు. రైతురథం, ఎస్సీ సహకారసంస్థ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ట్రాక్టర్లు, జేసీబీ, ఇతర వాహనాలను ఉంచారు. గ్రామీణ నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలు, సౌరశక్తితో నీటిని పంపింగ్‌చేసే విధానం, వర్షపునీటిని గొట్టాల ద్వారా భూమిలోకి ఇంకింపచేయడం, తదితర వాటిని ప్రదర్శించారు. అట్లూరు, పెద్దముడియం, మైదుకూరు కస్తూర్బాగాంధీ బాలికల విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు తయారుచేసిన గాజులు, పుష్పాలు, పలు అల్లికలను స్టాళ్లలో ఉంచారు. అలాగే అంకాళమ్మగూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.లత అనే క్రీడాకారిణి హ్యాండ్‌బాల్‌లో సాధించిన కప్పును ప్రదర్శించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఎర్రచందనంతో తయారుచేసిన ఆకృతులు, అటవీ అభివృద్ధి, చెక్‌డ్యామ్‌లు, వనసంపద పరిరక్షణ వాటి గురించి ఏర్పాటు చేశారు. డెయిరీ శాఖ వారు పాల కేంద్రాలలో పాల నాణ్యతను చూడగానే సంబంధిత రైతుకు చెల్లించాల్సిన మొత్తం అతని చరవాణికి సమాచారం చేరడంతో పాటు ప్రింట్ వచ్చే పరికరాలను ప్రదర్శించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జొన్న, నేపియర్ గడ్డి, ఏకవార్షిక గడ్డి, అజొల్లా తదితర గడ్డి రకాలను ప్రదర్శించారు. జిల్లా సమాచార కేంద్రం, ఏపీఫైబర్ శాఖల ఆధ్వర్యంలో కోర్ డ్యాష్‌బోర్డు, మీసేవ, బయోమెట్రిక్ హాజరు, ఏపీ ఫైబర్ గ్రిడ్, 1100 తదితరాల గురించి వివరించారు. సీఎం ప్రసంగాన్ని కూడా ఇక్కడే వీక్షించేలా ఏర్పాటుచేశారు. వెలుగు ఆధ్వర్యంలో ప్రతి మహిళ రూ.10 వేలు సంపాదించుకునే విధానాలను ప్రదర్శించారు. మహిళలు తయారు చేసిన తినుబండారాలు, రాగిబిస్కెట్లు, అగరబత్తులను ప్రదర్శించారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో కొండలమీద మొక్కల పెంపకం, చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్స్, చెత్తనుంచి సంపద తయారీ తదితర నమూనాలను ప్రదర్శించారు.

ఉప్పొంగిన ఉత్సాహం

పులివెందులలో బుధవారం ధ్యాన్‌చంద్ మైదానంలో జరిగిన ముఖ్యమంత్రి 'జన్మభూమి-మాఊరు' బహిరంగ సభ విజయవంతం కావడంతో తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం నెలకొంది. ప్రతిపక్షనేత సొంత నియోజకవర్గమైన పులివెందులలో ముఖ్యమంత్రి పర్యటనకు భారీఎత్తున జనాలను సమీకరించడంలో తెలుగు తమ్ముళ్లు సక్సెస్ అయ్యారు. పెద్దఎత్తున నేతలు సీఎం సభకు జనాలను తరలించారు. శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, రామగోపాల్ రెడ్డి తదితరుల నేతృత్వంలో గత వారం రోజులుగా వ్యూహరచన చేసి అనుకున్న మేరకు జనాలను సీఎం సభకు తరలించడంలో విజయవంతం అయ్యారు. ఇందుకు సంబంధించి ప్రతి మండలం నుంచి 50కి పైగా బస్సులు, జీపులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేసి జనాలను తరలించారు. వేంపల్లె నుంచి సతీష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి నేతృత్వంలో భారీగా ప్రజలను తీసుకొచ్చారు. వేముల నుంచి మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మయ్య, తూగుట్ల రాఘవరెడ్డి, హేమాద్రిరెడ్డి, పెర్నపాడు చిన్నఅంకిరెడ్డి, అన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, సింహాద్రిపురం నుంచి ఎమ్మెల్సీ బీటెక్ రవి, రామగోపాల్‌రెడ్డి, లింగాల నుంచి విశ్వనాథరెడ్డి, దొండ్లవాగు సంజీవరెడ్డి, తొండూరు నుంచి శివమోహన్‌రెడ్డి, పులివెందుల మండలం నుంచి సి.ఈశ్వర్‌రెడ్డి, పట్టణం నుంచి తూగుట్ల మధు, వెంకటరామిరెడ్డి, మహబూబ్ బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి, చక్రాయపేట నుంచి ఈశ్వర్‌రెడ్డి, కృష్ణ, తదితరుల ఆధ్వర్యంలో భారీగా సీఎం సభకు జనసమీకరణ చేశారు. సీఎం కూడా సభకు వచ్చిన జనాన్ని చూసి తనపై ఇంత అభిమానాన్ని చూపిన పులివెందుల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా వేంపల్లెకు చెందిన మండల తెదేపా ప్రధాన కార్యదర్శి బుసిరెడ్డి సాంబశివారెడ్డి ముఖ్యమంత్రికి నాగలిని బహూకరించారు.




వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జడ్పీటీసీ సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేంపల్లె సర్పంచి విష్ణు

పులివెందులలో మార్కెట్ ధరలు

(నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోట	5
ఉల్లిగడ్డలు	40
బంగాళదుంపలు	20
బెండకాయలు	30
వంకాయలు	20
క్యారెట్	60
ముల్లంగి	30
మిరపకాయలు	30
కాకర	40
చిక్కుడు	40
బీన్స్	30
మటిక్కాయలు	40
బీట్రూట్	40

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	420
స్కిన్‌లెస్ (చికెన్)	180
100 గుడ్లు	380
డజను	54
చేపలు	100

తెరపై ఈనాడు

సుజాత : హలో
శ్రీనివాస: 2 కంట్రీస్ ,
లక్ష్మి : ఒక్కక్షణం
మారుతీ :ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్)
వేంపల్లె :
వేంకటేశ్వర- ఎంసిఎ,
తిరుమల - 2 కంట్రీస్,
నూర్జహాన్ - హలో

పులివెందుల

ముఖ్యమంత్రి కార్యక్రమ సైడ్‌లైట్స్




హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న సతీష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి

- ముఖ్యమంత్రి పులివెందులలో హెలికాప్టర్ దిగగానే సతీష్‌రెడ్డి, ఆర్. శ్రీనివాసులురెడ్డి తదితరులు అక్కడికి వెళ్లి చంద్రబాబుకు స్వాగతం పలికారు.
- ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో ప్రజలు ఒక్కసారిగా వెనక్కు తిరిగి చూడడంతో ఆయన స్పందించి మాట్లాడుతూ వెనక ఏం జరగలేదు లెండి.. ఒకరు చూస్తే అందరూ వెనక్కు చూడడం ఈ ప్రాంత వాసులకు అలవాటుగా మారిందన్నారు.
- సభలో ఎంపీ అవినాష్‌రెడ్డి వైఎస్‌ను పొగడ్తలతో ముంచెత్తడాన్ని చూసి చంద్రబాబు ఏయ్.. తమ్ముడూ.. అంటూ చేయి పట్టుకుని ఎంపీ ప్రసంగం ఆపేందుకు ప్రయత్నించారు.
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రసంగాన్ని తిప్పికొట్టేవిధంగా మాట్లాడతానని, తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని సతీష్‌రెడ్డి ముఖ్యమంత్రిని కోరగా వద్దని వారించారు.
- సీఎం ఉద్వేగంగా ప్రసంగించిన ప్రతిసారి డ్వాక్రా మహిళలు థ్యాంక్యూ సీఎం సార్.. అన్న ప్లకార్డులను ప్రదర్శించారు.
- సీఎం సభలో మాట్లాడేటప్పుడు 2012 శనగ బీమా రాలేదని రైతులు అడగ్గా మరోలా అర్థం చేసుకున్న సీఎం జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలా. . ఇచ్చేస్తాం. అని ప్రకటించారు.
- పలువురు మహిళలు, రైతులు సమస్యలపై గట్టిగా అడుగుతోంటే ఏదైనా సమస్య ఉంటే గట్టిగా అరిచి ప్రయోజనం లేదు. పక్కకు వచ్చి వినతిపత్రాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు.
- సీఎం పర్యటన షెడ్యూల్ ప్రకారం లింగాల పర్యటన తరువాత అరగంట సేపు రిజర్వుగా ప్రకటించారు. అయితే అమరావతి నుంచి ముఖ్యమంత్రి లింగాలకు ఆలస్యంగా రావడంతో పులివెందులకు చేరుకోగానే సభాస్థలి పైకి ఎక్కి ప్రసంగించారు.
- సభా ప్రాంగణంలో పలు శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. అయితే ముఖ్యమంత్రి కేవలం అంగన్‌వాడీ మహిళల వద్దకు వెళ్లి చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు. అంతకు ముందు బంగారు తల్లులూ బాగున్నారా అంటూ వారిని ఆప్యాయంగా పలకరించారు.
- మధ్యాహ్నం 2.07గంటలకు పులివెందులకు వచ్చిన సీఎం సభ ముగిసిన తరువాత సాయంత్రం 4.40 గంటలకు హెలికాప్టర్‌లో కడపకు బయలుదేరి వెళ్లారు.

న్యూస్‌టుడే, పులివెందుల, పులివెందుల గ్రామీణ, వేంపల్లె



థ్యాంక్యూ.. సీఎం సార్.. డ్వాక్రా మహిళల ప్లకార్డుల ప్రదర్శన



సభాస్థలిపై చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటెక్ రవి. వేదికపై పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

ఇక బంగారు పంటలే పండిస్తారు..!

ముఖ్యమంత్రి చంద్రబాబు



ముఖ్యమంత్రితో కరచాలనం చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి



పులివెందులలో జరిగిన ర్యాలీలో నాగలిని భుజంపై పెట్టుకుని వస్తున్న వేంపల్లె సర్పంచి విష్ణు

లింగాల, సింహాద్రిపురం, న్యూస్‌టుడే: కడప తలసరి ఆదాయం రూ.92 వేలని, లింగాల తలసరి ఆదాయం రూ.3.90 లక్షలని, రాష్ట్రంలో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రాంతం లింగాల మాత్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం పార్నపల్లె వద్ద రూ.1350 కోట్ల వ్యయంతో చేపట్టిన గండికోట-పీబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేసిన అనంతరం సాగునీటి సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెలికాప్టర్ ద్వారా తాను ఇక్కడి అరటి, చీనీ తోటలను పరిశీలించానని, రైతులు పంటకుంటలు, ఫారంపాండ్స్ తవ్వుకున్నారంటూ వారిని మనస్ఫూర్తిగా అభినందించారు. చిత్రావతిలో చరిత్రలో ఇన్ని నీళ్లు చూశారా..? ఇది మొదటిసారి కాదా అని రైతులను సీఎం ప్రశ్నించారు. ప్రస్తుతం 4 టీఎంసీలకు పైగా నిల్వచేశామన్నారు. చిత్రావతి కింద ఒక్క ఎకరా కూడా ఎండకుండా సాగునీటిని విడుదలచేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాలో రూ.1285 కోట్ల మేర రుణాల మాఫీ చేసినట్టు పేర్కొన్నారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మట్లాడుతూ రెండేళ్ల క్రితం ఈ ప్రాంత రైతులు పండ్లతోటలు ఎండిపోతున్నాయని, సాగునీరు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారని చెప్పారు. అప్పట్లో సీఎం మాట్లాడుతూ కుప్పం కంటే ముందుగా పులివెందులకు నీరిచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఆయన హామీ మేరకు పులివెందుల ప్రాంతానికి కృష్ణాజలాలను తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు. మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ సీమవాసులకు పట్టిసీమ ఓ వరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో జిల్లా హార్టీకల్చర్ హబ్‌గా మారుతుందన్నారు. శాసన మండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షనేత వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర తలపెట్టే ముందు తనను గెలిపించిన పులివెందుల నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారు? ఎలాంటి త్యాగం చేశారో చెప్పాలన్నారు. పాదయాత్రలో రైతులకు రుణమాఫీ కాలేదని అంటున్నారని, అయితే పులివెందుల నియోజకవర్గంలోని 65 వేల మంది రైతులకుగాను రూ.300 కోట్ల మేర రుణమాఫీ అయిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అనంతరం సీఎం పైలాన్‌ను ఆవిష్కరించారు. భూగర్భ ఆనకట్టల పనుల శిలాఫలాకాన్ని కూడా ఆవిష్కరించారు. జలవనరుల శాఖ కార్యదర్శి అశిభూషణ్, ఈఎన్‌సీ వేంకటేశ్వరరావు, కలెక్టరు బాబూరావునాయుడు, జిల్లా తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, బీటెక్ రవి, ధర్మవరం ఎమ్మెల్యే వరదాపురం సూరి, శింగనమల ఎమ్మెల్యే యామిని బాల పాల్గొన్నారు.

పులివెందులపై సీఎం వరాల జల్లు

న్యూస్‌టుడే, పులివెందుల, పులివెందుల గ్రామీణ, వేంపల్లె : పులివెందులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరాల జల్లు కురిపించారు. బుధవారం ఇక్కడ జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి హాజరైన ఆయన నేతల విజ్ఞప్తి మేరకు పలు అభివృద్ధి పనులకు రూ.27.78 కోట్లు మంజూరు చేస్తూ సభలోనే ప్రకటించారు. పులివెందుల పురపాలికలో 28.12 కి.మీ.ల మేర సిమెంటు రోడ్లు వేసేందుకు రూ.18.18 కోట్లు, వీధుల్లో వర్షపునీరు వెళ్లేందుకు 33 కి.మీ.ల మేర కాలువ నిర్మాణానికి రూ.6.25 కోట్లు, 6.40 కి.మీ.ల పొడవున భూగర్భ డ్రైనేజి నిర్మాణాలు చేపట్టేందుకు రూ.3.35 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని చంద్రబాబు వెల్లడించారు. అలాగే జిల్లాలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో రూ.47 కోట్లు వడ్డీలేని రుణాలు, స్త్రీనిధి కింద రూ.62 కోట్లు, చంద్రన్న బీమా కింద రూ.16.78 కోట్లు మంజూరు చేశామని ఆయన తెలిపారు. అలాగే బీసీ కార్పొరేషన్ కింద రూ.72.37 కోట్లు, మైనార్టీ కార్పొరేషన్ కింద రూ.3.32 కోట్లు, ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.82 కోట్లు విడుదల చేసినట్లు ఆయన చెప్పారు.

పులివెందులలో తెలుగు తమ్ముళ్ల భారీ ర్యాలీ

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బుధవారం పులివెందులలో తెలుగు తమ్ముళ్లు కనీవినీ ఎరుగని రీతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు సర్కిల్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీ సందర్భంగా అచ్చువెళ్లి కళాకారులు నిర్వహించిన కవాయి కర్రల ప్రదర్శన ఆకట్టుకుంది. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, వేంపల్లె సర్పంచి విష్ణు, పులివెందుల పట్టణ తెదేపా అధ్యక్షుడు మహబూబ్‌బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ హేమాద్రిరెడ్డిల ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు చేశారు. బాణసంచా పేల్చారు. ర్యాలీలో జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ ఛైర్మన్లు బాలస్వామిరెడ్డి, మునిరెడ్డి, వేంపల్లె, చక్రాయపేట మండలాల తెదేపా అధ్యక్షుడు షబ్బీర్, ఈశ్వర్‌రెడ్డి, జిల్లా తెదేపా మాజీ కార్యదర్శులు తిప్పారెడ్డి, మోహన్‌రెడ్డి, సర్పంచులు భారతి భాస్కర్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, పసుపులేటి బాబు, కులశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేంపల్లె సర్పంచి విష్ణువర్ధన్‌రెడ్డిని పులివెందులకు చెందిన సీహెచ్ శ్రీనివాసులు గజమాలతో సత్కరించారు.

సీఎం సమక్షంలో ఎంపీని అవమానిస్తారా..

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : పులివెందులలో బుధవారం జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామసభలో ముఖ్యమంత్రి సమక్షంలోనే కడప లోక్‌సభ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డిని మాట్లాడనీయకుండా అవమానించడం చాలా అన్యాయమని జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. తెదేపా ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థ అపహాస్యం పాలవుతోందని విమర్శించారు. బుధవారం ఆయన ఒంటిమిట్టలో మాట్లాడుతూ కరవు ప్రాంతానికి కృష్ణా జలాలు తరలించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ గండికోట- సీబీఆర్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ విషయం అందరికీ తెలుసునని పేర్కొన్నారు. వైఎస్ చేసిన అభివృద్ధిపై ఎంపీ అవినాష్ మాట్లాడుతుంటే వేదికపైన ఉన్న ఓ వ్యక్తి బలవంతంగా మైకు లాక్కోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజాస్వామంలో మాట్లాడే స్వేచ్ఛ పార్లమెంటు సభ్యుడికి లేదా అని నిలదీశారు. ప్రజా మద్దతుతో ఎన్నికైన ప్రజా ప్రతిధులకు కనీస మర్యాద కూడా ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరిగినా పట్టించుకునే దిక్కులేదన్నారు. అధికారిక జన్మభూమి కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ సమావేశంలా నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎంపీకి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు.

ప్రతి కుటుంబంలో ఆనందం

రాజంపేట, న్యూస్‌టుడే : ప్రతి కుటుంబంలో ఆనందం కనిపించాలని, సంక్రాంతి పండుగను సంబరంగా జరుపుకోవాలని మాజీ కౌన్సిలర్ సుబ్బరామిరెడ్డి, మన్నూరు నీటి సంఘం అధ్యక్షుడు ఇడిమడకల కుమార్ ఆకాంక్షించారు. స్థానిక మన్నూరు చౌకదుకాణంలో బుధవారం చంద్రన్న సంక్రాంతి కానుకలను వారు లబ్ధిదారులకు అందజేశారు.

సృజనకు చేయూత.. ఉజ్వల భవిత!



బుట్టల అల్లిక పనిలో విద్యార్థుల నిమగ్నం

చిరుప్రాయం.. చిట్టి బుర్రలు.. లేత వయస్సులో ఆలోచనశైలి విభిన్నం. తరగతి గదిలో పాఠాలకే పరిమితం కాకుండా తమలో దాగిన ప్రతిభకు పదును పెడుతున్నారు. సృజనకు తోడు కళాత్మకతను జోడిస్తున్నారు. చదువుతో పాటు నైపుణ్యాన్ని చాటుతున్నారు. అల్లికలతో ఆకట్టుకుంటున్నారు. చూసే నేత్రాలను కనువిందు చేసే చిత్రలేఖనం.. ఎన్నో కళలు.. మరెన్నో అందాలు. వ్యర్థాలతో కళ్లు చెదిరే బొమ్మలను తీర్చిదిద్దుతూ సృజనను పెంపొందించుకుంటూ ముందుకెళుతున్నారు. విద్యతోపాటు స్వయం ఉపాధి శిక్షణ పొందుతూ ఉజ్వల భవితకు బాటలు వేసుకుంటున్నారు.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.



కుండలకు రంగులు వేస్తున్న పిల్లలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు కుట్లు, అల్లికలతో పాటు చిత్రలేఖనంలో రాణిస్తూ స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. ఈ పాఠశాలలో 408 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 6, 7, 8 తరగతుల్లోనే 220 మందికి పైగా చదువుతున్నారు. వీరిలోని ప్రతిభను వెలికితీసేలా సృజన జోడించి ఉపాధ్యాయురాలు సి.వెంకటరంగమ్మ తర్ఫీదు ఇస్తున్నారు. గృహోపకరణాలు, బుట్టలు, కుండీలు, అల్లికలు, కుండల అలంకరణను నేర్పుతున్నారు. ఎందుకూ పనికిరాని థర్మాకోల్‌తో ఇల్లు, గుడి, పెళ్లి పత్రికలతో తలుపులకు శోభనిచ్చే తోరణాలు, ఆకర్షణగా నిలిచే బొమ్మలను తీర్చిదిద్దుతున్నారు. పిల్లలు చేతివేళ్ల నైపుణ్యంతో అబ్బురపరిచేలా ప్రత్యేకత చూపుతున్నారు. ప్రతి వస్తువులోనూ కొత్త కళ ఉట్టిపడుతోంది. కుట్టు పనిలోనూ బాలికలకు శిక్షణ ఇస్తున్నారు. పట్టుదారంతో గాజులు, కమ్మలను అందంగా తీర్చిదిద్దుతున్నారు.

మదిని దోచే కళాభిరుచి: చిన్నారుల్లో మదిని అబ్బురపరిచే కళాభిరుచి చూస్తే ఔరా అనాల్సిందే. తమలో ఇమిడి ఉన్న భావాలను చిత్రలేఖనం రూపంలో చక్కగా ఆవిష్కరిస్తున్నారు. సూక్ష్మ దృష్టి, ఏకాగ్రతతో అద్భుతమైన ప్రతిభతో రాణిస్తున్నారు. దేవుళ్ల బొమ్మలు, జంతువులు, ప్రకృతి, పర్యావరణం, చుట్టూ ఎదురయ్యే అనుభవాలపై విభిన్న ఆకృతుల్లో అందంగా ఆవిష్కరిస్తున్నారు.

చేతివృత్తులపై విద్యార్థులకు శిక్షణ

కుట్లు, అల్లికలు, చిత్రకళల్లో చిన్నారులు భళా

ఒంటిమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల విభిన్నం



కుట్టు పనిలో విద్యార్థినులు



గాజులు, కమ్మలు

ప్రభుత్వం సామగ్రిని అందివ్వాలి



తరగతి గదిలో శ్రద్ధగా పాఠాలు వింటా. నాకు పూల దండల అల్లికలంటే ఇష్టం. పువ్వులతో తీరిక సమయంలో సాధన చేయడంతో క్రమేణా ఈ కళ బాగా అబ్బింది. కుండలు కూడా తయారు చేస్తాను. విద్యా బోధనకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. అలాగే చేతి వృత్తి పనుల్లో ఉపయోగించే సామగ్రిని కూడా ప్రభుత్వం ఉచితంగా ఇచ్చి మంచి శిక్షణ ఇప్పిస్తే మరింతగా రాణించేందుకు దోహదపడుతుంది.

- డి.సంధ్య, ఎనిమిదో తరగతి విద్యార్థిని, జడ్పీ ఉన్నత పాఠశాల, ఒంటిమిట్ట

అందమైన ఇళ్లకు రూపం



ఒకనాడు పూరి గుడిసెలు, బోద కొట్టాలు, చిన్న పాకల్లో ప్రజలు నివాసం ఉండేవారు. కాలక్రమేణా మనిషి జీవనశైలిలో మార్పు వచ్చింది. ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. ప్రతిఒక్కరిలో అందమైన ఇల్లు నిర్మించుకోవాలనే స్వప్నం ఉంటుంది. ఈ నేపథ్యంలో పాత, కొత్తతరంలో ఇళ్ల నిర్మాణ శైలిపై దృష్టి సారించా. అందమైన భవంతులు ఎలా నిర్మించుకోవాలని ఆకృతులు రూపొందిస్తున్నా. **- ఎస్.భర్కతుల్లా, విద్యార్థి, జడ్పీ ఉన్నత పాఠశాల, ఒంటిమిట్ట**

కుట్టు పని నేర్చుకున్నా



విద్యతో పాటు మనకంటూ ప్రత్యేకత చాటాలంటే చేతిలో ఏదో ఒక పని ఉండాలి. ఇదే లక్ష్యంతో నేను కుట్టు పని నేర్చుకున్నా. మా బడిలో కుట్టుయంత్రం ఉంది. కొన్ని రోజులపాటు బాగా కష్టపడ్డా. సొంతంగా వస్త్రాలు కుట్టే స్థాయికి చేరుకోవాలని నా ఆశయం. ఆ దిశగా అడుగులు వేయడంతో నాలో విశ్వాసం పెరిగింది. మరి కొన్ని యంత్రాలు సరఫరా చేస్తే మరికొందరు నేర్చుకునేందుకు వీలవుతుంది. **- యు.శిరీష, ఎనిమిదో తరగతి విద్యార్థిని, జడ్పీ ఉన్నత పాఠశాల, ఒంటిమిట్ట**

విద్యార్థుల్లో ప్రతిభకు పదును



విద్యార్థుల్లో దాగిన ప్రతిభకు పదును పెడుతున్నాం. పిల్లల ఆసక్తిని గమనించాం. వారికి ఇష్టమైన కళాభిరుచిని గుర్తించాం. అల్లికలు, కుట్లు, చిత్రలేఖనంపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. చిన్నారుల్లో కూడా నేర్చుకోవాలనే ఉత్సాహం కన్పిస్తోంది. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం కలిపి మూడు గంటల పాటు శిక్షణ ఇస్తున్నాం. వివిధ వస్తువుల తయారీ కోసం అవసరమైన సామగ్రి సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. **- సి.వెంకట రంగమ్మ, శిక్షణ ఉపాధ్యాయురాలు, జడ్పీ ఉన్నత పాఠశాల, ఒంటిమిట్ట**


విద్యుత్తు కార్మికులకు న్యాయం చేయాలి



వినూత్న రీతిలో ఉరి వేసుకున్నట్లు నిరసన తెలుపుతన్న విద్యుత్తు ఒప్పంద కార్మికులు

రాజంపేట, న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థలో ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్తు డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం విద్యుత్తు ఒప్పంద కార్మికులు ఉరి వేసుకున్నట్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయకపోతే వారికి ఉరి తప్ప మరో మార్గం లేదన్నారు. కార్మికులను పర్మినెంట్ చేసి వారికి నేరుగా వేతనాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినా సమస్య పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. బిల్లు కలెక్టర్లు, మీటరు రీడర్లకు కూడా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మిక కుటుంబాలకు పరిహారం కింద రూ.10 లక్షలు ఇవ్వాలని, ఆ ఇంటిలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూఈఈయూ డివిజన్ కార్యదర్శి ఇ.శ్రీహరి, యూఈసీడబ్ల్యూయూ డివిజన్ అధ్యక్షుడు డి.సుధాకర్, కార్యదర్శి బి.బాలకృష్ణ, ఆ సంఘం నాయకులు జి.చంద్రారెడ్డి, ఎం.రాజా, కె.అమర్‌నాథ్‌రాజు, జగదీశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ॥)
టమోటాలు	10
పచ్చిమిర్చి	20
వంకాయలు	20
బీట్రూట్	30
ఉర్లగడ్డ	20
క్యారెట్	60
బీన్స్	40
చిక్కుడు	40
క్యాబేజీ	30
ఎర్రగడ్డలు	40-50
అల్లం	60
బెండకాయలు	32
మటిక్కాయలు	30
కాకర	30
బీరకాయలు	32

మాంసం ధరలు



	కిలో (రూ)
పొట్టేలు మాంసం	420-480
చికెన్	
బాయిలర్(లైవ్)	100
బాయిలర్ స్కిన్	160
బాయిలర్ స్కిన్‌లెస్	180
నాటుకోడి లైవ్	300
నాటుకోడి స్కిన్	350-380

తెరపై ఈనాడు

సుదర్శన్ : హలో, **ఎన్‌ఎస్ఆర్ :** ఎంసీఏ **పీవై :** 2కంట్రీస్, **బీఎస్ :** ఒక్క క్షణం, **సమద్ :** పైసా వసూల్ **నందలూరులో : విజయ్‌భాస్కర్ :** అదిరింది

మహిళలకు స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే

సరస్వతీపురం (రాజంపేట), న్యూస్‌టుడే : మహిళలకు స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయిపూలే అని కథానిలయం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్ని బుధవారం రాజంపేటలో ఘనంగా నిర్వహించారు. రాజంపేట పట్టణం సరస్వతీపురంలోని ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయిపూలేకి నివాళులు అర్పించారు. నాడు మహిళలు బయటకు రాలేని పరిస్థితుల్లోనే స్త్రీలకు విద్య, సమాజిక సేవ వంటి కార్యక్రమాలను ఆమె చేపట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా ఛైర్మన్ షేక్ అబ్దుల్లా, ఉపాధ్యాయులు రామలక్షుమ్మ, రామ్మోహన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

◆ రాజంపేట మండలం మందపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎ.వి.భాస్కర్‌రాజు, విశ్రాంత డీవైఈవో కృష్ణకుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.చెంగల్‌రాజు, పి.వెంకటసుబ్బయ్య, ప్రతాప్ దేవవర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ స్థానిక నూనెవారిపల్లె మార్గంలోని రీజెన్సీ నలందా పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సీఏవో ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపల్ సుధీర్‌బాబు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రీన్‌కోర్ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, గ్రీన్‌కోర్ కమిటీ జిల్లా కన్వీనర్ చక్రధర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ స్థానిక ఎన్జీవో కార్యాలయ ఆవరణంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో సాయివిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కవలకుంట్ల పాపయ్య, నదకిశోర్, ఎన్.రాజయ్య, కృష్ణయ్య, స్వతంత్రబాబు, రాజానాయక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీపురం పాఠశాలలో సాయిత్రిబాయిపూలేకి నివాళి అర్పిస్తున్న రాష్ట్ర కథానిలయం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్



మందపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల నివాళి

సుండుపల్లి: మహిళల విద్యకు, ఆత్మగౌరవానికి చేసిన కృషి కారణంగా సావిత్రిబాయి పూలే నారీలోకానిక వెలుగుగా నిలిచారని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ ఆర్గనైజర్ పల్లం నాగేంద్ర పేర్కొన్నారు. సుండుపల్లి బస్సుషెల్టరు సమీపంలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. సమావేశంలో భాజపా నాయకుడు మంగిర రమణయ్య, డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరనాగయ్య తదితరులు ప్రసంగించారు. బీసీ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు రమేష్‌ఆచారి, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు యల్లయ్య, మిన్నంరెడ్డి కృష్ణారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి, గ్రంథాలయాధికారి చాన్‌బాష, వీరభద్ర డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట

సంక్షేమ ఫలాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న పురపాలిక కమిషనర్ రమణారెడ్డి

రాజంపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని పురపాలిక కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి ప్రజలకు సూచించారు. జన్మభూమి- మాఊరులో భాగంగా బుధవారం ఆరోగ్యం- ఆనందం అనే అంశంపై స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. పురపాలికలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తేవాలని చెప్పారు. ప్రభుత్వ వైద్యాధికారి ఎస్.శేఖర్ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యం కోసం ప్రతి నెలా 9న ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నామని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తున్నామని చెప్పారు. ఎంఈవో చెంగల్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ ఏఎస్‌డబ్ల్యూవో రామయ్య, విద్యుత్తుశాఖ ఏఈ శివశంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి తమ శాఖల పనితీరును వివరించారు. ఈ సందర్భంగా పిల్లలకు కుర్చీలాటను నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యం- ఆనందం అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. చంద్రన్న కానుకలను, కొత్త బియ్యం పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చమర్తి సురేష్‌రాజు, ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ వడ్డె రమణ, పురపాలిక డీఈ శ్రీనివాసులు, మేనేజర్ కనకరాజు, పట్టణ ప్రణాళిక అధికారి బాలాజి, ఆర్ఐ హరినాథ్, తెదేపా పట్టణాధ్యక్షుడు టి.సంజీవరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సి.సుధాకర్, నాయకులు మల్లెల సుబ్బరాయుడు, షేక్ అబ్దుల్లా, డి.వి.రమణ, శ్రీరాములు, ఖాజామోహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి

వీరబల్లి : సమస్యల పరిష్కారానికే జన్మభూమి- మాఊరు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ స్వప్న పేర్కొన్నారు. పుత్తావాండ్లపల్లిలో బుధవారం అధికారులు జన్మభూమి- మాఊరు గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారం కోసం సీఎం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ప్రత్యేకాధికారి మురళీధర్‌రెడ్డి, ఎంపీడీవో జనార్ధనరావు, తహసీల్దార్ ఎం.వి.నారాయణరెడ్డి, ఆయా శాఖల అధికారులు, జిల్లా తెదేపా కార్యదర్శి ఎస్.కుళాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీరబల్లి : జన్మభూమి గ్రామసభలో మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

గ్రామాల వికాసానికే గ్రామసభలు

ముడుంపాడు (సుండుపల్లి), న్యూస్‌టుడే : ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం అయ్యేలా చూసి గ్రామాలు అభివృద్ధి చెందేలా చూడటమే జన్మభూమి- మాఊరు ప్రధాన ధ్యేయమని మండల నోడల్ అధికారి రంగయ్య పేర్కొన్నారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం ముడుంపాడులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. శాఖల వారీగా ప్రభుత్వ కార్యక్రమాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఎక్కువమంది పింఛన్లు, రేషన్ పత్రాల కోసం విన్నవించారు. గిరిజనాభివృద్ధి సంస్థ జిల్లా కన్వీనరు అమ్మూనాయక్ పింఛన్లు, సిమెంటు రోడ్లు కావాలని అధికారులను కోరారు. పించ నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు డి.సుధాకరరెడ్డి మాట్లాడారు. వైద్యాధికారులు కె.నరేష్‌కుమార్, నాగమల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైద్య, పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సుధాకరరెడ్డి, పంచాయతీ జన్మభూమి బృంద నాయకురాలు నాగరాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సుండుపల్లి : ముడుంపాడులో చంద్రన్న సంక్రాంతి కానుక అందిస్తున్న అధికారులు

పొలిమరపల్లి (సుండుపల్లి) : జన్మభూమి గ్రామ సభల ద్వారా ప్రభుత్వ పథకాలు వివరించి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యమని తహసీల్దారు ఎం.వి.సుబ్రహ్మణ్యంరెడ్డి పేర్కొన్నారు. పొలిమేరపల్లి గ్రామం బి.జి.రాచపల్లిలో బుధవారం జన్మభూమి- మాఊరు గ్రామసభ జరిగింది. కొత్త రేషన్ పత్రాలు, ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సర్పంచి వెంకటసుబ్బమ్మ, జన్మభూమి గ్రామ కమిటీ నాయకురాలు తులశమ్మ, వివిధ శాఖల అధికారులు రామచంద్రారెడ్డి, ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అభివృద్ధి సాధ్యం

సిద్దవటం, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల పట్ల ప్రజలు అవగాహన పెంచుకుని.. సద్వినియోగం చేసుకోవడం ద్వారా అభివద్ధి సాధించాలని రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మం కోరారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె, టక్కోలు గ్రామాల్లో బుధవారం నోడల్ అధికారి వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో జన్మభూమి- మాఊరు గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో జయసింహ, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి ఆయా గ్రామాల్లో వేర్వేరుగా గ్రామసభలు ఏర్పాటు చేశారు. సభల్లో అధికారులు సీఎం సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన రాజంపేట ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్యం అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం నోడల్ అధికారి వెంకటసుబ్బారావు, వ్యవసాయ, విద్య, వైద్యశాఖలు, ఐకేపీ, ఉపాధి, విద్యుత్, మరికొన్నిశాఖల అధికారులు వారి అభివృద్ధి పనులను, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను ఆర్డీవో, ఎంపీటీసీ సభ్యుడు నాగమునిరెడ్డి పంపిణీ చేశారు. పొన్నవోలు పీహెచ్‌సీ, సిద్దవటంలోని ఆయుర్వేద ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. మాచుపల్లె, టక్కోలు గ్రామసభల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

ఇంటింటా ఆరోగ్యం వికసించాలి



గంగపేరూరు గ్రామసభలో మాట్లాడుతున్న కృష్ణయ్య

గంగపేరూరు (ఒంటిమిట్ట) : ఇంటింటా ఆరోగ్యం వికసించాలి. ప్రతి కుటుంబం ఆర్థిక ప్రగతి సాధించాలనే సదాశయంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఒంటిమిట్ట మండల ప్రత్యేకాధికారి ఎం.సి.కృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి గంగపేరూరులో సర్పంచి కట్టా నారాయణ అధ్యక్షతన 'జన్మభూమి-మా ఊరు' గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటే అందరూ ఆనందకర జీవనం సాగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు జె.శిరీష, ఎంపీడీవో ఎ.వెంకటప్రసాద్, వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఈలు విద్య, వెంకటేశ్వరరావు, గురివిరెడ్డి, సుదర్శన్, ఏపీవో పార్థసారథి, ఏపీఎం వెంకటేశు, నాయకులు బి.లక్ష్మీనరసయ్య, ఎన్.సుధాకర్‌రాజు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నూకినేనిపల్లె (నందలూరు) : పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ మేడా పద్మజ పేర్కొన్నారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని నూకినేనిపల్లె, కుందానెల్లూరు గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సీఎం పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు మేడా విజయభాస్కరరెడ్డి, సర్పంచి శ్రీనివాసులు, ఎంపీడీవో మల్లీశ్వరి, నోడల్ అధికారి శ్రీనివాసులు, తహసీల్దారు చంద్రశేఖర్, మండల తెదేపా అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య తదితరులు మాట్లాడారు. ఎంపీటీసి సభ్యుడు గణపతి నాగరాజు, తెదేపా నాయకులు ఎం.చంద్ర తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు. పశువైద్యాధికారి దుర్గారావు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. హోమియోపతి, అల్లోపతి వైద్యులు వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

రహదారి ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు

రాజంపేట నేరవార్తలు, న్యూస్‌టుడే : పట్టణ శివార్లలోని మునక్కాయపల్లె క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో విద్యార్థిని మాధవి తీవ్రంగా గాయపడింది. మండలంలోని మిట్టపల్లెకు చెందిన మాధవి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఉదయం కళాశాలకు వెళ్లడానికి ద్విచక్రవాహనంపై వస్తూ క్రాస్‌రోడ్డు నుంచి ప్రధాన రహదారి వద్ద మలుపు తిరుగుతుండగా పుల్లంపేట మండలం కొండ్లోపల్లెకు చెందిన వెంకటేష్.. రాజంపేట నుంచి బోయనపల్లెకు ద్విచక్రవాహనంపై వెళుతూ ఢీకొట్టాడు. దీంతో వాహనంపై నుంచి కిందపడిన మాధవి తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రురాలిని రాజంపేట ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తీసుకెళ్లారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చిన్నకొత్తపల్లి (ఒంటిమిట్ట), న్యూస్‌టుడే : మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ (30) బుధవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలకృష్ణను గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సమస్యలా, అనారోగ్య ఇబ్బందులు, అప్పుల బాధలు ఉన్నాయా అనేది తెలియరాలేదు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఒంటిమిట్ట పోలీసులు తెలిపారు.

పాము కాటుకు బాలిక మృతి



యువలత (పాతచిత్రం)

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని టక్కోలు గ్రామంలో పాము కాటుకు మద్దబోయిన యువలత (12) మృత్యువాత పడింది. తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు. . సిద్దవటం మండలం టక్కోలు గ్రామానికి చెందిన యువలత స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదివేది. నాలుగేళ్ల కిందట తల్లి మృతిచెందారు. డిసెంబరు 26వ తేదీ రాత్రి యువలత ఇంటి ఆవరణలో ఉండగా పాము కాటేసిందని కుటుంబ సభ్యులు చెప్పారు. వెంటనే కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యుల సలహా మేరకు కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించామన్నారు. అదేరోజు రాత్రి తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించామని తెలిపారు. అక్కడే వారం రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం ఆరోగ్య పరిస్థితి విషమించి ఆసుపత్రిలో మృతిచెందిదని తండ్రి సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంఈవో హేమలత, ఉన్నత పాఠశాల హెచ్ఎం సంచ్చీజీజీవరెడ్డి, సీఆర్పీ మునీంద్రమ్మ వెళ్లి నివాళి అర్పించారు.

ఎస్సీ వర్గీకరణను కోరుతూ ఉపవాస దీక్షలు

రాజంపేట, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక పాత బస్టాండు కూడలిలో ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఉపవాస దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ చీఫ్‌జిల్లా ఇన్‌ఛార్జి వెలగచర్ల శివయ్యమాదిగ మాట్లాడుతూ గడిచిన 24 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్ని ఉద్యమాలు చేపట్టిన ఫలితం లేకపోయిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనైనా బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దీనికోసం రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు అఖిలపక్ష కమిటీని దిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. ప్రస్తుతం వర్గీకరణ సాధన కోసం మందకృష్ణమాదిగ తలపెట్టిన ఉపవాస దీక్షలకు మద్దతుగా ఈనెల 5 వరకు ఈ దీక్షలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చీఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి చేమూరి వెంకటేష్, సంఘం నాయకులు పి.సుబ్బయ్య, మురళి, జడ మధు, కత్తి కొండయ్య, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి

పోలీసు సేవల కొరకు 100

ఎస్సీ వర్గీకరణను కోరుతూ ఉపవాస దీక్షలు

రాజంపేట, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక పాతబస్టాండు కూడలిలో ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఉపవాస దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ చీ్ఫ్-జిజిల్లా ఇన్‌ఛార్జి వెలగచర్ల శివయ్యమాదిగ మాట్లాడుతూ గడిచిన 24 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్ని ఉద్యమాలు చేపట్టిన ఫలితం లేకపోయిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనైనా బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దీనికోసం రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు అఖిలపక్ష కమిటీని దిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. ప్రస్తుతం వర్గీకరణ సాధన కోసం మందకృష్ణమాదిగ తలపెట్టిన ఉపవాస దీక్షలకు మద్దతుగా ఈనెల 5 వరకు ఈ దీక్షలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చీ్ఫ్-జిజిల్లా ప్రధాన కార్యదర్శి చేమూరి వెంకటేష్, సంఘం నాయకులు పి.సుబ్బయ్య, మురళి, జడ మధు, కత్తి కొండయ్య, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి ఇంటర్వ్యూలు

కడప ఏడురోడ్లు: వినూత్న ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌లో మండలాల వారీగా పని చేసేందుకు సేల్స్ రెప్రజెంటేటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు కొత్త కలెక్టరేట్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. 19 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి పదో తరగతి పాస్/ఫెయిల్/ఏదేని డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు.

చంద్రన్న కానుకలతో సంతోషమే



రామాపురం: పాలన్నగారిపల్లిలో సరుకులు పంపిణీ చేస్తున్న యర్రబోలు శేఖర్

చిట్లూరు(రామాపురం), న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న చంద్రన్న కానుకలతో పేద కుటుంబాల్లో సంతోషం ఏర్పడిందని తెదేపా మండలశాఖ అధ్యక్షుడు యర్రబోలు శేఖర్ పేర్కొన్నారు. మండల పరిధి చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లిలో బుధవారం చంద్రన్న కానుకలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం పేదలను దృష్టిలో పెట్టుకుని కానుకలు అందిస్తుందన్నారు. గ్రామస్థుల సమస్యల పరిష్కరించేందుకు అధికారులు సత్వర చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.న్నారు. పింఛన్లు, రేషనుకార్డులు, ఇంటిస్థలాలకు దరఖాస్తులు చేసుకోవాలని శేఖర్ కోరారు. కార్యక్రమంలో సర్పంచి రమణమ్మ, మండల ప్రధాన కార్యదర్శి రంగారావు, భాస్కర్, వెంకటరమణ పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కార్మికుల నిరసన



విద్యుత్తు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

రాయచోటి: పనికి తగిన సమాన వేతనాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం విద్యుత్తు ఒప్పంద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్తు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు దశల వారీగా క్రమబద్ధీకరించాలని డిమాండు చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తూ ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. పీస్ రేట్ విధానాన్ని రద్దు చేసి సర్వీసు ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. డిమాండ్లపై భోజన విరామ సమయంలో శాంతి యుతంగా నిరసన కార్యక్రమం చేపట్టామని కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యంరాజు పేర్కొన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో ఈనెల 27 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లతామన్నారు. యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రెడ్డినాగభూషణం, ఎస్.బ్రహ్మేంద్రారెడ్డి, రవి, వీరు, రెడ్డెప్ప, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మినుములో యాజమాన్య పద్ధతులు అవసరం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మినుము పంటలో సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఊటుకూరు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రంజిత, తేజు సూచించారు. బుధవారం గొర్లపల్లె, పెండ్లిమర్రి మండలంలోని కొత్తగిరియపల్లె గ్రామాల్లో మినుము పంటను పరిశీలించారు. చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు వివరించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే జన్మభూమి-మాఊరు



సంబేపల్లె:జన్మభూమి గ్రామసభలో అధికారులను, ప్రజాప్రతి నిధులను నిలదీస్తున్న గ్రామస్థులు



రాయచోటి గ్రామీణ: రేషన్‌కార్డును పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె, న్యూస్‌టుడే: మోటకట్ల పంచాయతీలో జానంవాండ్లపల్లె ఉందా లేదా అని గ్రామస్థులు జన్మభూమి-మా ఊరు గ్రామసభకు విచ్చేసిన అధికారులను నిలదీశారు. బుధవారం మోటకట్ల, పీయన్‌కాలనీ గ్రామాల్లో జన్మభూమి-మా ఊరు గ్రామసభలు ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దార్ చంద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. చివరిగా జానంవాండ్లపల్లె ప్రజలు ఒక్కసారిగా సభవద్దకు గుంపుగా వచ్చి మా ఊరికి ఏం చేశారని అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీశారు. గ్రామంలో తాగునీరు, సీసీరోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు లేవు. మాఊరు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ప్రజలు పంచాయతీకి ఓట్లువేసి గెలిపించలేదా అంటూ సర్పంచిని అడిగారు. సర్పంచి పదవి కాలం ముగియవస్తున్నా ఇంత వరకు ఎటువంటి అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవుసార్ అని ఎంపీడీవో రమేష్‌బాబు వద్ద వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం అధికారులైనా గ్రామాల్లో పర్యటించినట్లయితే వారికి ఊరి సమస్యలు తెలిసి ఉండేవి. జన్మభూమిలో అవిచేస్తా ఇవిచేస్తాం అని అధికారులు గొప్పలు చెబుతున్నారే తప్ప అవి ఇంత వరకు ఆచరణకు మాత్రం నోచుకోలేదు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, పీయన్ కాలనీ సర్పంచి శశిధర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సావిత్రి, ఈవోఆర్డీ నరసింహులు, ఏవో రమేష్‌బాబురావ్, ఏఈలు రాజన్న, జయప్రకాశ్‌నాయక్, స్థానిక నాయకులు కాకులపల్లె రమణారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి అన్నిశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రాయచోటి గ్రామీణ: సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీకాంతమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిగువ అబ్బవరంలో జన్మభూమి-మాఊరు సభలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికే సభలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఇచ్చిన ప్రతి వినతికి జవాబుదారీ తనం ఉంటుందన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ...నూతనంగా రేషన్ కార్డులు మంజూరయ్యాయని వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు అందిస్తారన్నారు. అన్నీ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. తెదేపా జిల్లా కోశాధికారి వెంకటసుబ్బయ్యనాయుడు ప్రసంగిస్తూ... జన్మభూమి సమస్యల పరిష్కార వేదికన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోమశేఖర్, తహసీల్దారు మదుసూధన్‌రెడ్డి, ఎంపీడీవో సోమశేఖర్, ఎంఈవో రామకృష్ణమూర్తి, ఏపీవో పార్వతమ్మ, ఏపీఎం లక్ష్మీ, హెచ్‌వో వనితాబాయి, ఏఈలు వసంతరామిరెడ్డి, గంగరాజు, చెన్నకేశవరెడ్డి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు శివసుబ్బమ్మ, పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



గాలివీడు: పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి

లక్కిరెడ్డిపల్లె: రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయచోటి నియోజకవర్గ జన్మభూమి కమిటీ ఇన్‌చార్జి, అదనపు డైరెక్టర్ విజయ్‌చంద్ర పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కుర్నోత్తల పంచాయతీలోని అగ్రహారం గ్రామ సచివాలయంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలవారిని అన్నివిధాలా ఆదుకోవడానికి జన్మభూమి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు చంద్రన్న కనుకలు, రేషన్‌కార్డులు, పింఛన్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్‌రెడ్డి, తహసీల్దారు వెంకటరమణ, ఏపీడీ శివప్రసాద్, ఎంఈవో చక్రేనాయక్, కార్యాలయ అధికారి హైదర్‌వలి, సర్పంచి లక్ష్మీదేవి, ఎంపీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, వైద్యులు రియాజ్‌బేగ్, శ్రీగిరీషా, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రాచమ్మ, పశువైద్యులు, వైద్య సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తూమకుంట(గాలివీడు): మండలంలో జన్మభూమి- మా ఊరు గ్రామసభలు విజయవంతంగా సాగుతున్నాయి. గ్రామస్థులు అధిక సంఖ్యంలో పాల్గొని సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పిస్తున్నారు. తూముకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జన్మభూమి గ్రామసభ సర్పంచి అనితమ్మ ఆధ్యక్షతన నిర్వహించారు. గ్రామస్థులు ఇస్తున్న అర్జీలను ఆన్‌లైను చేస్తామని తహసీల్దారు పి.భవాని పేర్కొన్నారు. వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపి సత్వర పరిష్కారం చేసుందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డీసీ పెంచలయ్య, ఐసీడీఎస్, వెలుగు, ఉపాధి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు

తల-ముడిపి(గాలివీడు): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో బుధవారం జన్మభూమి-మా ఊరు గ్రామసభ నిర్వహించారు. రేషనుకార్డులు, సామాజిక పింఛన్లు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ సామాజిక పింఛన్లు మంజూరు కాలేదని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచి కంచంరెడ్డి, తలముడిపి నీటిసంఘం అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లి(రాయచోటి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపల్లిలో బుధవారం జన్మభూమి-మా ఊరు గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హులకు అందచేయాలన్నారు. దివంగతనేత వైఎస్ఆర్ హయాంలో పట్టణానికి భారీ నీటి పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. అన్ని ప్రాంతాలకు తాగునీరు వచ్చేందుకు అవసరమైన పైపులైన్లను వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు అదనపు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ ఛైర్మన్ గాజుల ఖాదర్‌బాషా, పురపాలిక కమిషనర్ బి.ప్రసాద్‌రాజు, వైస్ ఛైర్మన్ ఇదాయతుల్లా, కో-ఆప్షన్ సభ్యుడు సలావుద్దీన్, కౌన్సిలర్లు ఆనందరెడ్డి, సహదేవ, డీఈ సుబ్రహ్మణ్యం, మెప్మాఅధికారి వి.బాబా, ఇతర శాఖల అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పడమటకోన(చిన్నమండెం): పేదల సంక్షేమమే తెదేపా ధ్యేయంగా పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తోందని తెదేపా మండలాధ్యక్షుడు బి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. జన్మభూమి-మాఊరు గ్రామసభలు బుధవారం పడమటికోన, చిన్నర్సుపల్లె గ్రామాల్లో సర్పంచులు జయమ్మ, సునితమ్మ ఆధ్వర్యంలో ఎంపీడీవో జీవీ రమణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి గుణశేఖరపిళ్లై, తహసీల్దారు మల్లికార్జున పర్యవేక్షణలో నిర్వహించారు. చిన్నర్సుపల్లె గ్రామసభకు హాజరైన నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

బండపల్లి(రామాపురం): పేదల సంక్షేమమే జన్మభూమి ధ్యేయమని లక్కిరెడ్డిపల్లి మార్కెటింగు కమిటీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బండపల్లిలో బుధవారం సర్పంచి వెంకటరమణ ఆధ్వర్యంలో జన్మభూమి-మా ఊరు గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు దేవలానాయక్, ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఎంఈవో రామకృష్ణుడు, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు యర్రబోలు శేఖర్, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు నాసిరకం కోడిగుడ్లు పంపిణీ



ఆటోలో ఉన్న నాసిరకం కోడిగుడ్లు

సంబేపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వం చిన్నపిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో బాలామృతం అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం కింద విద్యార్థులకు కోడిగ్రుడ్లు, నూనె, పప్పులు వంటి వస్తువులను పంపిణీ చేస్తుంది. అయితే టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు మాత్రం వారికి ఇష్టమెచ్చిన సరకులను దింపేస్తున్నాడు. ఇదేమని అడిగేవారే కరవయ్యారు. ఏమిటంటే టెండరు దక్కించుకున్న గుత్తేదారు అధికార పార్టీకి చెందినవారు కావడంతో అధికారులు ఎవరూ ఏమీ మాట్లాడలేక మిన్నకుండి పోతున్నామని పేర్కొంటున్నారు. బుధవారం మండలంలోని ప్రకాశ్‌నగర్ కాలనీ గ్రామంలోని కేంద్రానికి పంపిణీ చేశారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి చిన్నపిల్లలకు అందించే వాటిలో నాసిరకం ఉంటే వారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అట్టపెట్టెలోనే పగిలిన కోడిగుడ్లు

రాయచోటి

ప్రతి కుటుంబంలో ఆనందం

రాజంపేట, న్యూస్‌టుడే : ప్రతి కుటుంబంలో ఆనందం కనిపించాలని, సంక్రాంతి పండుగను సంబరంగా జరుపుకోవాలని మాజీ కౌన్సిలర్ సుబ్బరామిరెడ్డి, మన్నూరు నీటి సంఘం అధ్యక్షుడు ఇడిమడకల కుమార్ ఆకాంక్షించారు. స్థానిక మన్నూరు చౌకదుకాణంలో బుధవారం చంద్రన్న సంక్రాంతి కానుకలను వారు లబ్ధిదారులకు అందజేశారు.

సామాజిక చైతన్యానికి ప్రతీక సావిత్రిబాయిపూలే


మహిళా ఉపాధ్యాయులకు సన్మానం


పెద్దజంగంపల్లె ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు,


బాలికల ఉన్నత పాఠశాలలో పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నేతలు

కొత్తపేట(రాయచోటి), న్యూస్‌టుడే: భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిభాయిపూలే సామాజిక విప్లవకారిణి, విద్యా కిరణంగా భారత సమాజం కీర్తించవచ్చని ప్రజా సంఘాల నేతలు కొనియాడారు. కొత్తపేటలోని బాలికోన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిభాయి పూలే 187వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.జాబీర్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిలో సావిత్రిభాయి సామాజిక విప్లవం సృష్టించిందన్నారు. 1830 దశకంలో ఆర్థిక భూస్వామ్య పోకడలు వేళ్లూనుతున్న నేపథ్యంలో కులం సంకెళ్లను తెంచుకుని బహుజనుల బాల, బాలికలకు విద్యను నేర్పించడంలో భర్త మహాత్మాజ్యోతిరావుపూలే ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. 1848లో రెండు పాఠశాలలు స్థాపించి 1876-77 మధ్య కాలంలో 50 పాఠశాలలను నెలకొల్పారన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ వితంతు పునర్వివాహానికి ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారన్నారు. బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాటం సాగించి వితంతు పునర్వివాహ చట్టం తీసుకొచ్చేందుకు దోహద పడిందని చెప్పారు. అగ్రకులాల లైంగిక వేధింపులకు గురైన బాలికలను ఆదుకునేందుకు శరణాలయాలు నెలకొల్పి సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు విస్తృత ప్రచార చర్యలు చేపట్టిన మహనీయురాలని ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మీ పేర్కొన్నారు. 1897లో మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి విజృంభించి జనాభాను కభలిస్తుంటే భయపడకుండా ఎందరికో పక్కనే ఉండి మెరుగైన సేవలు అందించిన ఘనత ఆమెకు దక్కిందని దండోరా జాతీయ నాయకులు ఎస్.రామాంజనేయులు పేర్కొన్నారు. అనంతరం సావిత్రి భాయిపూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు పి.తాతయ్య, రజక సంఘం జిల్లా నాయకులు రమేష్, శ్రీనివాసులు, కిసాన్‌సెల్ జిల్లా నాయకులు ఆర్.చెన్నకృష్ణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజారమేష్, సీఐటీయు కార్యదర్శి రామాంజులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాసాపేట(రాయచోటి): సామాజిక చైతన్యానికి సావిత్రిభాయిపూలే ప్రతీకగా నిలిచారని అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం.మానస పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళ ఉపాధ్యాయినిల దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహిళ సాధికారిత, వారి హక్కుల కోసం కృషి చేసిన సావిత్రిభాయిపూలే జీవితం అందరికి ఆదర్శనీయమన్నారు. భారత ప్రభుత్వం సావిత్రిభాయిపూలే జన్మదినాన్ని మహిళ ఉపాధ్యాయుల దినోత్సవంగా నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపాలంటే విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మూఢ నమ్మకాలను నిర్మూలించడం, మహిళల హక్కుల అమలుకు ప్రతి మహిళ విద్యావంతురాలు కావాలని కోరారు. పాఠశాలలోని మహిళ ఉపాధ్యాయినిలు ప్రభావతి, వసుంధర లక్ష్మీ, ఫైరోజా, రాజేశ్వరి, జయప్రద, రమాదేవిలను దుశ్శాలవలు, పూల మాలలతో న్యాయమూర్తి మానస ఘనంగా సత్కరించి విద్యాభివృద్ధిలో వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుగవాసి సుధాకర్, ఉపాధ్యాయులు వెంకట్రామయ్య, నరసింహులు, లక్ష్మీ నారాయణ, నాగన్న, జగదీష్, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రాజు, శ్రీనులు పాల్గొన్నారు.

గాలివీడు: భారతదేశ ఆణిముత్యం సావిత్రిభాయి పూలే అని ప్రధానోపాధ్యాయుడు బి.రెడ్డెన్న పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా చేశారు. సావిత్రిభాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఉపాధ్యాయులు అలియాబేగం, నిర్మిలాదేవి, మధుమతి, శివలక్ష్మి, సౌభాగ్యమ్మ, దుర్గాదేవి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనితను ఉపాధ్యాయ బృందం సన్మానించారు. జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు బుధవారం పాఠశాలలో నిర్వహించారు. సావిత్రిభాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. హెచ్‌ఎంను దుశాలువ కప్పి సన్మానం చేశారు.

సంబేపల్లె: మహిళాలోకానికే ఆదర్శం సావిత్రీబాయి పూలని అని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దజంగంపల్లె ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళా ఉపాధ్యాయురాలును సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళ ప్రాముఖ్యతను 170 సంవత్సరములకు ముందే గుర్తించిన ఆదర్శమహిళ సావిత్రిచి నూపూలే అని కోనియాడారు. మహిళల కోసం పాఠశాలలు స్థాపించిన మొదటి ఉపాధ్యాయురాలు అన్నారు. ఆమె తన జీవితాంతం సాంఘిక దురాచాలపై బాల్యవివాహం, అంటరానితనం నిర్మూలన, స్త్రీ విధ్య నిరాకరణ, వితంతువుల పునర్వివాహం, స్త్రీ విధ్యను ప్రోత్సహించడం, అనాథ ఆదుకోవడం, వంటి సామాజిక కార్యక్రమాలను చేపట్టారన్నారు. వీరి జీవితం మహిళ కోసం, పేదల కోసం త్యాగం చేసిన మహిళ ఆమె అన్నారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకుని పాఠశాలలో వకృత్య, వ్యాసరచన పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సుహాసిని అనే ఉపాధ్యాయురాలిని శాలువ కప్పి, పూలమాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, చక్రపాణి, నాగరాజు, సుమంత్‌సేన్, చంద్రయ్య, నాజర్‌హుసేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

రాయచోటి, న్యూస్‌టుడే: సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవోహోంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హక్కులను కాలరాసే నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వాలపై పోరాటానికి ఉద్యోగులు సిద్ధం అవుతారన్నారు. పింఛను బిక్ష కాదని ఉద్యోగుల హక్కుగానే చూడాలన్నారు. పాత పింఛను విధానం అమలు చేసే వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు ఐక్యతగా పోరాటం సాగించాలని కోరారు. పింఛను సాధన కోసం అందరు కలిసికట్టుగా ముందుకు రావాలని ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. జనవరి 9న సీపీఎస్ రద్దు కోసం అన్ని తాలూకా కేంద్రాలలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎన్జీవో సంఘ రాయచోటిశాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్జీవో సంఘ కార్యదర్శి శ్రీనివాసులు, రాయచోటిశాఖ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, బలరామరాజు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, పింఛనుదార్లు పింఛనుదార్ల సంఘం నాయకులు గంగిశెట్టి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రాయచోటి, న్యూస్‌టుడే: స్త్రీ వాద కలికితురాయి సావిత్రి బాయి పూలే మహోన్నత వ్యక్తి అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు అష్రఫ్‌అలీ పేర్కొన్నారు. మండలంలోని దూళ్లవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి జయంతి పురష్కరించుకుని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత జాతి చరిత్రలో బ్రిటీష్ పాలనలో అంటరాని కులాలను, మహిళలను అతి దుర్మార్గంగా హింసించారన్నారు. ఆనాటి గంజాయి లాంటి వనంలో తులసి మొక్కలా ఉదయించిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి అని కొనియాడారు. మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని నయాగావ్‌లో 1831 జనవరి 3న జన్మించారన్నారు. మహిళ శక్తిగా దేశానికి ఆమె అందించిన సేవలను వక్తలు అమోఘమని కొనియాడారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు.

పులివెందులకెళ్లిన మైనార్టీ మహిళలు


కుట్టుశిక్షణ పూర్తిచేసిన మహిళలతో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఖాదర్‌బాషా, మైనార్టీ కార్పొరేషన్ అధికారి హేమచంద్ర

రాయచోటిగ్రామీణ, న్యూస్‌టుడే: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ పూర్తిచేసిన రాయచోటికి చెందిన 30 మంది మైనార్టీ మహిళలు బుధవారం పులివెందులలో సీఎం చంద్రబాబు పాల్గొనే జన్మభూమి-మాఊరు గ్రామ సభకు వెళ్లారు. రాయచోటికి చెందిన 180 మందికి మహిళలు ఇదివరకే కుట్టుశిక్షణ పూర్తిచేశారు. మార్కెట్ కమిటి ఛైర్మన్ గాజుల ఖాదర్‌బాషా, మైనార్టీకార్పొరేషన్ క్షేత్రాధికారి హేమచంద్రలు రాయచోటి నుంచి మహిళలను పులివెందులకు తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు మహిళలకు కుట్టుమిషన్లు అందించారు.. తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి మైనార్టీ సంక్షేమం కోసం కృషిచేస్తున్నారని గాజుల ఖాదర్‌బాషా తెలిపారు.

వృత్తి నైపుణ్య విద్యను ఉచితంగా అందించాలి

రాయచోటిగ్రామీణ, న్యూస్‌టుడే: వృత్తి నైపుణ్య విద్యను ఉచితంగా అందించాలని ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏస్టీయూ కార్యాలయంలో సావిత్రిభాయిపూలే జన్మదిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సావిత్రిభాయిపూలే బాల్యం నుంచే బాలిక విద్య ఆవశ్యకత గుర్తించి 52 పాఠశాలలను స్థాపించి, పలువురికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తొలిమహిళ ఉపాధ్యాయులుగా ఆమె సేవలను కొనియాడారు. సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి కృషిచేశారన్నారు. కుటుంబంలోని మహిళలు విద్యావంతులైతే కుటుంబంతోపాటు సమాజం అభివృద్ధి చెందుతోందన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించాలన్నారు. కేజీనుంచి పీజీవరకు ఉచితంగా విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం మహిళలకు మరిన్ని ప్రోత్సహాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాధరెడ్డి, జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి, ఉపాధ్యక్షుడు దర్మారెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు అజీజుర్‌రహిమాన్, మన్సూర్‌బాషా, మురళీ,వెంకటేశ్వరరెడ్డి భూషణ్ రెడ్డి,వాసుదేవరెడ్డి, జగదీష్,. గంగిరెడ్డిలు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి